Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక: 173 హైదరాబాద్, 28-12-2025, ఆదివారం పేజీలు: 12 వెల: 1.00

## ఐఏఎస్ లకు కేంద్రం షాక్

హైదరాబాద్: ఐఏఎస్ (ఎఐా) అధికారులకు కేంద్ర ప్రభుత్వం గట్టి హెచ్చరిక జారీ చేసింది. నిర్దేశిత గడువులోగా తమ ఆస్తుల వివరాలను వెల్లడించకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేసింది.

అవసరమైతే పదోన్నతులను కూడా నిలిపివేస్తామని పేర్కొంది. ఎఐా అధికారులు తమ వార్షిక స్థిరాస్తి వివరాలను 2026 జనవరి 31లోగా తప్పనిసరిగా దాఖలు చేయాలని ఆదేశించింది. గడువు దాటితే ప్రమోషన్లపై ప్రభావం ఉంటుందని తెలిపింది.

# ఢిల్లీలో హై అలర్ట్..

## 285 మంది అరెస్ట్

న్యూఢిల్లీ: డిసెంబర్ 27, (భారతశక్తి):

కొత్త ఏడాది సమీపిస్తున్న తరుణంలో దేశ రాజధాని ఢిల్లీలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా స్థానిక పోలీసులు చర్యలు ప్రారంభించారు. సౌత్ ఈస్ట్ డిస్ట్రిక్ట్ పరిధిలో నిర్వహించిన ఈ భారీ ఆపరేషన్‌లో ఏకంగా 285 మంది నేరగాళ్లను పోలీసులు కటకటాల వెనక్కి తరలించారు. ఈ ఆకస్మిక దాడుల్లో భారీ ఎత్తున మారణాయుధాలు, మత్తు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నూతన సంవత్సర వేడుకల్లో అసాంఘిక శక్తులు చెలరేగిపోయే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో పోలీసులు ఈ మెగా డ్రైవ్ నిర్వహించారు.

'ఆపరేషన్ ఆఘాత్' పేరుతో చేపట్టిన ఈ దాడుల్లో పోలీసులు పక్కా వ్యూహంతో నేరస్తుల అడ్డాగా పేరున్న పలు ప్రాంతాల్లో



ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో 40కి పైగా అక్రమ ఆయుధాలు, లక్షలాది రూపాయల నగదు లభ్యమైంది. వీటితో పాటు భారీ పరిమాణంలో డ్రగ్స్, అక్రమ మద్యం నిల్వలను కూడా పోలీసులు ధ్వంసం చేశారు. సుమారు 1,000 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, నేర చరిత్ర ఉన్న 285 మందిని అధికారికంగా అరెస్ట్ చేసినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. వ్యవస్థీకృత నేరగాళ్ల నెట్‌వర్క్‌ను నిర్మూలించడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ సాగిందని పోలీస్ వర్గాలు తెలిపాయి.

# ఈ ఏడాది హైదరాబాద్ నగరంలో నేరాలు

## 15 శాతం తగ్గాయి: సీపీ సజ్జనార్

హైదరాబాద్:, డిసెంబర్ 27, (భారతశక్తి):

నేరాల నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించామని హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ అన్నారు. ఆపరేషన్ కవచ్, డ్రోన్ల వినియోగంలో ముందున్నట్లు తెలిపారు. తెలంగాణలో అడుగుపెట్టేందుకు ఇతర రాష్ట్రాల నేరగాళ్లు భయపడుతున్నారని చెప్పారు. 2025 వార్షిక నేర నివేదికను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

"సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది హైదరాబాద్ నగరంలో నేరాలు 15 శాతం తగ్గాయి. సైబర్ నేరాలు 8 శాతం, మహిళలపై నేరాలు 6 శాతం తగ్గాయి. పోక్సో కేసులు కూడా బాగా తగ్గాయి. గతేడాది అత్యాచార కేసులు 484 నమోదైతే ఈ ఏడాది 405 నమోదయ్యాయి. కిడ్నాప్ కేసులు గతేడాది 324 నమోదైతే ఈ ఏడాది 166 ఫైల్ అయ్యాయి. ప్రాపర్టీ వివాద కేసులు 64 శాతం మేర తగ్గాయి. నేరాల్లో శిక్షలు పడిన కేసుల సంఖ్య కూడా బాగా పెరిగింది. రోడ్డు ప్రమాదాల సంఖ్య 3,058



నుంచి 2,678కి తగ్గింది.

సైబర్ నేరాల విషయంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సమర్థంగా పనిచేస్తోంది. నేరాల నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించాం. డ్రగ్స్ ఫ్రీ సొసైటీ కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది. మాదకద్రవ్యాల నియంత్రణకు మరిన్ని టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే ఏడాది జోనల్ వారీగా నార్కోటిక్ టీమ్‌లు ఏర్పాటు చేస్తాం. న్యూ ఇయర్ వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలి. బహిరంగ వేడుకలు నిర్వహించాలని సూచిస్తున్నాం. మద్యం తాగిన వారు బయటకు రావొద్దని హెచ్చరిస్తున్నాం. కుటుంబ సభ్యులతో ఇళ్లలోనే వేడుకలు చేసుకుంటే మంచిది. రాష్ అండ్ డేంజరస్ డ్రైవింగ్ కట్టడికి మరిన్ని చర్యలు చేపడతాం" అని సజ్జనార్ తెలిపారు.





# సంధ్య థియేటర్ తొక్కిసలాటపై

# ఛార్జ్‌షీట్ దాఖలు

హైదరాబాద్: డిసెంబర్ 27, (భారతశక్తి):

పుష్ప-2 మూవీ విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన రాష్ట్రంలో కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. అల్లు అర్జున్, రష్మిక మందన్నా జంటగా నటించిన పుష్ప 2 సినిమా డిసెంబర్ 3వ తేదీ రాత్రి ప్రీమియర్లు షో పడ్డాయి. ప్రీమియర్ షో చూడ్డానికి హైదరాబాద్‌కు చెందిన రేవతి, ఆమె కుమారుడు శ్రీతేజ్ సంధ్య థియేటర్‌కు వెళ్లారు. ఈ నేపథ్యంలోనే థియేటర్ దగ్గర తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ తొక్కిసలాటలో రేవతి అక్కడికక్కడే చనిపోయింది. శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడ్ని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.ఈ ఘటనకు సంబందించి తాజాగా చిక్కడపల్లి పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. పోలీసులు 23 మంది నిందితులను ఛార్జ్‌షీట్‌లో చేర్చారు. సంధ్య థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తొక్కిసలాట జరిగిందని పోలీసులు నిర్ధారించారు. పుష్ప 2 హీరో అల్లు అర్జున్‌ను ఏ11గా.. సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని ఏ1గా చేర్చారు. ముగ్గురు మేనేజర్లు , 8 మంది బౌన్సర్లను సైతం ఛార్జ్ షీట్‌లో చేర్చారు. అంతేకాదు నలుగురు ప్రత్యక్ష సాక్షులను కూడా పోలీసులు ఛార్జ్‌షీట్‌లో చేర్చారు. 2024 డిసెంబర్ నెలలో తొక్కిసలాట ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే.

# మోదీని ప్రశంసిస్తూ

# దిగ్విజయ్ సింగ్ కామెంట్స్

న్యూఢిల్లీ: డిసెంబర్ 27, (భారతశక్తి):

కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ దిగ్విజయ్ సింగ్ సంచలన కామెంట్స్ చేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలను ప్రశంసిస్తూ సోషల్ మీడియా పోస్ట్ పెట్టారు. ఒకప్పుడు సాధారణ కార్యకర్తలా పనిచేసిన వ్యక్తి అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ప్రధానిగా ఎదిగారన్నారు. ప్రధాని మోదీ 1990 దశకంలో ఉన్న చిత్రాన్ని తన ఎక్స్ ఖాతాలో జోడిస్తూ ఈ కామెంట్ చేశారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు కాంగ్రెస్‌ను ఇరుకున పడేశాయి.

ప్రస్తుతం కాంగ్రెస్ వ్యవహారం చూస్తుంటే పెనం లోంచి పొయ్యి మీద పడ్డ చందాన కనిపిస్తుంది. ఇప్పటికే తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యలు తరచుగా ఆ పార్టీని ఇబ్బందులకు గురిచేస్తూ సంస్థాగత లోపాలను ప్రశ్నిస్తుంటే.. తాజాగా మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఆ పార్టీ కీలక నేత దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్యలు హస్తానికి కొత్త చిక్కులు తెచ్చిపెట్టాయి.దిగ్విజయ్ సింగ్, ప్రధాని మోదీకి సంబంధించిన 1990 దశకం చిత్రాన్ని తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఆ చిత్రంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి శంకర్ సింగ్ వాఘేలా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంలో




తీసింది. ఇందులో బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ ఉన్నారు. ఇందులో ప్రధాని మోదీ సాధారణ కార్యకర్తలా అద్వానీ ముందు నేలపై కూర్చొని ఉన్నారు. ఆ చిత్రాన్ని ప్రశంసిస్తూ దిగ్విజయ్ సింగ్ పోస్ట్ చేశారు.''ఈ చిత్రాన్ని నేను కోరాలో చూశాను. ఇది చాలా ఇంపాక్ట్ ఫుల్ అనిపించింది. ఆర్ఎస్ఎస్, బీజేపీ, జనసంఘ్ సంస్థాగత నిర్మాణం ఎలా ఉంటుందో ఈ చిత్రం తెలుపుతుంది. ఒకప్పుడు నాయకుల ముందు నేలపై కూర్చున్న వ్యక్తి ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఇప్పుడు దేశానికే ప్రధాని అయ్యారు. ఇది సంస్థ యె?క్క గొప్పతనానికి నిదర్శనం. జైశ్రీరామ్'' అని దిగ్విజయ్ సింగ్ ట్వీట్ చేశారు. అంతేకాకుండా ఆ పోస్టును ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు ట్యాగ్ చేశారు. ఈ పోస్టుతో బీజేపీ కాంగ్రెస్‌పై అటాక్ స్టార్ట్ చేసింది. దిగ్విజయ్ సింగ్ పోస్టులకు రాహుల్ సమాధానం ఇవ్వగలరా అని ప్రశ్నించింది. అయితే దీనిపై స్పందించిన దిగ్విజయ్ సింగ్ తాను ఆర్ఎస్ఎస్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని తెలిపారు. తాను కేవలం ఆర్గనైజేషన్ సంస్థగత నిర్మాణాన్ని మాత్రమే తాను ప్రశంసించానని తెలిపారు.కాగా వారం రోజుల క్రితం దిగ్విజయ్ సింగ్ కాంగ్రెస్ పార్టీలోని లోపాలను బహిరంగంగా ప్రశ్నించారు "రాహుల్ గాంధీ ఎలక్షన్ కమిషన్‌కు ఎలా సంస్కరణలు అవసరమో కాంగ్రెస్‌కు సైతం అదేవిధంగా సంస్కరణలు అవసరం.

# ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచా..

## ఉప ఎన్నిక వస్తే మళ్లీ విజయమే: దానం

హైదరాబాద్: డిసెంబర్ 27 (భారతశక్తి):

రాజీనామా అంశం, ఉపఎన్నికల్లో పోటీ చేయడంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హిమాయత్‌నగర్ డివిజన్ కార్యకర్తలతో ఆయన సమావేశమై మాట్లాడారు. రాజీనామా చేసి ఉపఎన్నికలకు వెళ్లేందుకు తనకు ధైర్యం ఉందని.. అది కార్యకర్తల ద్వారా వచ్చిందని చెప్పారు. కార్యకర్తల అండతోనే ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినట్లు చెప్పారు. ఉపఎన్నిక వస్తే మళ్లీ గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. సీఎం పదవికి గౌరవం ఇవ్వడం మరిచింది బీఆర్ఎస్ నేతలే అని విమర్శించారు. ముఖ్యమంత్రిని ఏకవచనంతో అగౌరవంగా మాట్లాడింది ఆ పార్టీ వాళ్లేనని మండిపడ్డారు. విమర్శలు చేస్తే.. ప్రతివిమర్శలూ ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



# టిప్పర్ లారీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు..

## 22 మందికి గాయాలు

హైదరాబాద్ : డిసెంబర్ 27 (భారతశక్తి):

: సంగారెడ్డి జిల్లా కంది సమీపంలో ఔఊ 65పై రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న టిప్పర్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో 22 మంది ప్రయాణికులకు గాయాలు కాగా వారిని జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించారు. మెదక్ నుంచి పటాన్‌చెరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 60 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ఘటనకు కారణమని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

# పరుగుల పెడుతున్న రాఫ్ట్ ఫౌండేషన్ పనులు



విజయవాడ, డిసెంబర్ 27, (భారతశక్తి):

నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణంలో మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్ర హైకోర్టు శాశ్వత భవన నిర్మాణానికి సంబంధించి అత్యంత కీలకమైన రాఫ్ట్ ఫౌండేషన్ పనులను పురపాలక శాఖ మంత్రి నారాయణ అధికారికంగా ప్రారంభించారు. ప్రత్యేక పూజల అనంతరం నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన ఈ పనులకు శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వం చేసిన అవకతవకల వల్ల అమరావతి పనులు నిలిచిపోయాయని, ఇప్పుడు మళ్లీ రెట్టింపు వేగంతో రాజధానిని నిర్మిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి నారాయణ తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత ఆర్కిటెక్చర్ సంస్థ నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్ రూపొందించిన అద్భుతమైన డిజైన్‌తో ఈ హైకోర్టు భవనం రూపుదిద్దుకుంటోంది. మొత్తం బేస్‌మెంట్, గ్రౌండ్ , 7 అంతస్తుల విధానంలో ఐకానిక్ భవనంగా దీనిని నిర్మిస్తున్నారు. సుమారు 21 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో , 52 కోర్టు హాల్స్‌తో ఈ భవనం నిర్మితమవుతోంది. 2, 4, 6 అంతస్తుల్లో కోర్టు హాళ్లు ఉండగా, 8వ అంతస్తులో ప్రధాన న్యాయమూర్తి కోర్టును ఏర్పాటు చేయనున్నారు. ఈ భారీ భవనం కోసం దాదాపు ×45,000 టన్నుల స్టీల్‌ను వినియోగిస్తుండటం విశేషం. ఈ భవన నిర్మాణంలో రాఫ్ట్ ఫౌండేషన్ అనేది అత్యంత కీలకం. సాధారణంగా చిన్న భవనాలకు విడివిడిగా పిల్లర్లు వేస్తారు. కానీ, హైకోర్టు వంటి భారీ భవనాలు, ఐకానిక్ స్ట్రక్చర్స్ నిర్మించేటప్పుడు భవనం మొత్తం బరువును నేల అంతటా సమానంగా పంపిణీ చేయడానికి ఒక పెద్ద కాంక్రీట్ స్లాబ్‌ను పునాదిగా వేస్తారు. దీనినే 'రాఫ్ట్' లేదా 'మ్యాట్' ఫౌండేషన్ అంటారు. నేల స్వభావం మెత్తగా ఉన్నప్పుడు లేదా భవనం బరువు విపరీతంగా ఉన్నప్పుడు, భవనం కుంగిపోకుండా ఉండటానికి ఈ పద్ధతిని ఉపయోగిస్తారు.

ఇది భవనానికి అపారమైన స్థిరత్వాన్ని , పటుత్వాన్ని ఇస్తుంది.రాజధానిలో నిర్మిస్తున్న 7 ఐకానిక్ భవనాల్లో హైకోర్టు ఒకటి. దీనిని 2027 చివరి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత ప్రభుత్వ హయాంలో పనులు నిలిచిపోవడంతో వ్యయం పెరిగిందని, అయినప్పటికీ వెనకడుగు వేయకుండా ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మాణాలను పూర్తి చేస్తామని మంత్రి నారాయణ ధీమా వ్యక్తం చేశారు. రాఫ్ట్ ఫౌండేషన్ పనులు ప్రారంభం కావడంతో, ఇకపై భవనం పనులు వేగంగా జరుగుతాయని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు.

# భువనేశ్వరి పొలిటికల్ ఎంట్రీ ఊహాగానాలు

తిరుపతి, డిసెంబర్ 27(భారతశక్తి):

నారా భువనేశ్వరి. పరిచయం అక్కర్లేని పేరు ఇది. నందమూరి తారక రామారావు కుమార్తెగా, చంద్రబాబు నాయుడు సతీమణిగా సుపరిచితులు ఆమె. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఆమె రాజకీయ పర్యటనలు చేస్తున్నారు. ముఖ్యంగా తన భర్త ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో పర్యటనలు చేస్తుంటారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బిజీగా మారిన నేపథ్యంలో తరచు అక్కడ పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటున్నారు భువనేశ్వరి. చాలా ఏళ్లుగా కుప్పం నియోజకవర్గానికి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. అయితే అక్కడ సొంత నివాసం కూడా లేదని రాజకీయ ప్రత్యర్థులు విమర్శలు చేసేవారు. దానికి చెక్ చెబుతూ కుప్పంలో సొంత ఇంటిని ఏర్పాటు చేసుకున్నారు చంద్రబాబు. భువనేశ్వరి తరచు అక్కడకు వెళ్తూ పార్టీ పరిస్థితిని తెలుసుకుంటూ ఉంటారు. మొన్ననే ఆమె కుప్పం వెళ్లి వచ్చారు. తాజాగా తన తండ్రి సొంత గ్రామం నిమ్మకూరులో పర్యటిస్తున్నారు భువనేశ్వరి. దీంతో ఆమె వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారని ప్రచారం ప్రారంభం అయింది. అయితే మరోవైపు మంత్రి నారా లోకేష్ సతీమణి బ్రాహ్మణి విషయంలో సైతం ఇటువంటి ప్రచారం వచ్చింది. దానిపై ఆమె క్లారిటీ ఇచ్చారు కూడా.స్వర్గీయ నందమూరి తారక రామారావుసొంత గ్రామం నిమ్మకూరు. కృష్ణాజిల్లాలోని పామర్రు మండలంలో ఉంటుంది ఈ గ్రామం. అయితే తరచూ నందమూరి తారక రామారావు కుటుంబ సభ్యులు ఈ గ్రామాన్ని సందర్శిస్తుంటారు. గతంలో నందమూరి బాలకృష్ణ సైతం ఈ గ్రామాన్ని సందర్శించారు. తాజాగా నారా భువనేశ్వరి ఆ గ్రామాన్ని సందర్శించారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంతో తమకున్న సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గ్రామస్తులతో మమేకమయ్యారు. వారితో ముచ్చటించారు. నారా భువనేశ్వరి రాకతో గ్రామంలో సందడి నెలకొంది. అయితే తరచూ ఇలా భువనేశ్వరి పర్యటనలు చేస్తుండడంతో పొలిటికల్ ఎంట్రీ పై రకరకాల చర్చ నడుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో చంద్రబాబు అరెస్టయ్యారు. ఆ సమయంలో నారా భువనేశ్వరి ధైర్యంతో ముందుకు సాగారు. చంద్రబాబును 52 రోజులపాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉంచారు. ఆ



సమయంలో భువనేశ్వరి రాజమండ్రిలోనే ఉండిపోయారు. తన భర్తను అకారణంగా అరెస్టు చేశారంటూ నాడు భువనేశ్వరి న్యాయం గెలవాలి అంటూ రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేశారు. అయితే అంతవరకు ఆమె రాజకీయ వేదికలను పంచుకోవడం లేదు. కానీ భర్త ఇబ్బందుల్లో ఉండడంతో ఆమె బయటకు రావడం తప్పలేదు. వాస్తవానికి భువనేశ్వరి మంచి వ్యాపారవేత్త. చంద్రబాబు హెరిటేజ్ సంస్థలను ఏర్పాటు చేసి రాజకీయాల్లోకి వచ్చేసారు. ఆ కంపెనీల బాధ్యతను సుదీర్ఘకాలం చూశారు భువనేశ్వరి. బ్రాహ్మణి రావడంతో పూర్తి బాధ్యతలు ఆమెకు అప్పగించి కేవలం మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో మాత్రమే కొనసాగుతున్నారు. అయితే ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఆయన స్వగ్రామం నిమ్మకూరులో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు భువనేశ్వరి. దీంతో ఆమె కృష్ణా జిల్లా నుంచి పొలిటికల్ ఎంట్రీ ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఆమె రాజకీయాల్లోకి రారు కానీ.. భర్త ప్రాతినిధ్య వహించే కుప్పం నియోజకవర్గ ప్రజలకు మాత్రం నిత్యం అందుబాటులో ఉంటున్నారు.

# రంగా వారసులు.. వేర్వేరు దారులు...

విజయవాడ, డిసెంబర్ 27 (భారతశక్తి):

ప్రముఖుల కుటుంబాలు ఐక్యతగా ఉంటేనే చూడాలని అనిపిస్తుంది. ఎవరికి వారు గా ఉంటే ఆ కుటుంబం ఇతరుల వద్ద చులకన కావడం ఖాయం. రాజశేఖర్ రెడ్డి మరణానంతరం వారి పిల్లలు వేరువేరుగా ఉంటున్నారు. రాజకీయ శత్రువులుగా మారారు. తెలంగాణ రాజకీయాల్లో కూడా అటువంటి పరిస్థితి. సోదరుడు కేటీఆర్ ను విభేదించి బయటకు వచ్చేసారు కవిత. రాజకీయాల్లో ఎన్ని రకాల పరిణామాలు నడుస్తున్న ఈ తరుణంలో.. వంగవీటి వారసులు కూడా అదే రకమైన తప్పటడుగులు వేస్తున్నారు. ఈరోజు వంగవీటి మోహన్ రంగా వర్ధంతి. కానీ పిల్లలిద్దరూ వేర్వేరు మార్గాల్లో వెళ్తున్నారు. రంగా రాధా మిత్రమండలి ద్వారా ముందుకు సాగుతున్నారు కుమార్తె ఆశా కిరణ్. తెలుగుదేశం పార్టీలో ఉన్న కుమారుడు రాధాకృష్ణ రూట్ మరోలా ఉంది.రంగా రాధా మిత్రమండలి ప్రారంభంలో చాలా యాక్టివ్ గా ఉండేది. మోహన్ రంగా మరణం సమయంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు జరిగేవి. క్రమేపి ఆ యాక్టివిటీస్ తగ్గాయి. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి రంగా పేరు ప్రముఖంగా వినిపించేది. అయితే ఇప్పుడు అదే రంగా రాధా మిత్రమండలిని క్రియాశీలకం చేస్తున్నారు ఆశా కిరణ్. మరోవైపు తెలుగుదేశం పార్టీలో ఉన్నారు రాధాకృష్ణ. అయితే ఆశాకిరణ్ సైతం త్వరలో పొలిటికల్ ఎంట్రీ ఇస్తారని ప్రచారం నడుస్తోంది. అయితే వీరిద్దరూ తమ రాజకీయ గమ్యాలపై స్పష్టత ఇస్తే బాగుంటుంది. ఎందుకంటే ఇద్దరి విషయంలో జరుగుతున్న ప్రచారం వేరేలా ఉంది. కొంత కన్ఫ్యూజన్ కూడా కనిపిస్తోంది.వంగవీటి మోహన్



రంగా వారసులుగా.. తమ నిర్ణయాలను అభిమానులతో పంచుకోవడం ఇప్పుడు ముఖ్యం. ఎందుకంటే వేరువేరు రాజకీయ మార్గాల్లో వెళితే ఆ కుటుంబానికే ఇబ్బంది కరం. అనుకున్నది సాధించలేరు కూడా. పైగా కుటుంబంలోనే ఐక్యత లేదు. ఇంకేం చేస్తారులే అని అభిమానులు కూడా విభజనకు గురయ్యే అవకాశముంది. అందుకే వారి రాజకీయ ఆజెండా, వెళ్లే మార్గాల గురించి క్లారిటీ ఇస్తే బాగుంటుంది. పైగా ఇద్దరూ వేరువేరుగా తమ తండ్రి కార్యక్రమాలను నిర్వహించడం అనేది తప్పుడు సంకేతం. ఆదిలోనే అది ఇబ్బందికర పరిస్థితులకు దారి తీసే అవకాశం ఉంది. ఈరోజు రంగా రాధా మిత్రమండలి ఆధ్వర్యంలో విశాఖ రంగా సేన భారీ బహిరంగ సభ జరగనుంది. ఆశా కిరణ్ లీడ్ తీసుకున్నారు. అయితే వంగవీటి రాధాకృష్ణ వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం విశేషం. ఇలా ముందుకు సాగితే మాత్రం రంగా వారసులకు లాభం కంటే నష్టమే అధికం.

# అనాధగా మారిన నాయుడు ఫ్యామిలీ

చిత్తూరు, డిసెంబర్ 27, (భారతశక్తి):

మాజీ ఎంపీ డీకే ఆదికేశవులు నాయుడు కుటుంబం రాజకీయంగా అనాధగా మారింది. చిత్తూరు మాజీ ఎంపీగా, టీటీడీ ఛైర్మన్ గా ఆదికేశవులు నాయుడు ఒకప్పుడు రాజకీయాలను శాసించారు. కానీ ఆయన మృతి తర్వాత ఆ కుటుంబం రాజకీయంగా ఇబ్బందులు పడుతుంది. ఒక హత్య కేసులో డీకే ఆదికేశవులు నాయుడు కుమార్తె, కుమారుడిని ఇప్పుడు సీబీఐ అరెస్ట్ చేయడం రాజకీయంగా సంచలనంగా మారింది. సీబీఐ అధికారులు డీకే ఆదికేశవులు నాయుడు కుమార్తె కల్పజ, కుమారుడు డీఏ శ్రీనివాస్ లను బెంగళూరులో అరెస్ట్ చేశారు. బెంగళూరులోని వారి నివాసంలో అరెసట్? చేసిన సీబీఐ అధికారులు తర్వాత వారిని విచారించి జైలుకు తరలించారు.ఈ ఇద్దరిపై నేరపూరిత కుట్ర, మోసం, ఫోర్జరీ, సాక్షాలను చెరిపేయడం వంటి ఆరోపణలను వీరిద్దరూ ఎదుర్కొంటున్నారు. వీరిద్దరితో పాటు కర్ణాటక మానవహక్కుల కమిషన్ డీఎస్పీ మోహన్ కూడా అరెస్టయిన వారిలో ఉండటం విశేషం. 2019 నాటి కేసు వీరి మెడకు చుట్టుకుంది. డీకే ఆదికేశవులు నాయుడు రఘునాథ్ మృతిచెందిన తర్వాత వీరిపై అనేక ఆరోపణలు వచ్చాయి. దీంతో హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఎంట్రీ ఇచ్చింది. రఘునాథ్ ఆదికేశవులు నాయుడు ఆస్తులకు బినామీగా ఉన్నారని భావించి ఆస్తులను తమ పేరిట బదిలీ చేయాలని వీరు వత్తిడి తేవడంతో ఆయన కొన్ని ఆస్తులను బదలాయించారు. మిగిలిన విషయంలో అవి తనవేనని చెప్పినా నమ్మలేదని, ఈ సమయంలోనే రఘునాథ్ అనుమానాస్పద మృతితో బాధితుల ఫిర్యాదు మేరకు సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ రంగంలోకి దిగి వీరిని అరెస్ట్ చేసింది.2019లో రఘునాథ్ మృతి చెందగా తర్వాత జరిగిన విచారణలో వీరిద్దరి ప్రమేయం ఉందని భావించి సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తొలుత బెంగళూరు పోలీసులు దర్యాప్తు చేసినా తమకు సరైన న్యాయం జరగలేదని భావించిన బాధిత కుటుంబం హైకోర్టును, తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కాగా ఆదికేశవులు నాయుడు కుమార్తె కల్పజ జనసేనలో ఉన్నారు. వీరిద్దరూ బెంగళూరులోనే ఉంటూ ఏపీ రాజకీయాల్లో యాక్టివ్ గా ఉండాలనుకున్నారు. కానీ చివరకు హత్య కేసులో అరెస్ట్ కావడంతో డీకే ఆదికేశవులు నాయుడు కుటుంబం రాజకీయంగా అనాధగా మారిందని అంటున్నారు. మొత్తం మీద డీకే ఆదికేశవులు నాయుడుకు ఉన్న పేరు ప్రతిష్ట మరింత దిగజారిపోయేలా చేశారని అనుచరులు ఆందోళన చెందుతున్నారు.

# అంతా యూత్.... ఆశలు గల్లంతు

గుంటూరు, డిసెంబర్ 27, ((భారతశక్తి):

తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగుదేశం పార్టీలో సీనియర్ల శకం ఇక ముగిసినట్లే కనిపిస్తుంది. తెలుగుదేశం పార్టీలో ఇప్పుడు నవతరం ఉరకలెత్తుతోంది. మొన్నటి ఎన్నికల తర్వాత చంద్రబాబు ముఖ్యమంత్రి గా ఉన్నప్పటికీ పార్టీ పూర్తిగా యువనేత లోకేశ్ చేతుల్లోకి వెళ్లిపోయింది. అంతెందుకు ప్రభుత్వం ఏర్పడిన మంత్రి వర్గం కూర్పు నుంచి నిన్నటి జిల్లా అధ్యక్షుల నియామకం వరకూ చూస్తే లోకేశ్ ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. తన యువగళం పాదయాత్రలో కనెక్ట్ అయిన యువలీడర్లకు లోకేశ్ పెద్ద పదవులు కట్టబెట్టడంలో వెనకాడటం లేదు. అదే రెండేళ్లుగా జరుగుతుంది. దీంతో సీనియర్లకు ఇక టీడీపీలో కనెక్షన్ కట్ అయినట్లే కనిపిస్తుంది. సీనియర్లు జీపీఎస్ లాంటి వారని యువలీడర్లు మిస్సైల్స్ వంటి వారని లోకేశ్ చెబుతున్నా వాస్తవానికి సీనియర్ నేతలు ఇక పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కనిపించకపోవచ్చు.ఇటీవల జరిగిన జిల్లా అధ్యక్షుల నియామకంలోనూ అందరూ యువ నాయకులకే జిల్లా పార్టీ పగ్గాలను అప్పగించారు. వారంతా లోకేశ్ టీంగా ముద్ర పడిన వారే. సామాజిక వర్గాలను పరిగణనలోకి తీసుకున్నప్పటికీ అందులోనూ లోకేశ్ సిఫార్సు చేసిన వారికే జిల్లా అధ్యక్ష పదవులు దక్కాయన్నది పార్టీ నేతలు అందరూ ఒప్పుకుంటున్న విషయం. సీనియర్లు ఇక సలహాలకే పరిమితమవ్వాల్సి ఉంటుంది. వారికి గౌరవం ఉంటుందంటూనే పదవులకు మాత్రం దూరం అని చేతల ద్వారా పార్టీ నాయకత్వం చెబుతుంది. ఇందుకు కారణాలు కూడా లేకపోలేదు. గత కొన్ని దశాబ్దాలుగా నియోజకవర్గాల్లో పాతుకుపోయి మరొకరిని ఎదగనివ్వకుండా, పార్టీ జెండా పట్టుకుని కష్టపడి పనిచేసిన వారిని కూడా దరిదాపుల్లోకి రానివ్వకుండా సీనియర్లు జాగ్రత్తపడటంతో ఈ చర్యలకు నాయకత్వం పూనుకుందన్న టాక్ పార్టీలో వినిపిస్తుంది.దీంతో సీనియర్ నేతలు ఇక పదవులపై ఆశలు వదులుకున్నారు. ఇప్పటికే చాలా మంది నేతలు తమ వారసులను పార్టీలోకి తెచ్చారు. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కోసం ప్రస్తుతం ఉన్న సీనియర్ నేతలలో ఎవరికీ ఉండవన్న సిగ్నల్స్ ఇప్పటికే అందడంతో తమ వారసులను ఇప్పటి నుంచే నియోజకవర్గంలో తిప్పుతూ పార్టీ కార్యక్రమాల్లో వాళ్లనే ముందుంచే కార్యక్రమాలను చేపడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా యువ నాయకత్వమే బరిలో ఉంటుందని సంకేతాలు నాయకులకు అందడంతో సీనియర్ ఎమ్మెల్యేలు కూడా ఇప్పుడే సర్దుకోవడం బెటరన్న ధోరణిలో ఉన్నారట. అందుకే దందాలకు తెరతీశారని కూడా అంటున్నారు. మొత్తం మీద తెలుగుదేశం పార్టీ లో సీనియర్లకు ఇక నో ఛాన్స్ అని బోర్డు పెట్టేసినట్లేనని అన్న టాక్ బలంగా వినిపిస్తుంది.

================



# జగన్, కేసీఆర్ మధ్య స్నేహసంకటం



హైదరాబాద, డిసెంబర్ 27,

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మిత్రత్వం, శతృత్వం అనేవి కేవలం వ్యక్తుల మధ్యే కాకుండా, రాష్ట్ర ప్రయోజనాల చుట్టూ తిరుగుతుంటాయి. ప్రస్తుతం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిస్థితి సరిగ్గా అలాగే ఉంది. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌తో జగన్‌కు ఉన్న సాన్నిహిత్యం, ప్రస్తుత నీటి యుద్ధాల నేపథ్యంలో జగన్‌ను తీవ్ర ఆత్మరక్షణలో పడేస్తోంది. కేసీఆర్ తాజాగా చేసిన వ్యాఖ్యలు అటు చంద్రబాబుకు మేలు చేకూరుస్తూ, ఇటు జగన్‌ను ఇరకాటంలోకి నెట్టేలా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.తెలంగాణ ప్రజలకు కేసీఆర్ ఆరాధ్య దైవం కావొచ్చు, కానీ సగటు ఆంధ్రుడి దృష్టిలో ఆయన రాష్ట్ర విభజనకు ప్రధాన కారకుడు. విభజన వల్ల కలిగిన ఆర్థిక లోటు, రాజధాని లేకపోవడం వంటి సమస్యలన్నీ కేసీఆర్ ఉద్యమ ఫలితమేనని ఏపీ ప్రజలు బలంగా నమ్ముతారు. అటువంటి వ్యక్తితో జగన్ బహిరంగంగా స్నేహం చేయడం మొదటి నుంచీ విమర్శలకు దారితీస్తూనే ఉంది. తాజాగా జగన్ పుట్టినరోజు సందర్భంగా తాడేపల్లిలో వెలిసిన కేసీఆర్-జగన్ ఉమ్మడి ఫ్లెక్సీలు ఈ బంధాన్ని మరోసారి చర్చనీయాంశం చేశాయి. రాష్ట్ర ప్రయోజనాల కంటే జగన్‌కు వ్యక్తిగత స్నేహాలే ముఖ్యమా? అనే ప్రశ్నను సామాన్య ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఇది ఒక అస్త్రంగా మారింది.కృష్ణా, గోదావరి నదీ జలాల విషయంలో ఏపీ, తెలంగాణ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ముఖ్యంగా రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు తమ రాష్ట్ర ప్రయోజనాల కోసం గట్టిగా పోరాడుతున్నారు. ఈ తరుణంలో కేసీఆర్ ప్రెస్ మీట్ పెట్టి.. "చంద్రబాబు తెలంగాణకు రావలసిన నీటిని అడ్డుకుంటున్నారు" అని ఆరోపించడం విశేషం. నిజానికి ఇది కేసీఆర్ చంద్రబాబుపై చేసిన విమర్శ అయినప్పటికీ, ఏపీ కోణంలో చూస్తే ఇది చంద్రబాబుకు లభించిన ఒక ప్రశంస. ఆంధ్రప్రదేశ్ హక్కుల కోసం చంద్రబాబు గట్టిగా నిలబడుతున్నారని, అందుకే పక్క రాష్ట్ర నేత ఆయనను తప్పుబడుతున్నారని ఏపీ ప్రజల్లో ఒక సానుకూల సంకేతం వెళ్లింది. ఒక రకంగా చెప్పాలంటే, ఏపీ ప్రయోజనాల పరిరక్షకుడిగా చంద్రబాబును కేసీఆర్ తన వ్యాఖ్యల ద్వారా ధ్రువీకరించారు.కేసీఆర్ ఏపీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేస్తున్నా, నీటి వాటాల విషయంలో ఇరు రాష్ట్రాల మధ్య గొడవ జరుగుతున్నా జగన్ మౌనంగా ఉండడం లేదా కేసీఆర్‌తో దోస్తీ కొనసాగించడం వైసీపీకి మైనస్‌గా మారుతోంది. ఒకవైపు చంద్రబాబు రాష్ట్రం కోసం పోరాడి కేసీఆర్ చేత విమర్శలు చేయించుకుంటుంటే, జగన్ మాత్రం అదే కేసీఆర్‌తో ఫ్లెక్సీలు కట్టించుకుంటున్నారా? అనే చర్చ సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. ముఖ్యంగా వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలు కూడా కేసీఆర్-జగన్ స్నేహాన్ని గొప్పగా ప్రచారం చేయడం వ్యూహాత్మక తప్పిదంగా కనిపిస్తోంది. ఇది క్షేత్రస్థాయిలో ఉన్న తటస్థ ఓటర్లలో ప్రతికూల భావనను కలిగిస్తోంది. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రులను విమర్శించిన వ్యక్తితో చేతులు కలపడం జగన్ ఇమేజ్‌ను డ్యామేజ్ చేసే ప్రమాదం ఉంది.రాజకీయాల్లో వ్యూహాలు వేర్వేరుగా ఉండవచ్చు, కానీ అవి రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు కాకూడదు. జగన్ తన రాజకీయ ఉనికి కోసం కేసీఆర్ అండను కోరుకుంటున్నారని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు ఈ ఫ్లెక్సీలు, ప్రస్తుత పరిణామాలు బలాన్ని చేకూరుస్తున్నాయి. జగన్ తన వైఖరిని స్పష్టం చేయకపోతే, జగన్ హయాంలో కేసీఆర్ మాట కోసమే ఏపీ ప్రయోజనాలను పణంగా పెట్టారు అనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లే అవకాశం ఉంది.కేసీఆర్ తన ప్రసంగంలో జగన్ పేరు ఎత్తకపోయినా, చంద్రబాబుకు క్రెడిట్ ఇవ్వడం ద్వారా పరోక్షంగా జగన్‌ను కార్నర్ చేశారు. రాజకీయంగా ఇది జగన్‌కు పెద్ద సవాలే. రాష్ట్ర సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న నీటి సమస్యల విషయంలో మౌనం వహించడం లేదా విభజన కారకులతో స్నేహం చేయడం వల్ల రాజకీయంగా మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉంది. ఏపీలో మళ్లీ పట్టు సాధించాలంటే, జగన్ తన స్నేహం కంటే రాష్ట్ర ప్రయోజనాలే మిన్న అనే సంకేతాన్ని ప్రజల్లోకి బలంగా పంపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# అసెంబ్లీకి కేసీఆర్...

హైదరాబాద్, డిసెంబర్ 27, (భారతశక్తి):

తెలంగాణ రాజకీయాలు రంజుగా మారబోతున్నాయి. ఇప్పట్లో ఎన్నికలు లేవు.. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియదు. ఇన్నిరోజులపాటు లోకల్ బాడీ ఎలక్షన్లో జనాలు ఎంటర్టైన్మెంట్ పొందారు. ఇంకా ఆ హ్యాంగ్ ఓవర్ నుంచి తెలంగాణ ప్రజలకు కోలుకోలేదు. అయితే అంతకుమించిన డబుల్ ఎంటర్టైన్మెంట్ ఇవ్వడానికి తెలంగాణ పొలిటికల్ లీడర్లు సిద్ధంగా ఉన్నారు..ఈనెల 29 నుంచి తెలంగాణ అసెంబ్లీ ప్రారంభమవుతుంది. ఈ సమావేశాలకు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది. శుక్రవారం ఎర్రవల్లి క్షేత్రంలో మాజీ మంత్రులతో కెసిఆర్ మాట్లాడారు. ఈ నేపథ్యంలో తాను అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతున్నట్టు వారితో చెప్పారు.. ఆ మాజీ మంత్రులు మీడియాకు లీకులు ఇవ్వడంతో ఈ వార్త తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్ లో విపరీతమైన చర్చకు దారితీస్తోంది. అసెంబ్లీకి వచ్చి, తెలంగాణ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని కెసిఆర్ ప్రణాళిక రూపొందించారని తెలుస్తోంది.కాళేశ్వరం దగ్గర నుంచి మొదలుపెడితే ఫోన్ ట్యాపింగ్ వరకు ప్రతి వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ను ఇరుకున పెట్టడానికి ప్రణాళికలు రూపొందించారు రేవంత్ రెడ్డి. అయితే ప్రతి కేసులోనూ ఆరంభ శూరత్వం మాత్రమే కనిపిస్తోంది. అయితే ఈసారి ఫోట్యాపింగ్ వ్యవహారంలో కెసిఆర్ ను గట్టిగా ఫిక్స్



చేయాలని రేవంత్ రెడ్డి భావించారు. అందువల్లే ఈ కేసును సజ్జనార్ కు అప్పగించారు. దీంతో ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ప్రభాకర్ రావు నుంచి మొదలు పెడితే తిరుపతన్న వరకు అందరిని విచారించింది. కెసిఆర్ కు నోటీసులు కూడా పంపింది.ఇటీవల కేసీఆర్ చాలా రోజుల తర్వాత మీడియా ముందుకు వచ్చారు. తెలంగాణ ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. అంతేకాదు, ముఖ్యమంత్రి సొంత జిల్లాలో నిర్మించే పాలమూరు, రంగారెడ్డి పథకంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం తోలు తీస్తానని హెచ్చరించారు. అవసరమైతే ఉద్యమం కూడా చేపడతానని స్పష్టం చేశారు. అటు రేవంత్ రెడ్డి కూడా ఈ విమర్శలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ముందు నీకు దమ్ముంటే అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. దీంతో కేసీఆర్ అసెంబ్లీకి రావాలని ఫిక్స్ అయినట్టు తెలుస్తోంది. వాస్తవానికి 2023లో అధికారాన్ని కోల్పోయిన తర్వాత కెసిఆర్ రెండు పర్యాయాలు మాత్రమే అసెంబ్లీకి వచ్చారు. సుదీర్ఘకాలం ఆయన వ్యవసాయ క్షేత్రానికి పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు అసెంబ్లీకి కేసీఆర్ రావడం చర్చకు దారితీస్తోంది. ఒకవేళ కెసిఆర్ గనక సభలో పూర్తిస్థాయిలో ఉంటే.. చర్చ అర్థవంతంగా సాగుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# సౌత్ కొరియాలో బేబి బోనస్ పథకం

న్యూఢిల్లీ, డిసెంబర్ 27, (భారతశక్తి):

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదల ఒక సమస్యగా మారుతుంటే, ఒక దేశంలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. అక్కడ జనాభా తగ్గిపోతుండటం ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. యువత పెళ్లిళ్ల మీద ఆసక్తి చూపడం లేదు, అసలు డేటింగ్ అంటేనే భయపడుతున్నారు. దీంతో దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని గ్రహించిన అక్కడి ప్రభుత్వం ఒక వినూత్నమైన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఎవరైనా సరే డేటింగ్ మొదలుపెడితే చాలు వారికి నగదు బహుమతులు ఇస్తామని ప్రకటించింది. ఒకవేళ పెళ్లి చేసుకుంటే మరింత పెద్ద మొత్తంలో పారితోషికం, పిల్లల్ని కంటే ఏకంగా లక్షల్లో ప్రోత్సాహకాలు అందిస్తామని ఆఫర్ చేస్తోంది. ఇంతకీ ఆ దేశం ఏది? అక్కడ యువత ఎందుకు ఇలా తయారయ్యారు?ఈ వింతైన పరిస్థితులు ఎదుర్కొంటున్న దేశం మరెదో కాదు.. అది 'దక్షిణ కొరియా' . ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యల్ప జననాల రేటు నమోదవుతున్న దేశం ఇదే. ఇక్కడ జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోవడం, ఉద్యోగాల్లో విపరీతమైన పోటీ ఉండటం వల్ల యువత పెళ్లి అనే బంధానికి దూరంగా ఉంటున్నారు. పెళ్లి చేసుకుంటే బాధ్యతలు పెరుగుతాయని, ఆర్థికంగా ఇబ్బందులు వస్తాయని వారు భావిస్తున్నారు. అందుకే ప్రభుత్వం జోక్యం చేసుకుని, ఒకరినొకరు కలుసుకోవడానికి ప్రోత్సహించడమే కాకుండా, పెళ్లి చేసుకున్న జంటలకు గృహ రుణాలు, ఇతర సౌకర్యాల్లో భారీ రాయితీలు



ఇస్తోంది. కొన్ని నగరాల్లో అయితే డేటింగ్ కోసం ప్రత్యేకమైన ఈవెంట్లను కూడా ప్రభుత్వం నిర్వహిస్తోంది.దక్షిణ కొరియాలో జననాల రేటు ఎంతలా పడిపోయిందంటే.. ఒక మహిళ తన జీవితకాలంలో కనే పిల్లల సగటు సంఖ్య 0.7 కంటే తక్కువకు చేరుకుంది. జనాభా స్థిరంగా ఉండాలంటే ఈ సంఖ్య కనీసం 2.1 ఉండాలి. పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్తులో దేశంలో వృద్ధుల సంఖ్య పెరిగిపోయి, పని చేసే యువత కరువయ్యే ప్రమాదం ఉంది. దీనిని అరికట్టడానికి ప్రభుత్వం 'బేబీ బోనస్' పథకాలను అమలు చేస్తోంది. బిడ్డ పుట్టినప్పటి నుంచి వారు పాఠశాలకు వెళ్లే వరకు ప్రతి నెలా కొంత నగదును తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేస్తోంది. అయినప్పటికీ అక్కడి యువత మాత్రం కెరీర్, స్వేచ్ఛకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.కేవలం ఆర్థిక పరమైన ఇబ్బందులే కాకుండా, సామాజిక కారణాలు కూడా ఈ పరిస్థితికి కారణమని నిపుణులు చెబుతున్నారు. కఠినమైన పని వేళలు, పిల్లల పెంపకానికి అయ్యే ఖర్చు, మారుతున్న ఆలోచనా విధానం వల్ల కొరియా యువత ఒంటరిగా ఉండటానికే ఇష్టపడుతున్నారు. ప్రభుత్వం ఎన్ని కోట్లు ఖర్చు చేసినా, యువత మనస్తత్వంలో మార్పు రాకపోవడం ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది.ఒకప్పుడు అభివృద్ధిలో దూసుకుపోయిన ఈ ఆసియా టైగర్, ఇప్పుడు జనాభా సంక్షోభంతో కునారిల్లుతోంది. ప్రపంచంలోని ఇతర దేశాలకు కూడా ఇది ఒక హెచ్చరిక లాంటిదే అని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి ప్రేమకు, పెళ్లికి డబ్బు ఆశ చూపడం అనేది కొరియాలో ఒక అనివార్యమైన చర్యగా మారింది. మరి ప్రభుత్వం ఇస్తున్న ఈ ఆఫర్లను చూసి అయినా అక్కడి యువత తమ మనసు మార్చుకుంటారో లేదో చూడాలి

# ఆస్ట్రేలియాలో ఖలిస్తాన్ ఉద్యమం

సిడ్నీ, డిసెంబర్ 27,( ఆస్ట్రేలియా.. ఇటీవలే ఆ దేశంలో తండ్రీ కొడుకులైన ఇద్దరు ఉగ్రవాదులు పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఇందులో 15 మంది మరణించారు. కాల్పులు జరిపిన ఇద్దరిలో ఒకరిని పోలీసులు కాల్చి చంపేశారు. ఇక తాజాగా సిక్కు వేర్పాటు వాద సంస్థ అయిన ఖలిస్తాన్‌కు చెందిన కొంత మంది ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో భారత జాతీయ పతాకాన్ని కత్తితో చీల్చారు. భారత్ వ్యతిరేక ఖలిస్తాన్ అనుకూల నినాదాలు చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఖలిస్తాన్ సంస్థ మొన్నటి వరకు కెనడా కేంద్రంగానే ఇలాంటి భారత వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించింది. కెనడా మాజీ ప్రధాని ట్రూడో ప్రభుత్వం కూడా వారికి అండగా నిలిచింది. ఇప్పుడు ఖలిస్తాన్ ఆస్ట్రేలియాలో భారత వ్యతిరేక నినాదాలు చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే హమాస్ అనుకూల ఉగ్రవాదులు ఆస్ట్రేలియాలో పెరిగారు. తాజాగా ఖలిస్తాన్ మద్దతుదారుల ఆందోళన కలకలం రూపింది. భారత్‌లో సిక్కు వేర్పాటు వాదమే లక్ష్యంగా ఖలిస్తాన్ పనిచేస్తోంది. ఖలిస్తాన్ దేశం కావాలని డిమాండ్ చేస్తోంది.ఘటన ఆస్ట్రేలియాలోని భారతీయ కమ్యూనిటీలో విభజనలను పెంచుతోంది. ఒక వర్గం దేశభక్తి ప్రదర్శిస్తుంటే, మరొక వర్గం విదేశీ ఆధారాలతో వ్యతిరేకత చూపుతోంది. ఇది భవిష్యత్ ఎన్నికలు, సామాజిక సంబంధాలపై దీర్ఘకాల ప్రభావం చూపనుంది. భారత ప్రభుత్వం దౌత్య మార్గాల ద్వారా స్పందించాల్సిన అవసరం ఏర్పడింది. ఆస్ట్రేలియా వంటి దేశాల్లో భారతీయ వ్యతిరేక ప్రభావం పెరుగుతున్న సమయంలో, ఇలాంటి సంఘటనలు ద్వైపాక్షిక సంబంధాలను ప్రభావితం చేయవచ్చు. విదేశీ భూమిపై జరిగిన ఈ ప్రదర్శనలు భారత్ విధానాలను అంతర్జాతీయ స్థాయిలో సవాలు చేస్తాయి. ఐక్యత కాపాడుకోవడానికి కమ్యూనిటీలు చర్చలు ప్రారంభించాలి. ఆస్ట్రేలియా అధికారులు సామాజిక సామరస్యాన్ని కాపాడటానికి జాగ్రత్తలు తీసుకోవాలి.

# అంతా తానై... అన్నింటా తానై

హైదరాబాద్, డిసెంబర్ 27, (భారతశక్తి):



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ తనకు ఎదురు లేకుండా చేసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా ఆయనకు పోటీగా కాంగ్రెస్ లో మరొక నేత కనిపించడం లేదు. ఆ ప్రయత్నంలోనూ ఎవరూ లేరు. అందుకే తరచూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను పదేళ్ల పాటు ముఖ్యమంత్రిని అని ప్రకటించుకుంటున్నారు. పార్టీ పదవులు, ప్రభుత్వ పదవుల విషయంలోనూ రేవంత్ రెడ్డి తన మాట చెల్లుబాటు చేసుకునేలా వ్యవహరిస్తున్నారు. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఏ నియామకం జరిగినప్పటికీ అందుకు రేవంత్ రెడ్డి అంగీకరించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఒకరకంగా చెప్పాలంటే తెలంగాణ కాంగ్రెస్ కు, ప్రభుత్వానికి అంతా తానే అయి వ్యవహరిస్తున్నారన్నది వాస్తవం.గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితులు కాంగ్రెస్ పార్టీలో కనిపించేవి. కానీ తర్వాత రోశయ్య, నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి హయాంలోనూ గ్రూపులు బాహాటంగా బయటపడేవి. కానీ మళ్లీ 2004 నాటి పరిస్థితులు కాంగ్రెస్ లో కనిపిస్తున్నాయన్నది వాస్తవం. కాంగ్రెస్ లో సీనియర్ నేతల నుంచి మంత్రుల వరకూ ఎవరూ రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని ధిక్కరించే పరిస్థితులు లేవు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కూడా రేవంత్ రెడ్డి కారణంగానే పార్టీ అధికారంలోకి వచ్చిందని బలంగా నమ్ముతుంది. అదే సమయంలో నాయకత్వం మరొకరికి చేతుల్లోకి బదిలీ చేసే ఆలోచన కూడా వారిలో కనిపించకపోవడం విశేషం. ఎందుకంటే సాఫీగా సాగుతున్న ప్రభుత్వంలో వేలు పెట్టడం ఇష్టం లేక మౌనంగా ఉంటుందిమరొకవైపు పార్టీలోనూ రేవంత్ రెడ్డి మాట చెల్లుబాటు అవుతుంది. పీసీసీ కార్యవర్గంలోనూ, అలాగే జిల్లా డీసీసీ అధ్యక్షుల ఎంపికలోనూ రేవంత్ చెప్పిన నేతల పేర్లే దాదాపుగా ఫైల్ అవుతున్నాయి. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్, తెలంగాణ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ కూడా రేవంత్ మాటకు జై కొట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎన్నికల్లో గెలుపు, ఓటముల బాధ్యతను కూడా రేవంత్ రెడ్డి తానే స్వయంగా తీసుకుంటుండటం, ప్రత్యర్థి పార్టీలకు బలంగా సమాధానమిచ్చే మరొక నేత లేరు. అందుకే పార్టీలో వ్యతిరేక గళం విప్పే నేతలు సయితం నేడు సైలెంట్ అయిపోయారు. దీంతో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ తిరుగులేని లీడర్ గా చెలామణి అవుతున్నారు.

# ప్రముఖ మిమిక్రీ కళాకారుడు పద్మశ్రీ డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్ జయంతి నేడు.

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

నేరెళ్ళ వేణుమాధవ్ తెలంగాణకు చెందిన ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు.వరంగల్ పట్టణం లోని మట్టెవాడలో శ్రీహరి, శ్రీలక్ష్మి దంపతులకు 1932 డిసెంబరు 28న జన్మించారు. వీరికి ధ్వన్యనుకరణ సామ్రాట్ అనే బిరుదు కూడా ఉంది. మొదట్లో చిలకమర్తి లక్ష్మీనరసింహం రాసిన ప్రహసనాల్లో నటించి తన ప్రతిభను చాటుకున్నా అప్పటి ప్రముఖ నటులు చిత్తూరు నాగయ్య, వేమూరు గగ్గయ్య, మాధవపెద్ది వెంకట్రామయ్య తదితరుల సినిమాల ప్రభావంతో మిమిక్రీ కళపై మొగ్గు చూపాడు. 1947 నుంచి ఈయన మిమిక్రీ ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించాడు. తెలుగులోనే కాక ఇతర భాషల్లో కూడా ప్రదర్శనలు ఇచ్చాడు. ఐక్యరాజ్య సమితిలో కూడా ప్రదర్శన ఇచ్చాడు. 1953 లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించాడు. కేంద్రప్రభుత్వం ఈయనకు పద్మశ్రీ పురస్కారాన్నిచ్చి గౌరవించింది. విశ్వనాథ సత్యనారాయణ, సినారె మొదలైన ప్రముఖులు తమ రచనలను ఈయనకు అంకితమిచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి కళా ప్రపూర్ణ, జె. ఎన్. టి. యు, కాకతీయ విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్నాడు. తిరుపతిలో ఈయనకు గజారోహణం, పౌరసన్మానం జరిగాయి. ఆయన స్వయంగా నేరెళ్ళ వేణుమాధవ్ సాంస్కృతిక సంస్థను స్థాపించి ప్రతి యేటా ఒక కళాకారుడిని సన్మానించాడు. హనుమకొండలో ఆయన పేరు మీదుగా డా. నేరెళ్ళ వేణుమాధవ్ కళాప్రాంగణం నిర్మించారు.పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ 2018, జూన్ 19వ తేదీ మంగళవారం నాడు తన 85వ యేట కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వరంగల్‌లోని స్వగృహంలో ఉదయం తుదిశ్వాస విడిచారు.

# ఫస్ట్ వీక్‌లో కేబినెట్ విస్తరణ ?



హైదరాబాద్, డిసెంబర్ 27,

తెలంగాణ సీఎం రేవంత్ మరోసారి ఢిల్లీ బాటపట్టారు. శనివారం జరగబోయే అచిఅ సమావేశంలో పాల్గొన్నారు. ఆ తర్వాత పార్టీ పెద్దలతో రేవంత్ భేటీ అవుతారు. ఫుల్ కేబినెట్ కూర్పు కోసం అధిష్టానంతో రేవంత్ చర్చలు జరుపుతారని పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. జనవరి 1 తర్వాత.. విస్తరణ ఉంటుందనే ప్రచారం కూడా ఉంది.రేవంత్ కేబినెట్‌లో ప్రస్తుతం ఇద్దరికి మాత్రమే ఖాళీ ఉంది. ఆ రెండు బెర్త్‌ల కోసం పలువురు కీలక నేతలు పోటీ పడుతున్నారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి.ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కోటాలో మంత్రి పదవి ఆశిస్తున్నారు మల్‌రెడ్డి రంగారెడ్డి. పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షితో పాటు పీసీసీ చీఫ్ గతంలోనే హామీ ఇచ్చారని చెప్పున్నారాయన. గత విస్తరణ సమయంలోనే ఆయనకు పదవి రాకపోవడంపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. కులమే అడ్డంకి అయితే.. బీసీకి మంత్రి పదవి ఇవ్వాలనుకుంటే.. తానే స్వయంగా రాజీనామా చేసి బీసీని గెలిపించుకుంటానంటూ బాహాటంగానే చెప్పారాయన. ఇక.. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కూడా గతంలో పార్టీ హామీ ఇచ్చింది. తనకు మంత్రి పదవి ఖాయమైందంటూ ఇప్పటికే ఆయన పలుమార్లు ప్రకటించుకున్నారు. రాజగోపాల్‌రెడ్డి అనుచరులు ఫ్లెక్సీలు కూడా కట్టారు. పంచాయతీ ఎన్నికలు పూర్తైన తర్వాత కూడా తనకు మంత్రి పదవి వస్తుందంటూ బహిరంగంగానే చెప్పారు.మరోవైపు బీసీ కోటాలో ఆదిశ్రీనివాస్, ఎస్టీ కోటాలో బాలు నాయక్ పేర్లు కూడా మంత్రి పదవి రేసులో వినిపిస్తున్నాయి. ఒక బీసీ, ఒక ఓసీకి ఇస్తారా.. లేదంటే, రెండూ ఓసీలకే ఇస్తారా అనేదే ఇప్పుడు సస్పెన్స్. కేవలం విస్తరణకే పరిమితమా.. లేక, శాఖల మార్పులు కూడా ఉంటాయా అనే దానిపైనా పార్టీలో చర్చ జరుగుతోంది.చీఫ్ విప్‌తో పాటు అడ్లూరి స్థానంలో ఖాళీ అయిన విప్ భర్తీపైనా పార్టీ ఫోకస్ పెట్టింది. మంత్రి పదవి దక్కని వాళ్లతో పాటు సీనియర్లు.. విప్ పదవి రేసులో ఉన్నారు. అదే సమయంలో డిప్యూటీ స్పీకర్‌గా రామచంద్రనాయక్‌ను నియమించేందుకూ రేవంత్ కసరత్తు చేస్తున్నారు. అన్ని పదవులు భర్తీ చేసి.. కొత్త ఏడాదిలో ఫుల్ కేబినెట్‌తో ముందుకెళ్లాలని రేవంత్ భావిస్తున్నారు. మరి.. ఎవరికి ఏ పదవి దక్కుతుందనేది వెయిట్.. అండ్ సీ.

43 లక్షల మందికి చేయూత పెన్షన్లు..

బోగస్ పెన్షన్లు. ఇది ఎప్పటి నుంచో ఉన్న చర్చ. కానీ ఎవరూ కొలిక్కి తేలేని సమస్యగా మిగిలిపోయింది. అయితే రేవంత్ సర్కార్ సామాజిక భద్రతా పెన్షన్లలో అక్రమాలను అరికట్టేందుకు ఫోరెన్సిక్ ఆడిట్‌ను చేపట్టింది. పైలట్ ప్రాజెక్టులో ఇప్పటికే 10 శాతం అనర్హులు పెన్షన్లు పొందుతున్నట్లు గుర్తించారట. ఈ ఆడిట్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి..అర్హులైన పేదలకే లబ్ధి చేకూర్చాలనేది ప్రభుత్వం టార్గెట్‌గా చెబుతున్నారునాలుగు జిల్లాలను ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్టును చేపట్టింది సర్కార్. ఇందులో భాగంగా దాదాపు 20 వేల మంది పెన్షనర్ల వివరాలను పరిశీలించగా..షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయట. ఈ శాంపిల్స్‌లోనే దాదాపు 2 వేల మంది అంటే 10 శాతం అనర్హులుగా తేలారట. వీరిలో చనిపోయిన వారి పేరుతో పెన్షన్లు తీసుకుంటున్న వారు, 50 ఏళ్లు కూడా నిండకుండానే వృద్ధాప్య పెన్షన్లు పొందుతున్న యువకులూ ఉన్నారట. అంతేకాకుండా, ఎలాంటి శారీరక వైకల్యం లేకపోయినా నకిలీ సర్టిఫికెట్లతో దివ్యాంగ పెన్షన్లు పొందుతున్నట్లు బయటపడింది అంటున్నారు. దీంతో నెలకు కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం మిస్ యూజ్ అవుతోందని ప్రభుత్వం భావిస్తోందట.పైలట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన తనిఖీల్లోనే ఇన్ని బోగస్ పెన్షన్లు బయటపడితే.. రాష్ట్రవ్యాప్తంగా ఫోరెన్సిక్ ఆడిట్ చేస్తే ఇంకా ఎన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది. ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తయిన తర్వాత అనర్హులుగా తేలిన వారందరినీ లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించడమే కాకుండా, ఇప్పటివరకు వారు అక్రమంగా పొందిన సొమ్మును రికవరీ చేయాలనే ఆలోచనలో కూడా ప్రభుత్వం ఉందట. అనర్హులను ఏరివేయడం ద్వారా మిగిలే నిధులను, కొత్తగా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని, పెన్షన్లనూ పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.తెలంగాణలో ప్రస్తుతం 43 లక్షల మందికి చేయూత పెన్షన్లు అందిస్తుంది రేవంత్ సర్కార్. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక..స్పెషల్ కేర్ తీసుకుని.. ఎయిడ్స్, దివ్యాంగులు, డయాలసిస్ పేషెంట్లకు కలుపుకుని కొత్తగా దాదాపు 20వేలకు పైగా పెన్షన్లు ఇస్తోంది. ఇలా వృద్ధులు, వితంతువులు, నేతన్నలు, గీత కార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ బాధితులకు నెలకు 2,016 చొప్పున పెన్షన్ అందిస్తుండగా..దివ్యాంగులకు నెలకు 4,016 చెల్లిస్తున్నారు. ఇక డయాలసిస్ రోగులు సహా ఇతర దీర్ఘకాలిక రోగులకు నెలకు 5 వేల నుంచి 10 వేల వరకు పెన్షన్లు అందిస్తున్నారు. అయితే కాంగ్రెస్ మ్యానిఫెస్టో ప్రకారం సాధారణ పెన్షన్లను 4 వేలకు, దివ్యాంగుల పెన్షన్ ను 6 వేలకు పెంచుతామని హామీ ఇచ్చింది కాంగ్రెస్. పెన్షన్లను పెంచే ముందు.. బోగస్ పెన్షన్ దారులకు షాక్ ఇవ్వాలని డిసైడ్ అయ్యిందట రేవంత్ సర్కార్.ఫోరెన్సిక్ ఆడిట్ అమలు చేస్తూ..ఫేషియల్ రికగ్నైజేషన్ టెక్నాలజీని వాడనుంది సర్కార్. ప్రస్తుతం పంచాయతీ సెక్రటరీ లేదంటే..పోస్ట్ ఆఫీసుల ద్వారా పెన్షన్లను ఇస్తున్నారు. ఇక పట్టణ ప్రాంతాల్లో అయితే నేరుగా.. లబ్ధిదారుని ఖాతాలో జమ అవుతుంది. ఇలా డైరెక్ట్ గా అకౌంట్లో పెన్షన్ నగదు జమ కావాలంటే..ప్రతి ఏడాది లైవ్ సర్టిఫికేట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అయితే..ఇక్కడ కింది అధికారుల కక్కుర్తితో.. చాలామంది నకిలీ లైవ్ సర్టిఫికేట్స్ అందించి..ఇప్పటికి పెన్షన్లు తీసుకుంటున్నట్లు సర్కార్ దృష్టికి వచ్చిందట. చనిపోయిన వారి పేరుపైనా ఇప్పటికీ కొందరు పెన్షన్లు తీసుకుంటున్నారట. దీంతో ఫేషియల్ రికగ్నైజేషన్ టెక్నాలజ్ తో..నిజమైన బెనిఫిషరీ ఎవరో తేలిపోనుందిఅంతేకాదు.. లబ్ధిదారుల్లో వృద్ధులు, నడువ లేని వారు ఉంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని..ప్రతి ఇంటికి వెళ్లి ఫేషియల్ రికగ్నైజేషన్ రికార్డ్ చేయనున్నారట. ఫిబ్రవరిలోపు ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తి చేయాలని భావిస్తున్నారట సీఎం రేవంత్. లెక్క తేలిన తర్వాత..ఇటీవల కొత్త రేషన్ కార్డులు జారీ చేసిన నేపథ్యంలో కొత్తగా అర్హత పొందిన వారి నుంచి పెన్షన్ దరఖాస్తులు స్వీకరించనుందట సర్కార్. వచ్చే బడ్జెట్ లో కొత్త పెన్షన్లకు ప్రత్యేక కేటాయింపులు చేయనున్నారట.ప్రస్తుతం ఉన్న బోగస్ పెన్షన్ దారుల లెక్క తేలిన తర్వాత.. అర్హులకు కొత్తగా పెన్షన్ మంజూరు చేయడంతో పాటు ఇప్పటికే పెన్షన్ అమౌంట్ ను పెంచాలనేది ప్రభుత్వ ఆలోచనగా చెబుతున్నారు. ఆ తర్వాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లాలన్నది రేవంత్ వ్యూహంగా కనిపిస్తోంది. మరి పెన్షన్ల ఏరివేతతో వచ్చే సవాళ్లను కాంగ్రెస్ సర్కార్ ఎలా ఫేస్ చేయబోతోందో చూడాలి.

# టార్గెట్ కేసీఆర్, కేటీఆర్..



హైదరాబాద్, డిసెంబర్ 27,

తెలంగాణ రాజకీయ యవనికపై పెను ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ టి. ప్రభాకర్ రావుకు సిట్ అధికారుల విచారణ ముగిసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రెండు వారాల పాటు ఆయన్ను తమ కస్టడీలో ఉంచుకుని విచారించిన సిట్, గడువు ముగియడంతో ఇవాళ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి ఆయన్ను విడుదల చేసింది. అయితే, ప్రభాకర్ రావు విడుదలతో ఈ కేసు ముగిసిపోలేదని, అసలు కథ ఇప్పుడే మొదలైందన్న చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా సాగుతోంది. ప్రభాకర్ రావు నుంచి రాబట్టిన సమాచారం ఆధారంగా దర్యాప్తు సంస్థ తదుపరి అడుగులు వేయబోతోంది. గులాబీ బాస్ కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , ట్రబుల్ షూటర్ హరీశ్ రావుల మెడకు ఈ కేసు ఉచ్చు బిగుస్తోందనే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ నెల 12న సిట్ ఎదుట లొంగిపోయిన ప్రభాకర్ రావును అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. ప్రధానంగా ఆయన ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న సమయంలో జరిగిన అక్రమ నిఘా, ఫోన్ల ట్యాపింగ్, హార్డ్ డిస్కుల ధ్వంసం వంటి అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించారు. విచారణలో ఆయన తొలుత అధికారులకు సహకరించలేదని, సమాధానాలు దాటవేసే ప్రయత్నం చేశారని సమాచారం. దీంతో సిట్ అధికారులు తమ వ్యూహాన్ని మార్చి, ఇప్పటికే కస్టడీలో ఉన్న మరో నిందితుడు, మాజీ డీఎస్పీ ప్రణీత్ రావుతో కలిపి ప్రభాకర్ రావును విచారించారు. ప్రణీత్ రావు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ప్రభాకర్ రావును ప్రశ్నించినప్పుడు, కొన్ని కీలక విషయాలపై ఆయన మౌనం వహించారని, మరికొన్నింటికి పొంతన లేని సమాధానాలు చెప్పారని తెలుస్తోంది.సిట్ ప్రధానంగా ఫోకస్ చేసిన అంశం.. ప్రభాకర్ రావు రీ-అపాయింట్మెంట్. ఆయన పదవీ విరమణ చేసిన తర్వాత కూడా, నిబంధనలకు విరుద్ధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయన్ను ఎస్ఐబీ చీఫ్‌గా ఎందుకు నియమించింది? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. కేవలం రాజకీయ ప్రత్యర్థులపై నిఘా పెట్టడానికే ఈ నియామకం జరిగిందా అనే కోణంలో సిట్ ఆరా తీసింది. దీనికి తోడు, అప్పటి మంత్రి హరీశ్ రావుతో ప్రభాకర్ రావు తరచూ ఎందుకు భేటీ అయ్యారన్న ప్రశ్నపై ఆసక్తికర చర్చ నడిచింది. "మావోయిస్టుల ముప్పు, నక్సల్స్ కార్యకలాపాల గురించి వివరించడానికే హరీశ్ రావును కలిసేవాడిని'' అని ప్రభాకర్ రావు సమర్థించుకున్నట్లు తెలిసింది. అయితే, మావోయిస్టుల అంశం హోంమంత్రి లేదా సీఎం పరిధిలోకి వస్తుంది తప్ప, ఆర్థిక మంత్రిగా ఉన్న హరీశ్ రావుకు ఇందులో సంబంధం ఏముంటుందన్నది సిట్ అనుమానం. దీని వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయన్నది అధికారుల ప్రాథమిక అంచనా.ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో నడుస్తున్న హాట్ టాపిక్ ఇదే. ప్రభాకర్ రావు వంటి సీనియర్ అధికారి, ప్రభుత్వంలోని పెద్దల ఆదేశాలు లేకుండా ఇంతటి భారీ ఆపరేషన్ నిర్వహించే సాహసం చేస్తారా? అనేది సామాన్యుడికి కూడా వచ్చే సందేహం. ఈ కేసులో 'కింగ్ పిన్'లు తెరవెనుక ఉన్నారని, అధికారులు కేవలం పావులేనని కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలోనే సిట్ తదుపరి చర్యలు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుల వైపు మళ్లినట్లు స్పష్టమవుతోంది.విశ్వసనీయ సమాచారం ప్రకారం, ప్రభాకర్ రావు విచారణలో వెల్లడైన అంశాలు బీఆర్ఎస్ అగ్రనేతలకు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. ప్రతిపక్ష నేతలు, సొంత పార్టీలోని రెబల్స్, జర్నలిస్టులు, వ్యాపారుల ఫోన్లను ట్యాప్ చేసి, ఆ సమాచారాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకున్నారన్న ఆరోపణలకు బలం చేకూర్చే సాక్ష్యాలను సిట్ సేకరించినట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే, అతి త్వరలోనే కేటీఆర్, హరీశ్ రావులకు, ఆ తర్వాత కేసీఆర్‌కు కూడా విచారణ నోటీసులు జారీ చేసే అవకాశాలను కొట్టిపారేయలేం.

# రహస్య జీవోల సంగతేంటీ

హైదరాబాద్, డిసెంబర్ 27,(భారతశక్తి):

తెలంగాణలో ప్రభుత్వ ఉత్తర్వుల గోప్యతపై హైకోర్టు మరోసారి సీరియస్ అయ్యింది. అన్ని జీవోలు, సర్క్యులర్లు, నోటిఫికేషన్లను అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రజలకు తెలియాల్సిన నిర్ణయాలను దాచిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. అయితే, ప్రభుత్వాలు మారుతున్నా జీవోలను పబ్లిక్ డొమైన్ లో పెట్టకుండా దాచిపెట్టే సంప్రదాయం మాత్రం మారడం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో మొదలైన ఈ బ్లాంక్ నంబర్ల సంస్కృతి, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోనూ కొనసాగుతుండటం పారదర్శకతపై పెద్ద ప్రశ్నగా మిగిలింది. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీవోల గోప్యత గరిష్ట స్థాయికి చేరిందని చెప్పవచ్చు. ముఖ్యంగా భూ కేటాయింపులు, నిధుల మళ్లింపు, వివాదాస్పద నిర్ణయాలకు సంబంధించిన వేలాది జీవోలను ఆన్‌లైన్ లో అందుబాటులో ఉంచకుండా 'కాన్ఫిడెన్షియల్' కేటగిరీలో దాచేశారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ఇది చీకటి పాలన అని, తాము అధికారంలోకి వస్తే ప్రతి జీవోను ప్రజల ముందు ఉంచుతామని హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మరీ ఆశాజనకంగా ఏమీ లేదని గణాంకాలు చెబుతున్నాయి.తాజా గణాంకాల ప్రకారం, గత 13 నెలల్లో విడుదలైన 19,000 పైచిలుకు జీవోలలో కేవలం 17-18 శాతం మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. అంటే దాదాపు 82 శాతం జీవోలు ఇంకా రహస్య ఫోల్డర్లలోనే మగ్గుతున్నాయి. గత ప్రభుత్వంలో 50-60 శాతం దాచిపెట్టేవారని అనుకుంటే, ప్రస్తుత గణాంకాలు అంతకంటే ఎక్కువగా ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. బదిలీలు, ఆర్థిక వ్యయం వంటి అంశాలను ప్రజల కంట పడకుండా ఉంచేందుకు రహస్య జీవోల అస్త్రాన్ని ప్రభుత్వాలు వాడుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 ప్రకారం, ప్రభుత్వాలు తమ నిర్ణయాలను స్వచ్ఛందంగా బహిర్గతం చేయాలి. కానీ తెలంగాణలో మాత్రం జీవో కాపీ కావాలంటే కోర్టులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక ప్రజా ధనం, ప్రజా ప్రయోజనం ముడిపడి ఉంటాయి. అటువంటప్పుడు ఆ నిర్ణయాలను దాచాల్సిన అవసరం ఏమిటి అనే ప్రశ్న సామాన్యుడిలో ఉదయిస్తోంది. పారదర్శకత అనేది కేవలం ఎన్నికల నినాదంగానే మిగిలిపోతుందా అని పౌర సమాజం నిలదీస్తోందిహైకోర్టు ఆదేశాల నేపథ్యంలోనైనా ప్రస్తుత ప్రభుత్వం తన తీరు మార్చుకుంటుందా అనేది వేచి చూడాలి. గత ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతూ అధికారంలోకి వచ్చిన వారు, అవే తప్పులను కొనసాగించడం అంటే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడమే అవుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. మరి ప్రభుత్వం అన్నింటినీ పబ్లిక్ కు అందుబాటులో ఉంచుతుందా?

# గ్లోబల్ సిటీగా హైదరాబాద్

హైదరాబాద్, డిసెంబర్ 27,

హైదరాబాద్.. ఈ పేరు కేవలం ఒక నగరానికి మాత్రమే పరిమితం కాదు. ఇది చరిత్ర, సంస్కృతి, ఆధునికత కలగలిసిన ఒక మహా సామ్రాజ్యం. ఒకప్పుడు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ గా ఉన్న ఈ నగరం, 2007లో 'గ్రేటర్' గా అవతరించింది. ఇప్పుడు ఆ గ్రేటర్ సరిహద్దులను కూడా చెరిపేస్తూ, ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించి, దేశంలోనే అతిపెద్ద మెగా సిటీలలో ఒకటిగా అవతరించేందుకు




సిద్ధమైంది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన వార్డుల పునర్విభజన తుది గెజిట్ నోటిఫికేషన్, హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దే క్రమంలో ఒక చారిత్రక మైలురాయిగా నిలవనుంది.నిన్నటి వరకు 150 వార్డులకే పరిమితమైన జీహెచ్ఎంసీ పాలన, ఇప్పుడు రెండింతలై 300 వార్డులకు విస్తరించింది. పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ జారీ చేసిన తాజా ఉత్తర్వులతో నగర స్వరూపం పూర్తిగా మారిపోయింది. నగర శివార్లలోని 20 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేయడంతో, ఈ విస్తరణ అనివార్యమైంది.అంకెల్లో ఈ మార్పును గమనిస్తే ఆశ్చర్యం కలగకమానదు. సుమారు 650 చదరపు కిలోమీటర్లు ఉన్న జీహెచ్ఎంసీ విస్తీర్ణం, తాజా విలీనంతో ఏకంగా 2,050 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. జనాభా పరంగా చూస్తే, 1.34 కోట్ల మంది ప్రజలు ఇప్పుడు ఒకే గొడుగు కిందకు, అంటే ఒకే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వచ్చారు. ఈ నిర్ణయంతో ఢిల్లీ, ముంబై వంటి మెట్రో నగరాల సరసన హైదరాబాద్ నగర్వంగా నిలబడనుంది.కేవలం భౌగోళిక విస్తరణ మాత్రమే ప్రభుత్వ లక్ష్యం కాదు. దీని వెనుక తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ అనే బృహత్తర ప్రణాళిక ఉంది. ఓఆర్ఆర్ లోపల ఉన్న ప్రాంతమంతటినీ ఒకే యూనిట్‌గా మార్చడం ద్వారా ఏకీకృత పాలన, సమాన పన్నుల విధానం, మెరుగైన పౌర సేవలను అందించడమే దీని ఉద్దేశం. రాబోయే 2026-27 జాతీయ జనాభా గణనను దృష్టిలో ఉంచుకుని, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా అంటే డిసెంబర్ 31 రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను మెరుపు వేగంతో పూర్తి చేసింది. దీనివల్ల భవిష్యత్తులో కేంద్రం నుంచి వచ్చే నిధులు, గ్రాంట్లు భారీగా పెరిగే అవకాశం ఉంది.డిసెంబర్ 9న విడుదలైన ముసాయిదాపై ప్రజల నుంచి వెల్లువెత్తిన స్పందన, నగర పౌరుల చైతన్యానికి నిదర్శనం. రికార్డు స్థాయిలో 5,945 అభ్యంతరాలు రాగా, ప్రభుత్వం వాటిని సానుకూలంగా పరిశీలించింది. ఫలితంగా 30కి పైగా వార్డుల పేర్లు మారాయి. స్థానిక ప్రజల మనోభావాలకు అనుగుణంగా బాగ్ అంబర్‌పేట్, వనస్థలిపురం, మోండా మార్కెట్ తదితర చారిత్రక పేర్లను తిరిగి ఖరారు చేశారు. అలాగే నాలాలు, ప్రధాన రహదారులనే సరిహద్దులుగా మార్చుతూ, పాలనా సౌలభ్యం కోసం వార్డుల భౌగోళిక స్వరూపాన్ని సవరించారు.ఇంతటి భారీ ప్రక్రియలో రాజకీయ విమర్శలు సహజం. ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలు ఈ విభజనను తమకు అనుకూలంగా ఓటర్లను విభజించుకోవడమేనని విమర్శించాయి. ఈ వ్యవహారం హైకోర్టు మెట్లెక్కినప్పటికీ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 జెడ ప్రకారం ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని న్యాయస్థానం స్పష్టం చేయడంతో ప్రభుత్వానికి లైన్ క్లియర్ అయ్యింది. ఇది ప్రభుత్వానికి లభించిన నైతిక, న్యాయపరమైన విజయంగా భావించవచ్చు.నగరం విస్తరించినంత మాత్రాన సరిపోదు, పాలన ప్రజల ముంగిట ఉండాలి. 300 వార్డులను సమర్థవంతంగా నిర్వహించడం ఇప్పుడు ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాలు. దీనికోసం ప్రస్తుతం ఉన్న 6 జోన్లను 12కి, 30 సర్కిళ్లను 60కి పెంచే యోచనలో ప్రభుత్వం ఉంది. అంటే ప్రతి 5 వార్డులకు ఒక సర్కిల్ ఆఫీస్ ఉండేలా ప్రణాళిక రచిస్తున్నారు. ఇది అమలైతే, పౌర సమస్యల పరిష్కారంలో జాప్యం తగ్గి, జవాబుదారీతనం పెరుగుతుంది.

# ఎకనామిక్ కారిడార్ రెడీ...

## ఏప్రిల్లో ప్రారంభానికి ముహూర్తం

హైదరాబాద్, డిసెంబర్ 27

హైదరాబాద్ నగరాన్ని మధ్య భారతదేశంతో కలిపే హైదరాబాద్-ఇండోర్ ఆర్థిక కారిడార్ పనులు తుది దశకు చేరుకున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ఈ రహదారి అందుబాటులోకి రానుంది. దీనివల్ల ప్రస్తుతం పట్టే 18 గంటల ప్రయాణ సమయం కేవలం 11 గంటలకు తగ్గుతుంది. తెలంగాణలో 100 కిలోమీటర్ల మేర సాగే ఈ రహదారి.. సంగారెడ్డి నుండి బోధన్ మీదుగా మహారాష్ట్రలోకి ప్రవేశిస్తుంది. పారిశ్రామిక నగరమైన ఇండోర్‌ను ఐటీ హబ్ హైదరాబాద్‌తో నేరుగా అనుసంధానించడం ద్వారా వాణిజ్య రంగానికి పెద్ద పీట వేయనున్నారు. నర్మదా నదిపై వంతెనలు, సొరంగాల నిర్మాణం పూర్తి కావస్తుండటంతో.. త్వరలోనే ఈ వేగవంతమైన ప్రయాణ సౌకర్యం ప్రజలకు అందుబాటులోకి రానుంది. హైదరాబాద్ నగరాన్ని మధ్య భారతదేశంలోని పారిశ్రామిక కేంద్రమైన ఇండోర్‌తో అనుసంధానించే హైదరాబాద్-ఇండోర్ ఆర్థిక కారిడార్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. వచ్చే ఏడాది మొదటి భాగంలో.. అంటే ఏప్రిల్ నాటికి ఈ రహదారి ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ భారీ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ నుంచి ఇండోర్ వెళ్లడానికి పట్టే సమయం 18 గంటల నుంచి కేవలం 11 గంటలకు తగ్గుతుంది. అంటే దాదాపు 7 గంటల ప్రయాణ సమయం ఆదా అవుతుంది. ఈ 695 కిలోమీటర్ల పొడవైన రహదారి మహారాష్ట్రలోని నాందేడ్, అకోలా వంటి నగరాల మీదుగా సాగుతుంది. తెలంగాణలో ఈ రహదారి సుమారు 100 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. మన రాష్ట్రంలో బోధన్, ఎల్లారెడ్డి మీదుగా సంగారెడ్డికి చేరుకుని.. అక్కడి నుంచి జాతీయ రహదారి 65 ద్వారా హైదరాబాద్‌కు అనుసంధానమవుతుంది. హైదరాబాద్ నగరం ఇప్పటికే ఐటీ, ఫార్మా రంగాల్లో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందింది. ఈ కొత్త ఆర్థిక కారిడార్ రాకతో నగరం మరింత వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఇండోర్ నగరం ఉత్తర భారతదేశానికి ప్రధాన రవాణా కేంద్రంగా ఉంది. ఈ రహదారి ద్వారా హైదరాబాద్‌కు ఇండోర్‌తో నేరుగా సంబంధం ఏర్పడటం వల్ల వస్తువుల రవాణా సులభతరం అవుతుంది. ముఖ్యంగా ఫార్మా ఉత్పత్తులు, ఐటీ పరికరాలు, వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ సమయంలో ఉత్తరాది రాష్ట్రాలకు చేరవేయవచ్చు. దీనివల్ల



హైదరాబాద్ పరిసరాల్లో మరిన్ని గిడ్డంగులు (గోడౌన్లు), రవాణా కేంద్రాలు ఏర్పడతాయి. తెలంగాణలో ఈ కారిడార్ సంగారెడ్డి వద్ద ముగుస్తుంది. ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాంతీయ రింగ్ రోడ్డు కూడా సంగారెడ్డి మీదుగానే వెళ్తుంది. దీనివల్ల ఈ ఆర్థిక కారిడార్ నుంచి వచ్చే వాహనాలు నగరం లోపలికి రాకుండానే ఇతర జిల్లాలకు వెళ్లే వెసులుబాటు కలుగుతుంది. ఇది నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడమే కాకుండా.. సంగారెడ్డి, బోధన్ వంటి ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగానికి భారీ ఊతం ఇస్తుంది. ఈ రహదారి వెంబడి కొత్త పారిశ్రామిక మండలాలు ఏర్పడే అవకాశం ఉంది. తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాలైన బోధన్, ఎల్లారెడ్డి వంటి చోట్ల చిన్న తరహా పరిశ్రమలు స్థాపించడానికి పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతారు. వేగవంతమైన రవాణా సౌకర్యం ఉండటం వల్ల తయారీ రంగానికి కొత్త ప్రాణం పోసినట్లవుతుంది.

హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని నాందేడ్ గురుద్వారాకు వెళ్లే భక్తులకు.. అలాగే మధ్యప్రదేశ్ వెళ్లే పర్యాటకులకు ఈ రహదారి ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రయాణ సమయం తగ్గడం వల్ల పర్యాటకుల రాకపోకలు పెరిగి పర్యాటక రంగం ద్వారా ఆదాయం లభిస్తుంది. చివరిగా.. ఈ ప్రాజెక్టులో భాగంగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో నిర్మిస్తున్న భారీ సొరంగాలు.. నర్మదా నదిపై వంతెనల నిర్మాణం వల్ల పనులు కొంత ఆలస్యమయ్యాయి. అయినప్పటికీ.. ఏప్రిల్ 2026 నాటికి ఈ రహదారిని ప్రారంభించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.



## కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో నూతనంగా గెలిచిన సర్పంచ్ లకు సన్మాన కార్యక్రమం: ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ డిసెంబర్ 27

ఈకార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ మంత్రి జీవన్ రెడ్డి,ఎమ్మెల్సీ బలమురి వెంకట్, సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, హుజూరాబాద్ ఇంచార్జి ఒడితల ప్రణవ్, మాజీ ఎమ్మెల్యే లు కోడూరీ సత్యనారాయణ,ఆరేపల్లి మోహన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సుడ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల నరేందర్ రెడ్డి, ఆర్టీఏ సభ్యులు పడాల రాహుల్,రింకు,ఇతర ముఖ్య నేతలు.. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన సర్పంచ్ లకు అభినందనలు ప్రభుత్వం,పార్టీ మీకు అండగా ఉంది.కాంగ్రెస్ పార్టీ గ్రామ ప్రతినిధులుగా మీకు బాధ్యతలు ఉంటాయి గ్రామానికి సంబంధించిన అన్ని విషయాల్లో ప్రజలు మిమ్మల్ని చూస్తారు.ప్రభుత్వ పథకాలు రావడంలో, ఇతర కష్టాల సమయంలో మీరు అండగా ఉండాలి.రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ సహకార సంఘాల,ఎన్నికల్లో శాసన సభ,పార్లమెంట్ ఎన్నికల్లో మీరు ఉండాలిఎన్నికలు జరగకుండా ఆగిపోయిన నిధులు వస్తాయి..ముఖ్యమంత్రి గ్రామాలకు నిధులు ఇస్తామని చెప్పారు. శాసన సభ్యుల నిధులు ఇస్తారు.వేసవికాలంలో గ్రామాలకు తాగునీటి కి ఇబ్బందులు లేకుండా సమీక్ష చేసుకొని సమస్య పరిష్కారం చేసుకోవాలి.గ్రామాల్లో శానిటేషన్, స్ట్రీట్ లైట్స్, ప్లాంటేషన్, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు విద్యకు ప్రాధాన్యత కల్పిస్తుంది.స్కూల్ లో విద్యార్థులు, టీచర్లు వస్తున్నారా అని చూసుకోవాలిమీ గ్రామాలకు ప్రైవేట్ పాఠశాల బస్సులు రాకుండా చూసుకొని ప్రతి పిల్లవాడు ప్రభుత్వ పాఠశాలలో చదివేలా చూడాలి. మంచి అనుభవమున్న టీచర్లు, మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత ప్రభుత్వం ది.మన జిల్లాకు సంబంధించిన కాళేశ్వరం కూలిపోతే ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సి వస్తుందని పక్కదారి పట్టిస్తున్నారు.మహాత్మా గాంధీ పేరు మీద ఉన్న ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తున్నారు. పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారు..పేరు తీసేసి జీ రామ్ జీ అని పేరు పెడుతున్నారు.నెహ్రూ, ఇందిరా గాంధీ ల పేర్లు వారి చరిష్మా చెరిపేయాలని చూస్తున్నారు.వాళ్ళు వేసిన ప్రాజెక్టులు, కేంద్ర సంస్థలు, గరిబి హటావో లాంటి పథకాలు ఈ దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లాయి.జాతిపిత మహాత్మా గాంధీ స్వాతంత్ర్యం కోసం పోరాడితే ఆయనను చంపిన గాడ్సే ను ఆరాధిస్తున్నారు.నేడు ఉపాధి హామీ కార్యక్రమాల దగ్గర గాంధీ చౌరస్తా ల వద్ద గాంధీల ఫొటోలు పెట్టుకొని నేడు ప్రతి గ్రామంలో నిరసన తెలపాలి.జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఐక్యంగా పని చేద్దాం.మీకు అండగా ఉంటాం..మీ వెంట ఉంటాం కాంగ్రెస్ కుటుంబం ఉంది మరింత శ్రమించండి.ఓడిపోయిన వాళ్ళతో సమావేశం ఏర్పాటు చేస్తాం వారికి కూడా పార్టీ పరంగా అండగా ఉంటాం.గెలిచిన సర్పంచ్ లకు ముఖ్యమంత్రి, పీసీసీ పక్షాన అభినందనలు శుభాకాంక్షలు.

## బిఆర్ఎస్ వైపు చూస్తున్న రామగుండం ప్రజలు బిఆర్ఎస్ పార్టీ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ..




గోదావరిఖని: డిసెంబర్ 27

సమస్యలపై పోరాడుతున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి సమక్షంలో పలువురు చేరికలు..రామగుండం నియోజకవర్గ ప్రజలు బిఆర్ఎస్ వైపు కెసిఆర్ ని ముఖ్యమంత్రిగా ఎప్పుడు చూద్దామా అని ఎదురుచూస్తున్నారు. రామగుండంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ చేస్తున్న అరాచకపు పాలన చరమగీతం పాడేందుకు సన్నద్ధులై ఉన్నారని రాష్ట్రంలో కెసిఆర్ ముఖ్యమంత్రిగా చేసేందుకు ఎదురుచూస్తున్నారని బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి పేర్కొన్నారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో శనివారం జరిగిన కార్యక్రమంలో నూతన సంవత్సర క్యాలెండర్ ను హరీష్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా సమస్యలపై బలంగా పోరాడుతున్న బిఆర్ఎస్ పార్టీ లోకి ఈ ప్రాంత(టిఆర్ఎస్.డి) కార్పొరేషన్ ప్రెసిడెంట్ నీలం బిక్షపతి తదితరులు వ్యాల్ల హరీష్ రెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ... రామగుండంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రజలను మానసికంగా వేధిస్తూ షాపులు ఇండ్లు కూల్చివేస్తూ అరాచక పాలన సాగి స్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో తగిన మూల్యం అధికారులు చెల్లించుకుంటారని, ఇప్పటికే రామగుండం ప్రజలు బిఆర్ఎస్ పార్టీ వైపు, రాష్ట్రంలో కేసీఆర్ ను ముఖ్యమంత్రిగా చూసేందుకు ఎదురుచూస్తున్నారని అన్నారు. రామగుండంలో ఎమ్మెల్యేను చిత్తుగా ఓడించేందుకు ప్రజలు నిర్ణయం తీసుకున్నారని, భవిష్యత్తులో ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాడేందుకు ప్రజలు సహకరించి కలిసి రావాలని కోరారు. ఇకనుండి రామగుండంలో ఎలాంటి ఆపద వచ్చిన ఏ చిన్న షెడ్డును అభివృద్ధి పేరిట కూల్చివేతకు అధికారులు నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు తీసుకువచ్చిన నోటీసు ఇవ్వకుండా ఇబ్బంది పరిస్తే ఎదురు తిరగాలని మీకు అండగా న్యాయపరంగా పోరాడేందుకు అండగా నిలుస్తానని హరీష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎక్కడ ఉన్న చిరు వ్యాపారులు సింగరేణి స్థలాల్లో నిర్ణయించుకున్నా ఇండ్లు దుకాణాలను తొలగించే అధికారం సింగరేణి కి, మున్సిపల్ అధికారులకు కూడా లేదని అన్నారు. కార్మికులు ఈ ప్రాంత అభివృద్ధి దృష్ట్యా భూమి పొరల్లోకి వెళ్ళు రక్తాన్ని చిందిస్తూ వెనుకాడకుండా దేశానికి వెలుగులు పంచుతున్నారని ఈ ప్రాంత అభివృద్ధికి ఇక్కడి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేసేందుకు బిఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ అధికార ప్రతినిధి జహీద్ పాషా, మాజీ కార్పొరేటర్లు ఎన్వి రమణారెడ్డి, బొబ్బిలి సతీష్, మెరుగు చంద్రమౌళి, మాజీ ఉప సర్పంచ్ నర్సింగ్, మహిళ ఉద్యమకారిణి పర్శ స్వాతి, యువజన విభాగ అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మడిశెట్టి రవీందర్, అల్లి గణేష్, శ్రీ హరి, బోట్ల పోషం, నీలం భిక్షపతి, నడిపల్లి సాయి, ఎండీ.అతహరుద్దీన్, రహమాన్, గొర్రె నర్సింగ్, గొర్రె శంకర్, యువరాజ్ నేత, ఉదయ్, శ్రీనివాస్ రావు, బొడ్డుపల్లి రాజు, మోబిన్, కొండ సురేష్, పోయిల రవి, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అన్నిదానాల్లో కెల్ల అన్నదానం మిన్న

**దాతల సహకారంతో 1710 రోజులుగా పేదలకు అన్నదాన కార్యక్రమం**

**మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్**

**అన్నపూర్ణే! సదాపూర్ణే! శంకర ప్రాణ వల్లభే! జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహీ చ పార్వతి**

వేములవాడ డిసెంబర్ 27

ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1710 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం రోజున దాతలు అందించిన సహకారంతో లక్ష్మీ గణపతి కాంప్లెక్స్ భీమేశ్వర రాజన్న ఆలయాలవద్ద పేదలకు,అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్నదాతలుగా చోటీ లక్ష్మణమూర్తి శర్మ శ్రీదేవి దంపతులు,చోటి సాంబశివ శర్మ వైష్ణవి దంపతులు,కూతురు పుట్టినరోజు సందర్భంగా అమెరికా వాస్తవ్యులు నరహరి ప్రమోద్ నాగహరీష దంపతులు శాశ్వత దాతలుగా డాక్టర్ జువ్వాడి వెంక టేశ్వరరావు స్నేహలత దంపతులు ప్రతాప స్వప్న సంపత్ దంపతులు నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు,దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు రామడుగు శ్రీలత,కొడుకులు కోడళ్లు ప్రజ్ఞ శరత్చంద్ర దంపతులు,శిరీష సాయిచంద్ర దంపతులు,శర్వాణి రవిచంద్ర దంపతులు హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష సాయికృష్ణ ఉన్నారని మీయొక్క పుట్టినరోజు,పెళ్ళిరోజు మరియు ఇతరత్ర కార్యక్రమాలకు పేదలకు అన్నార్తులకు ఒక్కపూటైనా భోజనం అందించడానికి సహకారం అందించే దాతలు ట్రస్టు సభ్యులను గాని 92469



39388 నంబరుకు సంప్రదించాలని, ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ప్రతాప నటరాజు,పొలాస రాజేందర్,గొండ ప్రసాద్,సగ్గు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కాంగ్రెస్ నేతలు అడ్డుకుంటున్నారు

వికారాబాద్ డిసెంబర్ 27

పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ నేతలు పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వికారాబాద్ సాకేత్ నగర్ లో ఒక జిమ్ పార్క్ ను పరిశీలించి మాజీ వికారాబాద్ మునిసిపల్ కమిషనర్ తో మాట్లాడారు. తరువాత ప్రభుత్వ పాత ఆసుపత్రిలో రోగులతో ఆసుపత్రి లో ట్రీట్మెంట్ అడిగి తెలుసుకున్నారు.పట్టణంలోని కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలిం,ఆరు.మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేష్ రెడ్డి వికారాబాద్ మరియు రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు మెతుకు ఆనంద్ మంచి రెడ్డి కిషన్ రెడ్డి నరేందర్ రెడ్డి ,మరియు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టును కాంగ్రెస్ నాయకులే అడ్డుకుంటున్నారు . 90 శాతం బిఆర్ఎస్ హయం లో పూర్తయిన ప్రాజెక్టును మిగతా పది శాతం పూర్తి చేసి వ్యవసాయ రైతులకు నీళ్లను అందించాలని

తట్టెడు మట్టి తీయకుండా ప్రాజెక్టు పనుల పై దృష్టి సారించకుండా పిచ్చి పిచ్చి మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సోయి తెచ్చుకొని త్వరలోనే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నూ పూర్తి చేసేవిదంగా పనులు ప్రారంభించలని కోరారు లేకపోతే గ్రామస్థాయి మరియు మండల స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలనూ మొండి వైకిరిని ప్రజల్లో తీసుకెళ్లి చైతన్యం కలిపిస్తాం అని తెలియజేసారు



## మహిళా కమిషన్ చైర్మన్‌ను కలిసిన అయేషా మీరా తల్లిదండ్రులు

### 18 ఏళ్లుగా న్యాయం కోసం అలుపెరగని పోరాటం

గుంటూరు డిసెంబర్ 27

18 ఏళ్ల అయేషా మీరా హత్య కేసులో ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ అయేషా మీరా తల్లిదండ్రులు శంషాద్ బేగం, బాషా మంగళగిరిలో మహిళా కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. 2007 డిసెంబర్ 27న 19 సంవత్సరాల బీ.ఫార్మసీ విద్యార్థిని అయేషా మీరా అత్యంత దారుణంగా హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటన జరిగి నేటికి 18 సంవత్సరాలు పూర్తయినా ఇప్పటివరకు అసలు నేరస్తులకు శిక్ష పడకపోవడం బాధాకరమని వారు తెలిపారు. సీబీఐ నివేదిక ప్రకారం కీలక సాక్షాలను ధ్వంసం చేసి, తప్పుడు దర్యాప్తు ద్వారా అమాయకుడైన పిడతల సత్యం బాబును కేసులో ఇరికించారని పేర్కొన్నారు. తొమ్మిది సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించిన అనంతరం సత్యం బాబు నిర్దోషిగా విడుదలై, సత్యమేవ జయతే అని లోకానికి చాటిచెప్పారని గుర్తు చేశారు. అయితే అమాయకుడు విడుదల కావడం సరిపోదని, అసలు నేరస్తులకు కఠిన శిక్ష పడాలని మహిళా సంఘాలు, హక్కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, అయేషా మీరా తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ న్యాయపోరాటం ఫలితంగా 2018లో ఉమ్మడి హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు ప్రారంభమైందన్నారు. సీబీఐ దర్యాప్తులో రాజకీయ నాయకుల కుటుంబాలకు సంబంధించిన కీలక సాక్షాలు మాయం చేసినట్టు వెలుగులోకి వచ్చిందని, నేరస్తులను కాపాడేందుకు కొందరు అధికారులు ప్రయత్నించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే 2025 జూన్ 25న హైకోర్టులో సీబీఐ సమర్పించిన సీల్డ్ కవర్ నివేదిక తీవ్రంగా నిరాశపరిచిందని తెలిపారు. అప్పటి నుంచి న్యాయం కోసం ఎదురుచూస్తున్న తమకు ఇది తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. అయేషా మీరా హత్య జరిగిన సమయంలో చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్నారని, ఆ సమయంలో తెలుగుదేశం పార్టీ అయేషా మీరా తల్లిదండ్రులకు అండగా నిలిచి రాష్ట్రవ్యాప్తంగా సభలు, ధర్నాలు, నిరసనలు నిర్వహించిందని గుర్తు చేశారు. అయేషా మీరా చనిపోయిన రోజును స్మరణ దినంగా ప్రకటించాలని, ఆమె పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేయాలని కూడా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలు, హక్కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు పాల్గొని అయేషా మీరా కుటుంబానికి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి.

## కేటీఆర్ తన తప్పులు తెలుసుకోవాలి దానం నాగేందర్

హైదరాబాద్ డిసెంబర్ 27



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గెలిపించడం , ఓడించడం అనేది ప్రజలు చూసుకుంటారని... మొదట కేటీఆర్ చేసిన తప్పులను తెలుసుకోవాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిని ఏక వచనంతో మాట్లాడింది బిఆర్ఎస్ నాయకులే అని దానం అన్నారు. ముఖ్యమంత్రి పదవికి గౌరవం ఇవ్వాలని , అది మరిచి విమర్శలు చేస్తే , ప్రతి విమర్శలు కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని దానం హెచ్చరించారు. హైదరాబాద్ హిమాయత్ నగర్ డివిజన్ కార్యకర్తల సమావేశంలో స్థానిక కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ తో కలిసి దానం పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... కేటీఆర్ వ్యక్తిగత విమర్శలు పక్కన పెట్టి , కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై చర్చకు రావాలన్నారు. ఇద్దరు మంత్రులు అవినీతికి పాల్పడుతున్నారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతున్నారని... వాళ్ళు కేంద్ర మంత్రుల లేక రాష్ట్ర మంత్రుల స్పష్టత ఇవ్వాలన్నారు. హోంశాఖ సహాయ మంత్రి అయిన బండి సంజయ్ పరిధిలోనే దర్యాప్తు సంస్థలు ఉంటాయని... అవినీతిపై ఆధారాలు ఉంటే విచారణ చేపట్టాలని దానం తెలిపారు. కార్యకర్తలే నా బలంతన బలం కార్యకర్తలే అని... ఈ స్థాయిలో తాను ఉన్నానంటే వారి వల్లే అని దానం అన్నారు. తాను రాజీనామా చేయడానికి , ఉపఎన్నికల్లో పోటీ చేయడానికి ధైర్యం తన కార్యకర్తలే అని తెలిపారు. వారి అండతోనే 6 సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని ... ఉపఎన్నిక వస్తే కూడా గెలుస్తా అని దానం స్పష్టం చేశారు.

## ప్రతి భారతీయుడికి స్ఫూర్తి రతన్ టాటా జీవితం

### -నేడు రతన్ టాటా జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )



పది వేల కోట్ల రూపాయలుగా ఉండవలిసిన ఒక వ్యాపార సామ్రాజ్యాన్ని ఒక్కడు ఒకే ఒక్కడు తన యుక్తి తో,తన వ్యాపార నిపుణతతో ఆరు లక్షల కోట్లకు ఎగబాకేలా చేసాడు. దాదాపు ఏడు లక్షల మందికి ఉపాధినిస్తూ,నూట యాభై ఏళ్ళ చరిత్ర కలిగిన టాటా గ్రూప్ ను అందనంత ఎత్తులో నిలబడేలా చేసాడు. నేడు ఉప్పు నుండి ఉక్కు వరకు టీ నుండి ట్రక్కుల వరకు ఇలా ప్రతి వ్యాపారంలో లోను ఖచ్చితంగా టాటా పేరు వినిపిస్తుంది. ఇంతటి ఘన చరిత్రను టాటా గ్రూప్ కు కట్టబెట్టేలా చేసాడు అతను. అతనే రతన్ టాటా. కొన్ని కోట్ల మంది భారతీయులకు ఆదర్శప్రాయుడు ఈ జీవన విజేత. రతన్ టాటా గురించి చూసుకుందాం: 1937 డిసెంబర్ 28 న దేశంలోనే ధనిక కుటుంబంలో జన్మించాడు రతన్ టాటా. ఏడేళ్ల వయసులోనే తల్లి తండ్రులిద్దరూ విడిపోవటంతో నాయనమ్మ దగ్గర పెరగవలిసి వచ్చింది. తన చదువును అమెరికాలోనే పూర్తి చేసుకొని ఆర్జెడి టాటా పిలుపు మేరకు జంషెడ్ పూర్ లోని టాటా స్టీల్ కంపెనీలో అప్రెంటీస్ గా తన ప్రస్థానాన్ని ప్రారంభించాడు రతన్. ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఆలోచనలతో, తన నైపుణ్యంతో టాటా కంపెనీలో ఒక ఉత్తమ ఉద్యోగిగా ఎదిగగలిగాడు రతన్. ఆ విధంగా కొన్ని సంవత్సరాలు ఉద్యోగిగా పనిచేసిన తరువాత 1991 లో ఆర్జెడి టాటా నుండి టాటా గ్రూప్ చైర్మన్ గా భాద్యతలు స్వీకరించాడు రతన్. అప్పట్లో ఈ నిర్ణయాన్ని బోర్డు అఫ్ మెంబెర్స్ లో చాలా మంది వ్యతిరేకించారు. అనుభవం లేని రతన్ చేతిలో ఇన్ని కోట్ల వ్యాపార సామ్రాజ్యం నడవలేదని అందరు వాదించారు. కానీ వారికి ఆనాడు తెలియదు పాపం ఇతడే టాటా గ్రూప్ ను దశదిశలా వ్యాపించే ఘనుడు అవుతాడని... చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత టాటా గ్రూప్ లో సమూల ప్రక్షాళన చేసాడు రతన్. రాత్రి పగలు కష్టపడి పది వేల కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యాన్ని తన అసాధారణ వ్యాపార నైపుణ్యంతో ఆరు లక్షల కోట్ల విలువ చేసే కంపెనీగా మార్చాడు రతన్. దేశ వాణిజ్య , పారిశ్రామిక పురోగతిలో కీలక పాత్ర పోషించాడు. నేడు టాటా గ్రూప్ 90 కి పైగా దేశాలలో విస్తరించి వందకు పైగా వ్యాపారాలలో తన ముద్రను వేసి, దేశంలోనే కాదు, ప్రపంచం లోనే అత్యుత్తమ కంపెనీలలో ఒకటిగా నిలబడింది. వ్యాపార సామ్రాజ్యంలో ఒక శిఖరంగా ఎదగగలిగింది. ప్రతి మధ్య తరగతి వాడికి సొంతంగా ఒక కారు ఉండాలనే ఉద్దేశంతో కేవలం లక్ష రూపాయలకే టాటా నానో కారును మార్కెట్లోకి తెచ్చి పెను సంచలనాన్నే సృష్టించాడు రతన్.. నానో కారు ఓ సంచలనం: టాటా గ్రూప్ భారత దేశానికి ఎన్నో కొత్త కొత్త వ్యాపారాలను పరిచయం చేసింది. నేడు ఎయిర్ ఇండియా గా పిలబడుతున్న విమానయాన సంస్థను మొదట టాటాఎయిర్ లైన్స్ పేరుతో 1868 లో జంషెడ్ జీ టాటా స్థాపించాడు. కాలక్రమంలో అది కాస్త ప్రభుత్వం చేతిలోకి వెళ్ళింది. ఇప్పుడు మళ్లీ టాటా ల చేతికే వచ్చింది. అలాగే భారత దేశంలో మొట్టమొదటి హోటల్ అయిన తాజ్ హోటల్ ను ప్రారంభించింది కూడా టాటాలే. బ్రిటన్ కు చెందిన టేట్లి అనే కంపెనీని టాటా టీ లో కలుపుకొని ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద టీ కంపెనీ గా టాటా టీ ఎదిగింది. అంతే కాదు మనల్ని పాలించిన బ్రిటిషర్లకే ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగాడు రతన్ టాటా. ఎన్నో విదేశీ కంపెనీలను టాటా గ్రూప్ లో కలుపుకొని టాటా ను ఒక మహా సామ్రాజ్యంగా ఎదిగేలా చేసాడు. 1998 లో టాటా ఇండికా కార్లను ప్రవేశ పెట్టారు. అయితే దురదృష్టవశాత్తు ఆ కార్లు మొదటి సంవత్సరంలోనే ఫెయిల్ అవటం తో రతన్ టాటా ఇండికా కార్ల వ్యాపారాన్ని అమ్మేయాలని భావించాడు. ఇందు కోసం అమెరికా లోని ఫోర్డ్ కంపెనీకి తన టీం తో పాటు రతన్ టాటా కూడా వెళ్లారు. అయితే ఫోర్డ్ కంపెనీ చైర్మన్,రతన్ టాటా ను మీకు కార్లు ఎలా తయారు చేయాలో తెలియనప్పుడు కార్ల బిజినెస్ ఎందుకు స్టార్ట్ చేసారు అని అవమానించాడు. ఈ సంఘటనతో ఆ డీల్ మాట్లాడకుండానే వెనుదిరిగి వచ్చేసారు. కొన్ని సంవత్సరాల తరువాత టాటా ఇండికా నష్టాలనుండి లాభాల లోకి రావటం మొదలు పెట్టింది. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా , అదే సమయంలో ఫోర్డ్ కంపెనీకి చెందిన జాగ్వార్ ,లాండ్రోవర్ కార్లు భారీగా నష్టాల్లోకి వెళ్లిపోయాయి. ఆ సమయం లోనే రతన్ ఆ రెండు కంపెనీలను నేను కొంటాను అని ఫోర్డ్ కంపెనీకి ఆఫర్ చేసాడు రతన్. అప్పుడు ఫోర్డ్ కంపెనీ చైర్మన్ తన టీం తో అమెరికా నుండి ముంబై కు వచ్చాడు. ఆ విధంగా తనను అవమానించిన వారికే గుణపాఠం చెప్పాడు రతన్. నానో కార్ల ఉత్పత్తి కోసం పశ్చిమ బెంగాల్ లో ఏర్పాటు చేసిన ప్లాంటును అక్కడి రైతులు వ్యతిరేకించడంతో ,ఆ ప్లాంటు మరొక చోటుకు మార్చటంతో వేల కోట్ల నష్టాన్ని చూడవలసి వచ్చింది . పాకిస్థాన్ ఉగ్రవాదులు 2008 నవంబర్ 26న తాజ్ హోటల్ పై జరిపిన ఉగ్ర దాడిలో వందల మంది అతిథులను, తమ ఉద్యోగస్థులను పోగొట్టుకోవాల్సివచ్చింది. ఈ సంఘటన రతన్ ను మానసికంగా ఎంతో బాధించింది. లక్షల కోట్ల విలువ చేసే కంపెనీలకు అధిపతులైనా టాటా వంశీయులు ఇంతవరకు ఏనాడూ ఫోర్బ్స్ ధనవంతుల జాబితాలో నిలవలేదు. ఎందుకంటే టాటా గ్రూప్ నుండి వచ్చే లాభాలలో 66శాతం టాటా ట్రస్టులకు విరాళంగా ఇవ్వటం జరుగుతుంది. దేశ సామజిక పరిస్థితులు మెరుగుపరచటానికి టాటా ట్రస్టలు ఎంతగానో కృషి చేస్తున్నాయి. తాజ్ ఉగ్ర దాడిలో నష్టపోయిన వారికి అన్ని విధాలా సహాయమందించాడు రతన్. బ్రహ్మచారి గా ఉంటూ నలుగురి బాగు కోసం బతుకుతున్న మహనీయుడు రతన్ టాటా. తన ప్రతిభను మెచ్చి పలు దేశాలలోని యూనివర్సిటీలు తనను గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. అంతే కాదు భారత ప్రభుత్వం పద్మ భూషణ్, పద్మ విభూషణ్ లతో రతన్ ను గౌరవించింది. కోట్లకు అధిపతి అయినా ఏనాడూ కుసుమంత గర్వాన్ని కూడా ప్రదర్శించలేదు రతన్ టాటా. 84ఏళ్ళ వయసులోనూ సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటూ కోట్ల మంది భారతీయుల హృదయాలను గెలుచుకున్నాడు రతన్. నేడు రతన్ టాటా అంటే ఒక వ్యక్తి కాదు,ఒక సంస్థ , ఒక బ్రాండ్. వీటన్నిటికీ మించి సృజనాత్మకత , దార్శనికత ఉన్న ఒక గొప్ప మానవతావాది. ముంబైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రతన్ టాటా 2024 అక్టోబరు 9న 86 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచారు. రక్తపోటు అకస్మాత్తుగా పడిపోవడంతో అక్టోబరు 7న బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చేరిన ఆయనకు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వైద్యులు చికిత్స అందించిన లాభం లేకుండా పోయింది. నేడు 130 కోట్ల మంది భారతీయులు మనసారా సగర్వంగా ఇతడు మా భారతీయుడు అని చెప్పుకునే వారిలో ముందు వరుసలో ఉంటాడు రతన్ టాటా. అతని సాగించిన జీవన ప్రయాణం నేడు మనందరికీ స్ఫూర్తిదాయకం.

## పల్లె ప్రజాస్వామ్యానికి గ్రామసభ పునాది

గ్రామ స్వరాజ్యం నెలకొనాలంటే అట్టడుగు స్థాయిలో స్థానిక ప్రజల భాగస్వామ్యం పెరగాలి. కౌటిల్యుని అర్థశాస్త్రం గ్రామాధికారుల గురించి ప్రస్తావించింది. చోళులు స్థానిక స్వపరిపాలనకు పెద్దపీట వేశారు. రిప్పన్ స్థానిక ప్రభుత్వాల ఏర్పాటుకు కృషి చేశాడు.

రాజ్యాంగంబి పంచాయతీ రాజ్ వ్యవస్థ

మనదేశంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 40 వ నిబంధన ప్రకారం గ్రామ పంచాయతీ వ్యవస్థ ఏర్పడ్డధి. కాలక్రమేనా పంచాయతీ రాజ్ వ్యవస్థలో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. బలవంతరాయ్ మెహతా అశోక్ మెహతా కమిటీ స్థానిక ప్రభుత్వాల ఏర్పాటుకు పలు సూచనలు చేశాయి.

1980సం""లో 1993 సం" లో 73 వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థకు రాజ్యాంగ బద్ధత కల్పించ బడింది.

పల్లె ప్రజాస్వామ్యం బిగ్రామసభ

భారతదేశం గ్రామాల్లో నివసిస్తుంది అంటాడుమహాత్మాగాంధీ. గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి. గ్రామాలు ఆర్థికంగా సంపన్నమైతేనే దేశఆర్థిక వ్యవస్థ పరిపుష్టమవుతుంది. గ్రామాల సమగ్ర అభివృద్ధిలో గ్రామసభలు బహుముఖ పాత్ర పోషిస్తాయి. స్థానిక పల్లె ప్రజాస్వామానికి గ్రామ సభపునాది.

పాలనలో పారదర్శకత జవాబుదారితనం× గ్రామ పంచాయతీ సర్పంచ్ వార్డ్ సభ్యులు గ్రామ కార్యదర్శి తమ విధులను బాధ్యతలను సక్రమంగా నిర్వహించడంలో గ్రామ సభ ఒక దిక్సూచి గా పనిచేస్తుంది. చోళులు కాకతీయుల పాలన కాలంలో గ్రామసభలు క్రియాశీలకంగా పనిచేసిన చారిత్రిక ఆధారాలు ఉన్నాయి. అధికారవికేంద్రకరణపాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడంలో గ్రామసభ క్రియాశీలకపాత్రపోషిస్తుంది. గ్రామసభ లో గ్రామ అభివృద్ధి కొరకు చేసే ఖర్చులు చేపట్టే పనులు పథకాల అమలుపై చర్చిస్తారు ఈ చర్చ అవినీతి అరికట్టి పాలకవర్గంలో జవాబుదారీతనాన్ని పెంచుతుంది. పాలనలో పారదర్శకత పెరుగుతుంది. ప్రజలచేత సూక్ష్మ స్థాయి అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన జరుగుతుంది. గ్రామ సభలో గ్రామ సమస్యలను గుర్తిస్తారు. గ్రామ సౌకర్యాలు డ్రైనేజీ రోడ్లు తాగునీటి వసతి పాలు పార్కులు పాఠశాల మొదలగు వాటి ప్రాధాన్యతను బట్టి గుర్తిస్తారు. గ్రామం యొక్క అవసరాలను గ్రామస్తులు అందరూ కలిసి నిర్ణయిస్తారు. సమష్టి నిర్ణయాలు ప్రజాస్వామ్య బద్ధంగా చేపడతారు. ప్రతి సంవత్సరం గ్రామ పంచాయతీ తయారు చేసే వార్షిక అభివృద్ధి ప్రణాళికకు గ్రామసభ ఆమోదం తప్పనిసరి . లబ్ధిదారుల ఎంపిక ప్రభుత్వ పథకాలు పింఛన్లు ఇండ్లు రేషన్ కార్డులు అందుకు కావలిసిన అర్హులను ఎంపిక చేస్తారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రగతి పథకాల లబ్ధిదారులఎంపిక గ్రామసభలోనే జరుగుతుంది. దీనివల్ల రాజకీయాల జోక్యం తగ్గి నిజమైన పేదలకు ప్రభుత్వ పథకాల ఫలితాలు అందుతాయి .సామాజిక ఆర్థిక న్యాయం సిద్ధిస్తుంది.

సామాజిక తనిఖీ× గ్రామ సభలో పాల్గొన్న ప్రజలు

గ్రామంలో జరిగిన పనులను ఖర్చు చేసిన వివరాలు నేరుగా ప్రశ్నించవచ్చు సమాధానాలు రాబట్టవచ్చు పాలనకు మెరుగైన సూచనలు చేయవచ్చు. ఉపాధి హామీ పథకం లాంటి పనులను గ్రామసభ సామాజ తనిఖీచేస్తుంది .సమస్యల పరిష్కారం కోసం గ్రామస్తులు తమ సమస్యలకు నేరుగా సర్పంచ్ను పంచాయతీ కార్యదర్శి ఇతర అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తక్షణ పరిష్కారం పొందే అవకాశం ఉంటుంది .

సామాజిక ఐక్యత

కుల మత రాజకీయాలకతీతంగా రాజకీయ విభేదాలను చూడకుండా గ్రామ ప్రజలందరూ ఒకే చోట గ్రామాభివృద్ధి గురించి చర్చించడం వల్ల సామాజిక ఐక్యత బాధ్యత పెరుగుతుంది.

గ్రామీణ పరిశ్రమలను చేతివృత్తులను ప్రోత్సహించాలి

గ్రామంలో లభించే వనరుల ఆదారంగా కుటీర పరిశ్రమలు చిన్న తరహా పరిశ్రమలు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను చేతి వృత్తులను ప్రోత్సహించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పారిశ్రామిక అభివృద్ధి పథకాల పట్ల ప్రచారం చేసి పారిశ్రామిక అభివృద్ధి లో బా ప్రజలను భాగస్వాములను చేయాలి . ఆర్థికాభివృద్ధి పథకాలను కార్యక్రమాలను ప్రజల ముంగిట్లో చేర్చడానికి గ్రామసభలు

చోదక శక్తిగా పనిచేయాలి.

గ్రామ సభ బిగ్రామస్వరాజ్యానికి (చిహ్నం) దిక్సూచి

గ్రామసభ కేవలం ఒక సామూహిక సమావేశం మాత్రమే కాదు. గ్రామ స్వరాజ్యానికి అది చిహ్నం. ప్రజలందరూ క్రియాశీలకంగా గ్రామసభలో పాల్గొన్నప్పుడు గ్రామంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు గ్రామస్వరాజ్యం సాధించినపుడే నిజమైన ప్రజాస్వామ్యం సిద్ధిస్తుంది.

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు

ప్రభుత్వం పంచాయతీ రాజ్ ని లోపాలను తొలిగించి సంస్కరణలు చేపట్టాలి క్రమం తప్పకుండా నిర్ణీత పదవి కాలానికి పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలి.

ఫైనాన్స్ కమిషన్ ద్వారా వచ్చే నిధులు నేరుగా గ్రామ పంచాయతీ అకౌంట్లో డిపాజిట్ చేయాలి. నిరంతర అప్రమత్తతతో ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు అనేది నినాదం కాకుండా పల్లె ప్రగతికి ఉజ్వల భవిష్యత్తుకు ప్రజలు ఉద్యమించాలి.

ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేయకుండా ప్రజా సంఘాలు ప్రజలు గ్రామీణాభివృద్ధి లో పాలుపంచుకోవాలి.

నేదునూరి కనకయ్య
అద్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
కరీంనగర్ 9440245771



# ప్రజారోగ్యంతో చెలగాటం..!

**-పట్టణంలో జోరుగా నాణ్యత లేని చికెన్, మటన్ అమ్మకాలు**
**-న్యూ ఇయర్ కు పుట్టగొడుగుల్లా వెలుస్తున్న హోటళ్లు**
**-చౌక ధరలకు చికెన్, మటన్ మాంసాన్ని కొనుగోలు చేస్తున్న హోటల్ యాజమాన్యాలు**
**-భారీ ఆఫర్లకు సిద్దమవుతున్న ఫుడ్ కోర్టులు**
**-అనారోగ్యానికి గురవుతున్న వినియోగదారులు**
**-కొరవడిన అధికారుల పర్యవేక్షణ**



మణుగూరు, డిసెంబర్ 27 (భారతశక్తి): ఆదివారం వచ్చిందంటే చాలు చాలా మంది అడుగులు మాంసం మార్కెట్ వైపు పడతాయి. పండుగ, ప్రత్యేక సందర్భాల్లో కూడా వంటింట్లో ఘుమఘుమలు ఉంటాయి. అంటే మనం తినే మాంసం ఆరోగ్య కరమైనదేనా.? అంటే ఆలోచించాల్సిన విషయమే. మార్కెట్లో చూపురులకు కోడి, మేక మాంసం శుభ్రంగా ఉంటుంది. కానీ వాటిని వధించేటప్పుడు పశువైద్యాధికారితో పాటు శానిటరీ ఇన్స్పెక్టర్ అధికారి పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. కానీ అలాంటిది మణుగూరు మండలంలో గాని, మున్సిపాలిటీ పరిధిలో గాని ఎక్కడ జంతు పరీక్ష, పర్యవేక్షణ జరిగిన దాఖలాలు లేవు. మణుగూరు మున్సిపల్, పట్టణ కేంద్రంలో మాంసం ప్రియులు రోజురోజుకు పెరుగుతుండటంతో చికెన్, మటన్ అమ్మే వ్యాపారస్తులు చనిపోయిన మేకలను, కోళ్లను మాంసంగా మార్చి సొమ్ము చేసుకుంటూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. పాడైన చికెన్, మటన్ తిని అనారోగ్యాలకు గురవుతున్నామని గ్రామ ప్రజలు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఆహార తనిఖీ అధికారుల జాడ లేకపోవడంతో పట్టణంలో చికెన్, మటన్ వ్యాపారస్తుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా అనారోగ్యంతో రోగాల బారినపడి చనిపోయిన మేకలను, కోళ్లను, మాంసంగా మార్చి, ఫ్రిజ్లో దాచి వుంచి అమ్ముతున్నారు.

చౌక ధరలకే మాంసం విక్రయాలు

భోజనం హోటల్ యాజమాన్యం చౌక ధరలకు వస్తుందని లాభార్జనే ధ్యేయంగా అనారోగ్యంతో చనిపోయిన మేకలను, కోళ్ల మాంసాన్ని తక్కువ ధరలకు కొనుగోలు చేసి సుగంధ భరితమైన



మసాలా దినుసులతో మాంసపు వంటకాలు చేసి వినియోగదారులకు అందించి ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. కానీ భోజనం చేసిన వారు మాత్రం ఫుడ్ పాయిజన్ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా భోజనం హోటల్ లపై, చికెన్, మటన్ వ్యాపారస్తులపై జిల్లా అధికారయంత్రాంగం చర్యలు తీసుకోవడంలో విఫలమైందని గ్రామ పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. విఫలమైన అధికారుల పర్యవేక్షణ ఫలితంగా పట్టణంలో నలుమూలలా మాంస విక్రయ దుకాణాలు వెలసి ప్రజల అనారోగ్యానికి కారణం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు భోజనం హోటళ్లపై చికెన్, మటన్ దుకాణాలపై పర్యవేక్షిస్తూ నాణ్యమైన చికెన్ అమ్మకాలతో పాటు ఖచ్చితమైన తూకాలు, ధరలు పాటించే విధంగా చర్యలు తీసుకొని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన మటన్, చికెన్ భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూ ఇయర్ కు ఫుడ్ ఆఫర్లు.!

న్యూ ఇయర్ వేడుకల్లో పట్టణంలోని ప్రధాన రహదారికి



ఇరువైపులా ప్రతి సంవత్సరం ఆఫర్లతో బిర్యానీ సెంటర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తుంటాయి. ఈ సారి న్యూ ఇయర్ వేడుకలకు ఇంకా మూడు రోజుల సమయం మాత్రమే ఉండడంతో చికెన్, మటన్ వ్యాపారస్తులు భారీగా హోటళ్ల నుండి ఆడర్లు వస్తాయని, నలుమూలల నుండి కోళ్లు, మేకలను కొనుగోలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదే అదునుగా భావించి వ్యాపారులు కొందరు రోగాల బారిన పడిన మేకలు, కోళ్లను వధిస్తూ మాంసాన్ని విక్రయిస్తున్నారు. ప్రజా ఆరోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణ కరువువడంతో చికెన్, మటన్ వ్యాపారస్తుల ఆగడాలు మితిమీరి పోతున్నాయి. అడిగే వారు లేరు, ప్రశ్నించే వారు కరువడంతో ఇంకేముంది.. యథేచ్ఛగా అందినకాడికి దోచుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో ప్రజా ఆరోగ్య శాఖ నమ్మకం సన్నగిల్లిపోతుంది. మామూళ్ల మత్తులో జోగుతూ చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు.

## ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డుల ప్రదానోత్సవం

కడప, డిసెంబర్ 27(భారత శక్తి):శ్రీ గురు గోబింద్ సింగ్ జీ యొక్క చిన్న కుమారులు సాహిబ్జాదా బాబా జోరావర్ సింగ్ జీ మరియు బాబా ఫతేహ్ సింగ్ జీల బలిదానాన్ని స్మరించుకోవడానికి గాను వీర బాల్ దివస్ ప్రతి సంవత్సరం డిసెంబర్ 26న భారతదేశం అంతటా జరుపుకుంటారు.

వారి అసాధారణ ధైర్యం మరియు బలిదానాన్ని గౌరవిస్తూ, పిల్లల సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం మరియు దేశ నిర్మాణంలో వారి పాత్రను జరుపుకుంటూ ఈ కార్యక్రమాన్ని మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం నిర్వహించింది.



ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ (ఖఓఖీఃఖ) అవార్డుల ప్రదానోత్సవం భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన విజ్ఞాన్ భవన్, న్యూ ఢిల్లీ నందు ధైర్యం, కళలు ఒ సంస్కృతి, విజ్ఞాన శాస్త్రం ఒ సాంకేతికత, క్రీడలు, సామాజిక సేవ, ఆవిష్కరణలు వంటి రంగాల్లో అసాధారణ విజయాలు సాధించిన పిల్లలకు అవార్డులు ప్రదానం మరియుప్రధాన వీర బాల్ దివస్ కార్యక్రమం భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హాజరై, ప్రసంగించిన కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారాన్ని కడప కలెక్టరేట్ వీసీ హాల్ నందు

మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ మరియు సాధికారిత అధికారి శ్రీమతి పి రమాదేవి , జిల్లా బాలల పరిరక్షణ అధికారి. బి.ఆర్.సుభాష్ యాదవ్ , ప్రభుత్వ బాలల గృహ పర్యవేక్షణ అధికారి జి. వీరయ్య , జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది ,శిశు గృహ సిబ్బంది, తిఇటబ సూపర్వైజర్లు, బాలల సంరక్షణ కేంద్రాల (అఅఎబ)సిబ్బంది,అంగన్వాడి వర్కర్లు హాజరు కావటం జరిగింది.

## ఐఏఎస్‌ల ఆస్తులపై కేంద్రం కన్ను ? లెక్కలు తీయగలరా?




హైదరాబాద్, డిసెంబర్ 27(భారత శక్తి):

తెలంగాణలో ఇటీవల ఓ ట్రాన్స్ పోర్టు ఆఫీసర్‌పై ఏసీబీ దాడిచేస్తే వందల కోట్ల ఆస్తులు వెలుగు చూశాయి. అంతకు ముందు రెవిన్యూ సహా ఇతర విభాగాల్లో ఉద్యోగుల అవినీతిపై ఎటాక్ చేసినా వందల కోట్ల ఆస్తులే దొరుకుతున్నాయి. వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న సంగతి పక్కన పెడితే వీరే ఇలా సంపాదిస్తే ఇక ఐఏఎస్‌ల సంపాదన ఎలా ఉంటుందన్నది ఊహకు అందని విషయం. కానీ ఐఏఎస్‌ల చేతుల్లోనే అధికారం ఉంటుంది. వారిపై ఎవరు రెయిడ్ చేస్తారు?. కానీ కేంద్రం ఇప్పుడు కొత్తగా వారి ఆస్తుల వివరాలు వెల్లడించాలని ఒత్తిడి చేస్తోంది. కానీ చాలా మంది స్పందించడంలేదు.

స్థిరాస్తుల వివరాలు సమర్పించాలని ఐఏఎస్‌లకు ఆదేశం

కేంద్ర సిబ్బంది ,శిక్షణ శాఖ దేశంలోని ఐఏఎస్ అధికారులందరికీ కీలక ఆదేశాలు జారీ చేసింది. 2024 సంవత్సరానికి సంబంధించిన స్థిరాస్తి రిటర్నులను వచ్చే ఏడాది జనవరి 31 లోపు సమర్పించాలని స్పష్టం చేసింది. అధికారుల ఆస్తుల వివరాల్లో పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా ఈ ప్రక్రియను చేపడుతుంది. నిర్ణీత గడువులోపు ఆస్తుల వివరాలు ఇవ్వని పక్షంలో, సదరు అధికారులపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని కేంద్రం హెచ్చరించింది.

నిబంధనల ప్రకారం గడువు లోపు ఆస్తుల వివరాలు సమర్పించని అధికారులకు ప్రమోషన్లు, విదేశీ పోస్టింగ్‌ల విషయంలో అడ్డంకులు ఎదురవుతాయి. అంతేకాకుండా, వారికి ప్రభుత్వం నుంచి అందే విజిలెన్స్ క్లియరెన్స్ నిలిపివేస్తారు.

ఆస్తుల వివరాలు వెల్లడించడం నైతిక బాధ్యత

ఆస్తుల వివరాలు దాచడం లేదా తప్పుడు సమాచారం ఇవ్వడం ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్ ప్రకారం క్రమశిక్షణా ఉల్లంఘన. ఒక అధికారి సర్వీసులో చేరినప్పుడు ఉన్న ఆస్తులకు, సర్వీసులో ఉండగా సమకూరిన ఆస్తులకు మధ్య వ్యత్యాసాన్ని దీని ద్వారా పర్యవేక్షించవచ్చు. ఇది అవినీతిని అరికట్టడానికి ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేస్తుంది. ఆస్తుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ స్పారో ద్వారా బహిరంగ పరచడం వల్ల సామాన్యులకు కూడా సమాచార హక్కు చట్టం కింద లేదా నేరుగా అధికారుల ఆస్తులను తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఇది అధికారుల ప్రవర్తనను పరోక్షంగా నియంత్రిస్తుంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో దర్యాప్తు సంస్థలకు ఈ డేటా కీలకమైన ఆధారంగా మారుతుంది. పారదర్శకమైన పాలన అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఈ చర్య ఒక పునాది వంటిదని కేంద్రం చెబితోంది.

సివిల్ సర్వీస్ అధికారులందరికీ వర్తింపు

ప్రస్తుతం కేంద్రం జారీ చేసిన ఈ ఆదేశాలు కేవలం ఐఏఎస్ అధికారులకే పరిమితం కాకుండా, ఐపీఎస్ , ఐఎఫ్ఎస్ అధికారులకు కూడా వర్తిస్తాయి. ఈ ఏడాది ఆస్తుల వెల్లడి ప్రక్రియను మరింత కఠినతరం చేయడం ద్వారా, ఉన్నతాధికారుల్లో బాధ్యతాయుతమైన ప్రవర్తనను తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. డిజిటల్ విధానంలో ఈ వివరాల సేకరణ జరుగుతుండటంతో, డేటా విశ్లేషణ కూడా సులభం కానుంది. చాలా మంది అధికారులు తమ పేరుతో.. తమ కుటుంబసభ్యుల పేర్లతో విచ్చలవిడిగా ఆస్తులు పోగేసుకున్నారు. అందుకే వివరాలివ్వడానికి చాలా మంది వెనుకడుగు వేస్తున్నారు. ఎంతో మందికి బినామీ పేర్లతో ఆస్తులున్నాయి. ప్రతి ఒక్కరిపైనా సమగ్ర పరిశీలన జరిపితే ఓ రాష్ట్ర బడ్జెట్ అంత అక్రమాస్తులువెలుగు చూస్తాయని ఎక్కువ మంది నమ్మకం. కానీ అలా ఏ ప్రభుత్వమూ చేయదు.

## ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ: జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి.

వై ఎస్ ఆర్ కడప,డిసెంబర్ 27(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ప్రతిష్టాత్మకంగా అమలు పరచుచున్న ఎన్ టి ఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ పథకము క్రింద పంపిణీ చేయు 18 రకాల పెన్షన్లు డిసెంబర్ మాసానికి సంబంధించి డిసెంబర్ 31 వ తేదీన పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.



డిసెంబర్ నెలకు సంబంధించిన పింఛనులు ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 31వ తేదీననే పెన్షన్లు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం జరిగినదని, పెన్షన్ లబ్ధిదారులు సామాజిక పెన్షన్లు డిసెంబర్ 31వ తేదీన అందకపోతే 2026 జనవరి 2వ తేదీ (శుక్రవారం) న అందరికీ అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయడమైనదని తెలిపారు. పింఛనుల పంపిణీ 31-12-2025 నుండి 02-01-2026 వరకు జరుగుననన్నారు.డిసెంబర్,2025 నెలకు సంబంధించి 2,55,083 మంది పింఛనుదారులకు రూ.111.10 కోట్లు మంజూరు చేయడం జరిగిదనన్నారు.డి డి ఓ లు మరియు సచివాలయ సిబ్బంది ముందస్తుగానే సంబంధిత బ్యాంక్ మేనేజర్ల వారిని సంప్రదించి 30-12-2025వ తేదీన పించనుల మొత్తము విడుదల కాబడి డ్రా చేయవలసి వున్నదని, కావున పింఛను నగదు మొత్తము డ్రా చేనుకొనుటకు ఈ నెల 30 వ తేదీన తయారీగా వుండవలెనన్నారు.పింఛను పంపిణీ చేయు సిబ్బంది అందరికీ ఈ నెల 31 వ తేదీననే పింఛను మొత్తమును అందచేయబడి సిబ్బంది అందరూ వారు పంపిణీ చేయు సచివాలయ పరిధిలోని క్లస్టర్ నివాసాలకు 31వ తేదీ ఉదయం 7.00 గంటల లోపు పింఛను పంపిణీకి తయారీగా వుండవలెనన్నారు.

ఎం పి డి ఓ లు మరియు మునిసిపల్ కమీషనరులు వారి పరిధిలోని పింఛను పంపిణీ చేయు సిబ్బంది అందరిచే పింఛను పంపిణీని 31-12-2025 వ తేదీననే (బుధవారం) 99% పంపిణీ పూర్తి చేయవలెనని జిల్లా కలెక్టరు ఆ ప్రకటన లో తెలిపారు.

## నలుగురు బి.ఎల్.ఓ.లపై సస్పెన్షన్ వేటు: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, డిసెంబర్ 27(భారత శక్తి) : విధి నిర్వహణలో అలసత్వం వహించిన నలుగురు బి.ఎల్.ఓ. లను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిర్వహించే ఓటర్ల జాబితాల ప్రత్యేక తనిఖీ మరియు నవీకరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఎస్ఐఆర్ (ాఎఖీ) అంటే 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియకు సంబంధించి జిల్లాలో చేపడుతున్న సర్వేలో విధుల్లో తీవ్ర అలసత్వం వహించినందులకు గాను



కమలాపురం నియోజకవర్గం పరిధిలోని సి.కె.దిన్నె మండలం తాడిగాట్ల గ్రామ సచివాలయంలో పంచాయతీ సెక్రెటరీగా చేస్తున్న ఎన్. శాంతమ్మ, వల్లూరు మండలం టి.జి. పల్లె గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎల్. మారుతీ, వీరపునాయుని పల్లె మండలంలోని అలిదెన గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ సి. శివ మహేశ్వర్ రెడ్డి, ఎన్. పాలగిరి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ జి. మురళి కృష్ణ లను సస్పెండ్ చేస్తూ.. జిల్లా కలెక్టర్ శుక్రవారం సాయంత్రం ఆర్డర్ కాపీలను జారీ చేశారు. భారత ఎన్నికల సంఘం నిర్వహించే ఓటర్ల జాబితాల ప్రత్యేక తనిఖీ మరియు నవీకరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఎస్ఐఆర్ (ాఎఖీ) అంటే 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' విధుల్లో విఫలం కావడం, నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయలేక పోవడం, అలసత్వం వంటి కారణాలతో వారిని విధుల నుండి తొలగించడమైనదన్నారు. ఎవరైనా, ఎంతటి వారైనా సరే విధులు, బాధ్యతల పట్ల అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆ ప్రకటన ద్వారా హెచ్చరించారు.

## పోరుమామిళ్ల పోలిస్టేషన్ ను మైదుకూరు డిఎస్పీ ఆకస్మిక తనిఖీ

పోరుమామిళ్ళ, భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 26:మైదుకూరు డి ఎస్ పి పోరుమామిళ్ల సర్కిల్ ఆఫీస్, పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ మరియు శ్రీ అవధూత కాశినాయన పోలీస్ స్టేషన్లను తనిఖీ చేయడం జరిగింది. పోలీస్ స్టేషన్ యొక్క సమగ్ర కార్యాచరణ, పరిపాలనా సామర్థ్యం, శాంతిభద్రతల నిర్వహణ, నేరాల గుర్తింపు మరియు ప్రజాసేవల అందజేతను అంచనా వేయుటకు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేయడం జరిగింది. తనిఖీ సందర్భంగా ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, కేసు డైరీలు, స్టేషన్ నేరాల రికార్డులు, ప్రాపర్టీ రిజిస్టర్లు మరియు జనరల్ డైరీలను పరిశీలించటం జరిగింది.

స్టేషన్‌లోని సిబ్బంది బలం, విధుల కేటాయింపు పట్టికలు, క్రమశిక్షణ మరియు శాఖా ఆదేశాల పాటింపును సమీక్షించటం జరిగింది. స్టేషన్ ప్రాంగణం పరిశుభ్రత, లాకప్ పరిస్థితి, మౌలిక సదుపాయాల లభ్యత, వాహనాల పరిస్థితిని కూడా తనిఖీ చేయడం జరిగింది. పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, పిటిషన్ల పరిష్కారం మరియు న్యాయస్థాన ఆదేశాల అమలును క్షుణ్ణంగా పరిశీలించటం జరిగింది.కార్యక్షమత, బాధ్యతాభావం మరియు ప్రజాముఖ పోలీసింగ్‌ను మెరుగుపరచుటకు అవసరమైన ఆదేశాలు మరియు మార్గదర్శకాలు జారీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల సీఐ, కె. హేమ సుందర రావు , పోరుమామిళ్ల ఎస్ ఐ, ఆర్. వి. కొండారెడ్డి , కాశినాయన ఎస్ ఐ, పి. యోగేంద్ర , స్టేషన్ సిబ్బంది మరియు పోరుమామిళ్ల మండల మహిళా పోలీసులు పాల్గొనడం జరిగింది.

# కిలో వెండి ధర @ రూ.2.50 లక్షలు..
# ఆగని పుత్తడి పరుగు

హైదరాబాద్: నగరంలో వెండి, బంగారం ధరలు భారీగా పెరిగాయి (ఉ నీశ్రీట జీనిట వాతిశ్రీలవతీ ఖతీతిఇవబ). కిలో వెండి ధర రూ.2.50 లక్షలకు చేరింది. నెల రోజుల్లోనే దాదాపు రూ.80 వేలు పెరగడం గమనార్హం. 10 గ్రాముల బంగారం 24 క్యారెట్ల ధర రూ.1.43 లక్షలు, 22 క్యారెట్ల ధర రూ.1.31 లక్షలుగా ఉంది.




అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాల కంటే తగ్గిన నేపథ్యంలో, తదుపరి సమీక్షలోనూ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత విధిస్తుందనే అంచనాలు పెరిగాయి. ఆర్థిక అనిశ్చితులు తొలగకపోవడంతో, సుస్థిరమనే భావనతో విలువైన బంగారం, వెండి పైకి పెట్టుబడులు తరలివస్తూనే ఉన్నాయి. గిరాకీకి తగ్గట్లు వెండి సరఫరా లేదని, అందువల్ల ధరలు పెరుగుతాయనే అంచనాలను దృష్టిలోపెట్టుకొని ఎక్కువమంది వెండిపై పెట్టుబడులు పెడుతున్నారని విశ్లేషకులు చెబుతున్నారు.

ఇక ఈ ఏడాది ఇప్పటికే పుత్తడి (ఉ నీశ్రీట) ధర దాదాపు 70 శాతానికి పైగా ఎగబాకింది. 1979 తర్వాత ఇదే అతిపెద్ద వార్షిక లాభమని నిపుణులు చెబుతున్నారు. 2026 ప్రారంభంలోనూ ఈ లోహాల ధరల పరుగు కొనసాగొచ్చని అంచనా వేశారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు ఈ పెరుగుదలకు కారణమవుతున్నాయి.

# హాస్పిటల్‌లో క్యాన్సర్, డయాలసిస్ సేవలు ప్రారంభించిన నీతా అంబానీ




ముంబయి: రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ గొప్ప మనసు చాటుకున్నారు. ముంబయిలోని సర్ హెచ్‌ఎన్ రిలయన్స్ ఫౌండేషన్ హాస్పిటల్‌లో 'జీవన్' పేరిట కొత్త విభాగాన్ని ప్రారంభించారు. ఇందులో క్యాన్సర్, డయాలసిస్ పేషెంట్లకు సేవలు అందించనున్నారు. తన భర్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీతో కలిసి ఈ సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఈ విభాగాన్ని తన తండ్రి రవీంద్రభాయ్ దలాల్‌కు అంకితమిచ్చారు. తోటివారిపై దయ, సేవాదృక్పథం కలిగిఉండాలని తన తండ్రి నేర్పించారని గుర్తుచేసుకున్నారు. ఆస్పత్రి విశేషాలతో కూడిన ఓ వీడియోను పంచుకున్నారు.

"రిలయన్స్ ఫౌండేషన్ హాస్పిటల్ ద్వారా ఇప్పటివరకు 33 లక్షల మంది రోగులకు, 16 లక్షల మంది చిన్నారులకు వైద్యం అందించాం. ఈ హాస్పిటల్‌లో కొత్తగా జీవన్ విభాగాన్ని తీసుకొస్తున్నాం. ఈ విభాగాన్ని నా తండ్రి రవీంద్రభాయ్ దలాల్‌కు అంకితమిస్తున్నా. ఈ విభాగంలో అత్యాధునిక కీమోథెరపీ, ఇమ్యునోథెరపీ, డయాలసిస్ వంటి వైద్య సేవలు ఒకేచోట లభిస్తాయి. ఇందులో పిల్లలకు ప్రత్యేకంగా కీమోథెరపీ వార్డ్ ఉంది. ఈ విభాగానికి వచ్చే ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా చిన్న పిల్లలు మెరుగైన ఆరోగ్యం, ఉజ్వల భవిష్యత్తుపై నమ్మకంతో తిరిగి వెళ్లాలన్నదే మా సంకల్పం" అని నీతాఅంబానీ పేర్కొన్నారు.




# ఎయిర్ కండిషనర్ల ధరలు వేడెక్కుతాయ్

ఏసీల తయారీలో కీలకమైన రాగి ధర పెరగడం వల్ల, కంప్రెసర్, మోటార్, హీట్ ఎక్స్ఛేంజర్, ట్యూబింగ్, వైరింగ్ వ్యయాలు అధికమవుతున్నాయి. అల్యూమినియం పరుగుతో పాటు, రూపాయి క్షీణత వల్ల దిగుమతి చేసుకునే కంప్రెసర్లు ఖరీదవుతున్నాయి.

చల్లదనం ఇచ్చేందుకు ఏసీల్లో నింపే రిఫ్రిజరెంట్ కూడా మారుతుంది. ప్రస్తుతం ఆర్410ఏను వినియోగిస్తుండగా, పర్యావరణ అనుకూల ఏ2ఎల్‌ను వాడాల్సి ఉంటుంది.

జీఎస్‌టీ రేట్ల సవరింపుతో పాటు, ఈ ఏడాదిలో వర్షాల వల్ల అమ్మకాలు తగ్గిపోవడంతో, పండుగ సీజన్‌లో ఎయిర్ కండిషనర్ల (ఏసీ) ధరలను కంపెనీలు 10% వరకు తగ్గించాయి. మళ్లీ వచ్చే జనవరి నుంచి వీటి ధరలను 3-12% పెంచొచ్చనే సంకేతాలు వస్తున్నాయి. ఏసీలు విద్యుత్తును మరింత తక్కువ వినియోగించుకునేలా నూతన ప్రమాణాలను బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) తెస్తుండమే ఇందుకు కారణం.

**సామర్థ్యం మెరుగు పడాలంటే**

ఏసీ కొనడం సులభమే అయినా, వినియోగమే ఎక్కువమందికి భారంగా ఉంటోంది. ఏసీలు అధిక విద్యుత్తును వినియోగిస్తుండటమే దీనికి కారణం. ఇవి ఎంత తక్కువ విద్యుత్తును వినియోగించుకుంటే, అంతటి మెరుగైన రేటింగ్ (గరిష్ఠంగా 5స్టార్)ను బీఈఈ ఇస్తుంటుంది. ఇందుకోసం పాటించాల్సిన నిబంధనలను బీఈఈ సవరిస్తుంటుంది. 2026 జనవరి నుంచి కొత్త నిబంధనల ప్రకారమే కంపెనీలు ఏసీలను తయారు చేయాల్సి ఉంది. అంటే మరింత నాణ్యతమైన ముడిపదార్థాలను ఏసీల తయారీకి వినియోగించాల్సి వస్తుంది. తయారీ పద్ధతుల్లో కూడా కొన్ని మార్పులుంటాయి. ఏసీల తయారీలో వినియోగించే లోహాల ధరలతో పాటు విదేశాల నుంచి దిగుమతి చేసుకునే విడిభాగాల ధరలు కూడా రూపాయి క్షీణత వల్ల అధికమయ్యాయి. ఇందువల్లే ఏసీల ధరలు పెంచక తప్పదని ఒక అగ్రగామి కంపెనీ ఉన్నతాధికారి 'ఈనాడు'తో చెప్పారు.

**ధరల పెంపు ఇలా**

విద్యుత్తు వినియోగ సామర్థ్యం కొంత తక్కువగా ఉండే 3 స్టార్ ఏసీల ధరలు 3-4% పెరిగే అవకాశం ఉంది. విద్యుత్తును తక్కువగా వినియోగించుకునే 5 స్టార్ ఏసీల ధరలు మాత్రం 8-12% పెంచాలని కంపెనీలు అంతర్గతంగా నిర్ణయించుకున్నాయి. అంటే, జీఎస్‌టీ రేట్ల తగ్గింపు నేపథ్యంలో, వినియోగదారులకు ఏసీ ధరల రూపేణ లభించిన ప్రయోజనానికి సమానంగా ఇప్పుడు ధరల పెంపు ఉండనుంది.

**పాత సరకు విక్రయాలు కొనసాగుతాయ్**

ఈ ఏడాది దేశవ్యాప్తంగా విస్తృత వర్షపాతం నేపథ్యంలో, ఏసీల విక్రయాలు బాగా తగ్గాయి. సాధారణంగా కంపెనీల వద్ద ఏటా జులై-ఆగస్టు కల్లా, ఏసీల తయారీకి అవసరమైన ముడిపదార్థాలు పూర్తవుతాయి. తదుపరి కొత్తగా ముడిపదార్థాలు సమీకరిస్తాయి. ఈ ఏడాది వర్షాల నేపథ్యంలో, ఈసారి కొన్ని ప్రధాన కంపెనీల వద్దా పాత ముడిపదార్థాలు మిగిలే ఉన్నాయని సమాచారం. డీలర్ల వద్దా ఏసీల నిల్వలు అధికంగానే ఉన్నాయి. బీఈఈ ప్రకటించే కొత్త ప్రమాణాలకు అనుగుణంగానే కంపెనీలు, నూతన ఉత్పత్తులను నిర్దేశిత తేదీ నుంచి తయారు చేయాల్సి ఉంటుంది. డీలర్లు, విక్రయశాలల్లో ఉన్న పాత సరకును మాత్రం అవి పూర్తయ్యేవరకు విక్రయించొచ్చు.

# కోఫోర్జ్ చేతికి ఏఐ సంస్థ ఎంకోరా

దిల్లీ: అమెరికాకు చెందిన ఏఐ (కృత్రిమమేధ) సంస్థ ఎంకోరాలో 100% వాటాను 2.35 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.21,333 కోట్లు) ఎంటర్‌ప్రైజ్ విలువకు కొనుగోలు చేయనున్నట్లు ఐటీ సేవల కంపెనీ కోఫోర్జ్ తెలిపింది. మొత్తం షేర్ల లావాదేవీ ద్వారా జరిగే ఈ కొనుగోలులో ప్రస్తుత ఎంకోరా వాటాదార్లకు 1.89 బి. డాలర్ల విలువైన ప్రిఫరెన్షియల్ షేర్లను కోఫోర్జ్ జారీ చేస్తుంది. లావాదేవీ పూర్తయ్యాక, విక్రేతలకు కోఫోర్జ్‌లో 20% వాటా ఉంటుంది. 'అడ్వెంట్ ఇంటర్నేషనల్, వార్‌బర్గ్ పింకస్, ఇతర మైనారిటీ వాటాదార్ల నుంచి ఎంకోరాలో 100% షేర్ల కొనుగోలు నిమిత్తం ఒప్పందంపై సంతకాలు చేసిన'ట్లు ఎక్స్ఛేంజీలకిచ్చిన సమాచారంలో కోఫోర్జ్ తెలిపింది.




# ఈశాన్య పర్యాటకానికి 'ఓటీటీ'ల సహకారం



దేశంలో పర్యాటకానికి ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లూ ఉపకరిస్తున్నాయి. ఎలాగంటారా.. ఇప్పుడు ఓటీటీల్లో వేర్వేరు భాషల వెబ్‌సిరీస్‌లను డబ్బింగ్ వెర్షన్ లేదా.. సబ్‌టైటిల్స్ సాయంతో అన్ని భాషల వారూ చూస్తున్నారు. వాటిల్లోని అందమైన క్షేత్రాలు, ఆకట్టుకున్న ప్రదేశాలకు వెళ్లి రావాలనే కోరిక పర్యటనలపై ఆసక్తి ఉన్నవారికి కలుగుతోంది. ప్రేక్షకాదరణ పొందిన వెబ్‌సిరీస్‌లలోని ప్రదేశాలను చూసి వచ్చేందుకు యువత ఉత్సుకత చూపుతోంది. ఈశాన్య రాష్ట్రాల్లో పర్యాటక రంగ వృద్ధికి, అక్కడి సహజ సౌందర్యంతో పాటు ఓటీటీల చిత్రీకరణలూ కారణమవుతున్నాయని, టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌లు వెల్లడిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు ఎందుకు మక్కువ చూపుతున్నారనే అంశాన్ని టికెట్ బుకింగ్ సమయంలో లేదా రివ్యూల నుంచి సేకరించి, ఈ నివేదికను బుకింగ్ ప్లాట్‌ఫామ్ ఇక్సిగో రూపొందించింది. ఈ నివేదిక ప్రకారం..

**ఈ వెబ్‌సిరీస్‌లన్నీ**

దేశ ఈశాన్య ప్రాంతాల్లోని పరిస్థితులను కథావస్తువుగా చేసుకుని ద ఫ్యామిలీ మ్యాన్ (సీజన్ 3), పాతాళ్ లోక్ (సీజన్ 2), దిల్లీ క్రైమ్ (సీజన్ 3) వెబ్ సిరీస్‌లను రూపొందించారు. వీటిల్లో ఈశాన్య ప్రాంతంలోని రమ్యమైన ప్రకృతి దృశ్యాలు, వినూత్న నివాస సముదాయాలు, సంస్కృతులను చూపించడంతో.. అక్కడ పర్యటించాలనే కుతూహలం పర్యాటకుల్లో పెరిగిందని నివేదిక తెలిపింది. ఈ రాష్ట్రాల్లోని కీలక నగరాలైన దిమాపుర్, అగర్తలా, గువాహటి, ఇంఫాల్, ఇటానగర్‌కు ఈ ఏడాది విమాన టికెట్ల బుకింగ్‌లు దేశంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి గణనీయంగా పెరిగాయని పేర్కొంది. ఇప్పటివరకు ఎక్కువ మంది పర్యటించని ప్రాంతాలు కావడం వల్లా, వీటికి గిరాకీని పెంచిందని తెలిపింది.

**ఆధ్యాత్మిక పర్యటనలకూ గిరాకీ**

దేశంలో ఆధ్యాత్మిక పర్యటనలూ బాగానే పెరిగాయని.. ముఖ్యంగా మహా కుంభమేళాతో అన్ని రవాణా మార్గాల్లోనూ ప్రయాగ్‌రాజ్‌కు బుకింగ్‌లు గణనీయంగా నమోదయ్యాయని పేర్కొంది. అంతర్జాతీయ గమ్యస్థానాల్లో జపాన్, దక్షిణ కొరియాకు ఎక్కువ బుకింగ్‌లు వచ్చినట్లు తెలిపింది. ఒమన్, కెన్యా, యూఈఏ, ఉజ్బెకిస్తాన్, ఖతార్ లాంటి ప్రాంతాలకు దేశీయ పర్యాటకుల నుంచి అధిక గిరాకీ ఉందని పేర్కొంది. దేశీయంగా, అంతర్జాతీయంగా కొత్త ప్రదేశాలకు వెళ్లిరావాలనే ఆసక్తి భారతీయుల్లో పెరుగుతోందనడానికి ఇది సంకేతమని నివేదిక వివరించింది.

# అగరబత్తీలకు కొత్త నాణ్యతా ప్రమాణాలు



ప్రపంచంలోనే అత్యధికంగా అగరబత్తీలను తయారు చేస్తూ, ఎగుమతి చేస్తున్న మనదేశంలో, వీటి నాణ్యతా ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం నూతన నిబంధనలు జారీ చేసింది. ఇందుకోసం భారత ప్రమాణాల మండలి (బీఐఎస్) మార్గదర్శకాలు విడుదల చేసింది. అగరబత్తీల తయారీలో కీటకనాశన రసాయనాల వాడకాన్ని నియంత్రించడం ద్వారా, వినియోగదార్ల ఆరోగ్యాన్ని కాపాడటం దీని వెనక ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం దేశీయ అగరబత్తీల వ్యాపార పరిమాణం సుమారు రూ.8,000 కోట్లుగా ఉంది. వినియోగదారు ఆరోగ్య భద్రత, అగరుబత్తీలు వెలిగించే గదిలో వాయు నాణ్యత, పర్యావరణ పరిరక్షణ, నియంత్రణ నిబంధనలు, కొన్ని రకాల సువాసన ఉత్పత్తులు, రసాయనాలపై అంతర్జాతీయంగా ఉన్న ఆంక్షలు తదితరాలను పరిగణనలోకి తీసుకుని.. అగరబత్తీల కోసం ప్రత్యేకంగా 'ఐఎస్ 19412:2025' ప్రమాణాలను రూపొందించారు. కొత్త ప్రమాణాలతో తీసుకొచ్చే అగరబత్తీలపై బీఐఎస్ ప్రమాణాల ముద్ర ఉంటుందని.. వీటి కొనుగోలు సమయంలో వినియోగదార్లు నాణ్యమైనవి ఎంపిక చేసుకునేందుకు ఇది ఉపకరిస్తుందని వినియోగదారు వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. అగరబత్తీల తయారీలో వినియోగించకుండా కొన్ని నిషేధిత ఉత్పత్తుల జాబితాను బీఐఎస్ రూపొందించింది. ఇందులో అలెథ్రిన్, పెర్‌మెథ్రిన్, సైపర్‌మెథ్రిన్, డెల్టామెథ్రిన్, ఫిప్రోనిల్ లాంటి వాటితోపాటు బెంజైల్ సయనైడ్, ఇథైల్ అక్రైలేట్, డైఫినైల్‌అమైన్ ఉన్నాయి. మానవ ఆరోగ్యం, గాలి నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉండటంతో వీటిల్లో చాలా వాటిపై అంతర్జాతీయంగానూ నిషేధం ఉంది.



# బౌలర్‌తో ఫొటోగ్రాఫ్.. బంతిపై ఆటోగ్రాఫ్.. పెద్ద మనసు చాటుకున్న విరాట్ కోహ్లీ

: టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ తర్వాత విజయ్‌హజారే ట్రోఫీలో పాల్గొన్నాడు. ఢిల్లీ తరఫున అతడు ఆంధ్రా జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌లో శతకంతో (131బీ 101 బంతుల్లో, 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగాడు. గుజరాత్, ఢిల్లీ మధ్య జరిగిన పోరులో అర్ధశతకం (77బీ 61 బంతుల్లో, 13 ఫోర్లు, 1 సిక్స్) సాధించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గానూ నిలిచాడు. ఢిల్లీ 7 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లోనూ సెంచరీ చేసేలా కనిపించిన విరాట్ కోహ్లీని గుజరాత్ స్పిన్నర్ విశాల్ జైస్వాల్ అద్భుతమైన బంతికి ఔట్ చేశాడు. అతడు సంధించిన బంతిని ముందుకువచ్చి షాట్ ఆడే ప్రయత్నంలో విరాట్ కోహ్లీ మిస్ చేశాడు. దీంతో ఆ బాల్‌ను అందుకున్న వికెట్ కీపర్ ఉర్విల్ పటేల్.. విరాట్‌ను స్టంపౌట్ చేశాడు.

మ్యాచ్ అనంతరం విరాట్ కోహ్లీ తన వికెట్ తీసిన విశాల్ జైస్వాల్‌కు బంతి మీద సంతకం (ఆటోగ్రాఫ్) చేసి ఇచ్చి తన పెద్ద మనసు చాటుకున్నాడు. అలాగే అతడితో ఫొటో దిగాడు. ఈ చిత్రాలను జైస్వాల్ తన ఇన్‌స్టా ఖాతాలో పంచుకున్నాడు. 'అతడి ఆటను టీవీలో చూసినప్పటి నుంచి అతడితో మైదానం పంచుకున్నప్పటి వరకు.. గ్రేట్ ఫుల్ మూమెంట్స్' అంటూ ఆ పోస్ట్ కింద రాసుకొచ్చాడు. ఈ పోస్ట్‌కు అభిమానుల నుంచి విశేష స్పందన వచ్చింది. విరాట్ కోహ్లీని ఫ్యాన్స్ కొనియాడుతున్నారు.

మరికొందరేమో.. 'వికెట్ తీసుకున్న తర్వాత ఎందుకు సెలబ్రేట్ చేసుకున్నావ్..?' అంటూ బౌలర్‌ను కూడా కామెంట్ల రూపంలో ప్రశ్నించారు. ఇంకొందరేమో అద్భుతమైన బంతికి విరాట్‌ను ఔట్ చేశావంటూ.. అభినందనలు తెలిపారు. ఏదేమైనా ఈ పోస్ట్ పెట్టిన కొన్ని గంటల్లోనే 53వేలకు పైగా లైక్స్ వచ్చాయి. అలాగే తాను విరాట్ వికెట్ తీసుకున్న బౌలింగ్ వీడియోనూ కూడా జైస్వాల్ ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. దానికి ఏకంగా 2.7 మిలియన్ వ్యూస్ వచ్చాయి. ఈ మ్యాచ్‌లో జైస్వాల్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 10 ఓవర్లలో అతడు 42 పరుగులిచ్చి 4 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు.

ఈ సీజన్‌లో విరాట్ కోహ్లీకి ఇదే ఆఖరు దేశవాళీ మ్యాచ్ కానుంది. మ్యాచ్ అనంతరం అతడు ముంబయికి చేరుకున్నాడు. జనవరి 11 నుంచి న్యూజిలాండ్ భారత్‌లో పర్యటించనుంది. ఈ నేపథ్యంలో మూడు వన్డే మ్యాచ్‌లు ఆడనుంది. ఇటీవల దక్షిణాఫ్రికాతో ముగిసిన వన్డే సిరీస్‌లో విరాట్ కోహ్లీ అద్భుతంగా రాణించాడు. న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌లోనూ అతడు పరుగుల వరద పారించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# ఎన్నాళ్లో వేచిన 'విజయం'.. ఆస్ట్రేలియా గడ్డ మీద 5,468 రోజుల తర్వాత గెలిచిన ఇంగ్లాండ్..

మెల్‌బోర్న్ వేదికగా యాషెస్ సిరీస్‌లో భాగంగా నాలుగో టెస్ట్‌లో (బాక్సింగ్ డే టెస్ట్) ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్ విజయం సాధించింది. రెండు రోజుల్లోనే ఈ టెస్ట్ మ్యాచ్ ముగియడం విశేషం. ఆస్ట్రేలియా గడ్డ మీద 5,468 రోజుల తర్వాత అంటే దాదాపు 15 సంవత్సరాల అనంతరం సుదీర్ఘ ఫార్మాట్లో ఇంగ్లాండ్ విజయం సాధించడం గమనార్హం. 175 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ 32.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 178 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ బ్యాటర్లలో ఓపెనర్లు జాక్ క్రాలీ 37 (48 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), బెన్ డకెట్ 34 (26 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) చక్కటి ఆరంభాన్ని అందించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 42 బంతుల్లోనే 51 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అనంతరం జాకబ్ బెథెల్ 40 (46 బంతుల్లో, 5 ఫోర్లు) సమయోచిత ఇన్నింగ్స్ ఆడాడు. బ్రైడన్ కార్స్ (6), జో రూట్ (15), బెన్ స్టోక్స్ (2) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. హ్యారీ బ్రూక్ (2లిబీ 9 బంతుల్లో), జెమ్మీ స్మిత్ (3లిబీ 2 బంతుల్లో) నాటౌట్‌గా నిలిచారు. ఆసీస్ బౌలర్లలో స్కాట్ బోలాండ్, రిచర్డ్‌సన్, మిచెల్ స్టార్క్ తలో రెండు వికెట్లు తీసుకున్నారు.



తొలుత 4/0 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండోరోజు ఆటను ప్రారంభించిన ఆసీస్ జట్టు 34.3 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌటైంది. మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం 42 రన్స్ కలుపుకొని, ఇంగ్లాండ్‌కు 175 పరుగుల విజయ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆసీస్ బ్యాటర్లలో ట్రావిస్ హెడ్ (46బీ 67 బంతుల్లో 4 ఫోర్లు) చెప్పుకోదగ్గ స్కోర్ చేశాడు. స్కాట్ బోలాండ్ 6, జేక్ వెదర్లాడ్ 5, లబుషేన్ 8, ఉస్మాన్ ఖవాజా 0, కామెరూన్ గ్రీన్ 19, మైఖేల్ నీసర్ 0, మిచెల్ స్టార్క్ 0, రిచర్డ్‌సన్ 7.. బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. స్టీవ్ స్మిత్ 24లి (39 బంతుల్లో 1 ఫోర్) నాటౌట్‌గా నిలిచాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ 4, జోష్ టంగ్, బెన్‌స్టోక్స్ తలో 2, గస్ అట్కిన్సన్ 1 వికెట్ తన ఖాతాలో వేసుకున్నాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 7 వికెట్లు తీసుకున్న జోష్ టంగ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో తొలిరోజు ఆటలో 20 వికెట్లు నేలకూలిన విషయం తెలిసిందే. అలాగే రెండో రోజు ఆటలో బౌలర్లు 16 వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. ఈ టెస్ట్ మ్యాచ్‌లో ఇరు జట్లకు చెందిన బ్యాటర్లెవరూ కనీసం హాఫ్ సెంచరీ సాధించలేకపోవడం గమనార్హం.

# రో-కో జోడీ.. వారి బ్యాటింగ్‌లో ఇంకా తగ్గని ఫైర్

రోహిత్ శర్మ . విరాట్ కోహ్లీ వీరి కెరీర్‌లో 2025 సంవత్సరం ఎంతో ముఖ్యమైంది. ఎందుకంటే ఈ ఏడాదే వారి కెరీర్ కీలక మలుపు తిరిగింది! మొదట రోహిత్ శర్మ మే 7న టెస్ట్ క్రికెట్‌కు తన రిటైర్మెంట్ ప్రకటించాడు. అనంతరం మే12న విరాట్ కోహ్లీ కూడా హిట్‌మ్యాన్ బాటలోనే నడిచాడు. సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. అలాగే వీరిద్దరూ అంతకు ముందే 2024లోనే టీ20 క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. ప్రస్తుతం వీరు కేవలం వన్డే క్రికెట్‌లోనే కొనసాగుతున్నారు. వన్డే వరల్డ్ కప్ 2027లో పాల్గొనడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

వన్డేల్లో పునరాగమనం..

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. దాదాపు ఏడు నెలల విరామం తర్వాత అక్టోబర్ 19న వన్డేల్లో పునరాగమనం చేశారు. ఆస్ట్రేలియాతో వారి గడ్డమీద జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో తిరిగి బ్యాట్లు పట్టారు! మొదటి వన్డేలో రోహిత్ 8 పరుగులు చేస్తే, విరాట్ డకౌట్ అయ్యాడు. ఇక రెండో మ్యాచ్‌లో రోహిత్ శర్మ తన రిథమ్ అందుకుని, హాఫ్‌సెంచరీతో (78) ఫామ్‌లోకి వచ్చాడు. అయితే కోహ్లీ మాత్రం ఈ మ్యాచ్‌లోనూ డకౌట్ అయ్యాడు. పునరాగమనంలో వరుసగా రెండు డకౌట్లతో ఒత్తిడికి గురయ్యాడు! కానీ మూడో మ్యాచ్‌లో విరాట్ అర్ధశతకంతో ఫామ్‌లోకి వచ్చాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ అజేయ సెంచరీతో (121లి) తన క్లాస్‌ను ప్రదర్శించాడు.

గేర్లు మార్చి.. వేగం పెంచి..

విరాట్ కోహ్లీ ఆస్ట్రేలియా టూర్‌లో తన బ్యాటింగ్ ఎక్కడ ముగించాడో.. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లోనూ అక్కడే ప్రారంభించాడు. రాంచి వేదికగా జరిగిన మొదటి వన్డేలో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. భారీ సెంచరీ (135) సాధించాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్ హాఫ్ సెంచరీతో (57) సత్తా చాటాడు. రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో వన్డేలోనూ కోహ్లీ శతకం (102) బాదాడు. విశాఖపట్నంలో జరిగిన మూడో వన్డేలో అజేయ హాఫ్ సెంచరీ (65లి) సాధించాడు. యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్‌తో (%ఖుంప్త్రఘుంజఱ జీుఅంఘుశ్రీ%) కలిసి రెండో వికెట్‌కు 84 బంతుల్లోనే 116 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. రెండో వన్డేలో రోహిత్ విఫలమైనప్పటికీ, మూడో వన్డేలో హాఫ్‌సెంచరీ (75) సాధించాడు.



దేశవాళీల్లోనూ పరుగుల వరద..

ప్రస్తుతం జరుగుతున్న విజయ్‌హజారే ట్రోఫీలోనూ వీరు సత్తా చాటారు. ముంబయి తరఫున రోహిత్, ఢిల్లీ తరఫున విరాట్ కోహ్లీ పరుగుల వరద పారించారు. సిక్కింతో ముంబయికి జరిగిన మొదటి మ్యాచ్‌లో రోహిత్ శర్మ భారీ శతకం (155) బాదాడు. ఆంధ్రతో జరిగిన తొలి మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ సెంచరీ (131), గుజరాత్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ (77) సాధించాడు. అంతర్జాతీయ మ్యాచుల్లోనే కాకుండా, దేశవాళీల్లోనూ ఈ జోడి రాణిస్తూ తమలో ఇంకా పరుగుల దాహం, బ్యాటింగ్‌లో వాడీవేడీ తగ్గలేదని నిరూపిస్తున్నారు. తమ పని అయిపోయిందన్న పలువురు విమర్శకుల నోళ్లనూ తమ ప్రదర్శనతోనే మూయిస్తున్నారు.

ఫిట్‌నెస్.. ఓ ఎస్!

విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్‌కు పెట్టింది పేరు. అతడి డైట్, వర్కౌట్స్ గురించి క్రీడాప్రపంచానికి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. కొంతకాలం కిందటి వరకు కాస్త బొద్దుగా కనిపించి రోహిత్ విమర్శల పాలయ్యాడు. కానీ తన పునరాగమనంలో స్లిమ్‌గా ఫిట్‌గా మారాడు. దాదాపు 10 కిలోల వరకు బరువు తగ్గాడు. ఇందుకోసం తాను ఎంతో ఇష్టంగా తినే వడాపావ్‌ను సైతం త్యాగం చేశాడు! కఠినమైన వ్యాయామాలూ చేశాడు. ఇలా 2025లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ పడిలేచిన కెరటాల్లా ఉవ్వెత్తున ఎగిశారు. కృషి, పట్టుదలలో యువ క్రికెటర్లకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

# హ్యాట్రిక్ కొట్టారు.. సిరీస్ పట్టారు



హర్మన్‌ప్రీత్, షెఫాలి

తిరువనంతపురం మొదట టాస్ గెలిచి భారత్ ఫీల్డింగ్ ఎంచుకోవడం.. బౌలర్లు విజృంభించి శ్రీలంకను కట్టడి చేయడం.. అనంతరం బ్యాటర్లు చెలరేగి అలవోకగా ఛేదనను పూర్తి చేయడం.. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఇవే దృశ్యాలు పునరావృతమయ్యాయి. వేదిక మారినా ఫలితం మారలేదు. వన్డే ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన తర్వాత ఆడిన తొలి సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే చేజిక్కించుకుంది హర్మన్‌ప్రీత్ సేన.

శ్రీలంకతో టీ20 సిరీస్‌లో భారత మహిళల జట్టుకు ఎదురే లేదు. హ్యాట్రిక్ విజయం సాధించిన హర్మన్‌ప్రీత్ సేన.. అయిదు టీ20ల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 3-0తో చేజిక్కించుకుంది. శుక్రవారం తిరువనంతపురంలో జరిగిన మూడో టీ20లో భారత్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట లంక 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 112 పరుగులే చేయగలిగింది. రేణుక సింగ్ (4-1-21-4) అద్భుత గణాంకాలు నమోదు చేసింది. దీప్తి శర్మ (3/18) సైతం లంక పతనంలో కీలక పాత్ర పోషించింది. షెఫాలి వర్మ (79 నాటౌట్‌బీ 42 బంతుల్లో 11ఐ4, 3ఐ6) వరుసగా రెండో మ్యాచ్‌లోనూ మెరుపు అర్ధశతకం సాధించడంతో లక్ష్యాన్ని భారత్ 13.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. నాలుగో టీ20 తిరువనంతపురంలోనే ఆదివారం జరుగుతుంది.

రేణుక, దీప్తి విజృంభణ: ప్రపంచకప్ తర్వాత భారత్ ఆడిన తొలి రెండు మ్యాచ్‌ల్లో తుది జట్టులో లేని పేసర్ రేణుక సింగ్.. మూడో టీ20లో బరిలోకి దిగి లంకను వణికించింది. స్పిన్నర్ దీప్తి కూడా గొప్పగా బౌలింగ్ చేయడంతో లంక ఏ దశలోనూ మెరుగైన స్కోరు సాధించేలా కనిపించలేదు. తొలి 4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 25 పరుగులు చేసిన ఆ జట్టు.. దీప్తి వేసిన అయిదో ఓవర్లో కెప్టెన్ చమరి ఆటపట్టు వికెట్‌ను కోల్పోయింది. 12 బంతుల్లో 3 పరుగులే చేయయడంతో అసహనానికి గురై భారీ షాట్‌కు ప్రయత్నించిన చమరి.. అమన్‌జ్యోత్‌కు క్యాచ్ ఇచ్చింది. తొలి స్పెల్‌లో ఒక్క ఓవరే వేసి 12 పరుగులు ఇచ్చిన రేణుక.. ఆరో ఓవర్లో తిరిగి బౌలింగ్‌కు వచ్చి లంకను గట్టి దెబ్బే తీసింది. ఒక ఎండ్‌లో నిలకడగా ఆడుతున్న హాసిని (25)తో పాటు హర్షిత సమరవిక్రమ (2)లను ఆమె ఔట్ చేసింది. తన తర్వాతి ఓవర్లో నీలాక్షిక (4) వికెట్‌ను సైతం రేణుకే పడగొట్టడంతో 10 ఓవర్లకు 45/4తో లంక పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో కవిష (20), ఇమేషా (27) పోరాడడంతో లంక కాస్త పుంజుకుంది. అయితే కవిషను దీప్తి ఔట్ చేయగా.. రేణుక తన చివరి ఓవర్లో ఒక్క పరుగూ ఇవ్వకుండా ఇమేషా వికెట్ పడగొట్టింది. ఆఖర్లో కౌశిని (19) పోరాటంతో లంక స్కోరు వంద దాటింది. అనంతరం ఛేదనలో షెఫాలి దూకుడుగా ఆడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. స్మృతి (1) వరుసగా మూడో మ్యాచ్‌లోనూ నిరాశపరిచినా.. జెమీమా (9) కూడా ఎక్కువ సేపు నిలబడకపోయినా.. హర్మన్‌ప్రీత్ (21 నాటౌట్)తో కలిసి షెఫాలి జట్టును గెలిపించింది. భారత్ కోల్పోయిన రెండు వికెట్లనూ కవిష (2/18)నే పడగొట్టింది.

దీప్తి రికార్డు

టీమ్‌ఇండియా స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ.. ప్రపంచ రికార్డును అందుకుంది. టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కొనసాగుతున్న ఆస్ట్రేలియా పేసర్ మెగాన్ షట్ (151)ను ఆమె సమం చేసింది. శ్రీలంకతో మూడో టీ20లో 4 ఓవర్లలో 18 పరుగులిచ్చి 3 వికెట్లు తీసిన దీప్తి.. షట్ రికార్డును చేరుకుంది. దీప్తి 131 టీ20ల్లో 18.73 సగటుతో 151 వికెట్లు తీసింది. షట్ కంటే దీప్తి 8 మ్యాచ్‌లు ఎక్కువ ఆడింది. మొత్తంగా మహిళల క్రికెట్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో దీప్తి (333) మూడో స్థానంలో ఉంది. జులన్ గోస్వామి (భారత్-355), కేథరిన్ బ్రంట్ (ఇంగ్లాండ్-335) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. శ్రీలంకతో టీ20 సిరీస్ ముగిసేలోపు ఆమె రెండో స్థానానికి చేరుకోవచ్చు.

శ్రీలంక ఇన్నింగ్స్: హాసిని పెరీరా (సి) దీప్తి (బి) రేణుక 25బీ చమరి ఆటపట్టు (సి) హర్మన్‌ప్రీత్ (బి) దీప్తి 3బీ హర్షిత సమరవిక్రమ (సి) అండ్ (బి) రేణుక 2బీ ఇమేషా (సి) జెమీమా (బి) రేణుక 27బీ నీలాక్షిక ఎల్బీ (బి) రేణుక 4బీ కవిష (సి) అమన్‌జ్యోత్ (బి) దీప్తి 20బీ కౌషిని నాటౌట్ 19బీ మల్షా (బి) దీప్తి 5బీ మల్కి నాటౌట్ 1బీ ఎక్స్‌ట్రాలు 6 మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 112బీ వికెట్ల పతనం: 1-25, 2-31, 3-32, 4-45, 5-85, 6-90, 7-98బీ బౌలింగ్: రేణుక సింగ్ 4-1-21-4బీ క్రాంతి గౌడ్ 4-0-22-0బీ దీప్తి శర్మ 4-0-18-3బీ వైష్ణవి శర్మ 3-0-14-0బీ అమన్‌జ్యోత్ 4-0-23-0బీ శ్రీ చరణి 1-0-11-0

# మన శరీరం ఎప్పటికప్పుడు తనను తాను సరిగ్గా రిపేర్ చేసుకోవాలంటే.. ఇవి తప్పనిసరి..!

మన శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే మన శరీరంలో డిటాక్సిఫికేషన్ ప్రక్రియ కూడా సాఫీగా సాగాలి. సాధారణంగా రాత్రి మనం నిద్రించిన సమయంలో మన శరీరంలో డిటాక్సిఫికేషన్ ప్రక్రియ జరుగుతుంది. ఇది మన శరీరంలో నిరంతరం సాగుతూనే ఉంటుంది. మన శరీరంలో ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు, ప్రేగులు, చర్మం వంటి ఐదు అవయవాలల్లో డిటాక్సిఫికేషన్ ప్రక్రియ జరుగుతుంది. వీటిలో ఏ ఒక్క అవయవంలోనైనా డిటాక్సిఫికేషన్ ప్రక్రియ జరగకపోతే శరీరంలో నొప్పి, వాపు, మంట, బరువు పెరగడం, హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఊపిరితిత్తులు శరీరం నుండి కార్బన్ డయాక్సైడ్ ను తొలగించలేనప్పుడు మనం అనారోగ్యానికి గురవుతాం. శరీరంలో వ్యర్థాలు పెరగడంతో పాటు గుండెదడ వంటి సమస్యలు కూడా తలెత్తుతాయి.

కాలేయం విషపదార్థాలను బయటకు పంపకపోతే దాని పనితీరు మందగిస్తుంది. ఫ్యాటీ లివర్, వాపులు, నొప్పులు, బద్దకం, అలసట వంటి సమస్యలు కూడా వస్తాయి. అలాగే మూత్రపిండాలు వ్యర్థాలను వడకట్టకపోతే శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరుగుతాయి. తద్వారా అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రేగులు మలం ద్వారా వ్యర్థాలను బయటకు పంపుతాయి. ఒకవేళ ప్రేగుల్లో డిటాక్సిఫికేషన్ సరిగ్గా జరగకపోతే గ్యాస్, మలబద్దకం, రోగనిరోధక శక్తి తగ్గడం, మైగ్రేన్ వంటి సమస్యలు తలెత్తుతాయి. అదే విధంగా చర్మం వ్యర్థాలను తొలగించకపోతే మొటిమలు, పొడిచర్మం, చికాకు, దురద వంటి సమస్యలు వస్తాయి. ఈ అవయవాలు సరిగ్గా పనిచేసి వ్యర్థాలను బయటకు పంపినప్పుడే శరీర ఆరోగ్యం సరిగ్గా ఉంటుంది. కానీ డిటాక్సిఫికేషన్ ప్రక్రియ సాఫీగా సాగక మనలో చాలా మంది అనేక రకాల అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు.



రెండు మార్గాలు..

డిటాక్సిఫికేషన్ ప్రక్రియ సరిగ్గా సాగాలంటే మనం రెండు పద్దతులను పాటించాలి. ఇవి రెండు కూడా సహజమైనవి, ఎటువంటి ఖర్చు కూడా ఉండదు. విశ్రాంతి, నిద్ర. ఇవి రెండు కూడా డిటాక్సిఫికేషన్ ప్రక్రియను మెరుగుపరుస్తాయి. డిటాక్సిఫికేషన్ ప్రక్రియ కోసం విశ్రాంతిని శరీరంతో పాటు పొట్టకు కూడా ఇవ్వాలి. ఇతర అనారోగ్య సమస్యలకు మందులు వాడే వారిలో వ్యర్థాలు ఎక్కువగా తయారవుతాయి. వీటిని బయటకు పంపించడం చాలా అవసరం. నిరంతరం తినడం వల్ల జీర్ణవ్యవస్థ నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది. దీంతో డిటాక్సిఫికేషన్ ప్రక్రియ మందగిస్తుంది. కనుక పొట్టకు విశ్రాంతిని ఇవ్వడం చాలా అవసరం. పొట్టకు విశ్రాంతి అనగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చేది ఉపవాసం. సూర్యాస్తమయం నుండి సూర్యోదయం వరకు మనం దాదాపు 12 గంటలు జీర్ణవ్యవస్థకు విశ్రాంతి ఇవ్వడం వల్ల డిటాక్సిఫికేషన్ ప్రక్రియ సాఫీగా సాగుతుంది.

ఉపవాసం ఎలా..?

అయితే మనం రోజూ ఉపవాసం చేయాల్సిన అవసరం కూడా లేదు. మన వీలుని బట్టి ఉపవాసం చేయడం వల్ల శరీరం నుండి వ్యర్థాలు తొలగిపోతాయి. జీర్ణాశయానికి విశ్రాంతిని ఇవ్వడం వల్ల మూత్రపిండాలు, కాలేయం, ప్రేగులకు కూడా విశ్రాంతి లభిస్తుంది. దీంతో శరీరం మొత్తం కూడా డీటాక్సిఫికేషన్ ప్రక్రియ మెరుగుపడుతుంది. ఇక డీటాక్సిఫికేషన్ ప్రక్రియ సాఫీగా సాగడానికి మనం తగినంత నిద్రించడం కూడా చాలా అవసరం. మనం నిద్రిస్తున్న సమయంలోనే మన శరీరంలో డిటాక్సిఫికేషన్ ప్రక్రియ సంభవిస్తుంది. కనుక నిద్రించడానికి చక్కటి వాతావరణం ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడం వల్ల చక్కని నిద్రను సొంతం చేసుకోవచ్చు. అలాగే నిద్రించడానికి గంట ముందు నుండే గాడ్జెట్లను వాడడం మానేయాలి. ఇలా చేయడం వల్ల నిద్రకు ఆటంకాలు కలగకుండా ఉంటాయి. ఈ విధంగా విశ్రాంతి, నిద్ర మన శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడానికి ఎంతగానో సహాయపడతాయి.

# కోడిగుడ్లలో ఉండే పసుపు పచ్చ సొనను తినడం మంచిదేనా..? ఎవరు తినాలి.. ఎవరు తినకూడదు..?

మన శరీరానికి కావల్సిన పోషకాలను అందించే ఆహారాల్లో కోడిగుడ్లు కూడా ఒకటి. కోడిగుడ్లు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో విటమిన్ ఎ, డి, ఇ, కె లతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్ వంటి పోషకాలు ఉంటాయి. వీటితో రకరకాల వంటకాలను తయారు చేసి తీసుకుంటూ ఉంటాం. ముఖ్యంగా గుడ్డును ఉడికించి తీసుకోవడం వల్ల మనం మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అయితే మనలో చాలా మందికి గుడ్డులోని పచ్చసొనను తీసుకోవాలా వద్దా అనే సందేహం ఉంటుంది. తెల్లసొనలో లాగా పచ్చసొనలో కూడా అనేక రకాల పోషకాలు ఉంటాయి. పచ్చసొనను తీసుకోవడం వల్ల మన శరీరానికి మరింత మేలు కలుగుతుంది. గుడ్డులోని పచ్చసొనను తీసుకోవడం వల్ల మనకు కలిగే ప్రయోజనాల గురించి పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు.



అనేక పోషకాలు..

గుడ్డులోని పచ్చసొనలో విటమిన్ ఎ, డి, ఇ వంటి పోషకాలు ఉంటాయి. సెలీనియంతో పాటు ఇతర ఖనిజాలు ఉంటాయి. దీనిని తీసుకోవడం వల్ల శరీరంలో పోషకాల లోపం తలెత్తకుండా ఉంటుంది. గుడ్డులోని పచ్చసొనలో కోలిన్ ఉంటుంది. ఇది మెదడు అభివృద్దికి, మెదడు పనితీరును మెరుగుపరచడానికి సహాయపడుతుంది. పచ్చసొనలో లుటిన్, జియాక్సంతిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కంటిచూపును మెరుగుపరచడంలో సహాయపడతాయి. గుడ్డు పచ్చసొనలో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. తద్వారా శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. ఇక దీనిలో నాణ్యమైన ప్రోటీన్ ఉంటుంది. ఇది శరీరానికి కావల్సిన శక్తిని అందించడంలో సహాయపడుతుంది. గుడ్డులోని పచ్చసొనను తీసుకోవడం వల్ల శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. పచ్చసొనలో ఉండే విటమిన్ డి క్యాల్షియం శోషణలో సహాయపడుతుంది. దీంతో ఎముకలు ధృడంగా తయారవుతాయి.

ఎవరు తినకూడదు..?

గుడ్డులోని పచ్చసొనలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మాన్ని రక్షించడంలో వృద్దాప్య ఛాయలను తగ్గించడంలో దోహదపడతాయి. ఈవిధంగా గుడ్డులోని పచ్చసొనను తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. అయితే పచ్చసొన ఆరోగ్యకరమే అయినప్పటికి దీనిని తీసుకోవడం వల్ల మనం కొన్ని దుష్ప్రభావాలను కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. గుడ్డులోని పచ్చసొనలో కొలెస్ట్రాల్ అధికంగా ఉంటుంది. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉన్నవారు దీనిని తీసుకోకపోవడమే మంచిది. గుడ్డులోని పచ్చసొనలో ఉండే అధిక కొలెస్ట్రాల్ కారణంగా గుండె జబ్బులు వంటి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉంది. అలాగే గుడ్డులోని పచ్చసొన కొందరిలో అలర్జీకి కూడా దారి తీస్తుంది. ఇక పూర్తిగా ఉడకని పచ్చసొనలో సాల్మోనెల్లా బ్యాక్టీరియా ఉంటుంది. సరిగ్గా ఉడికించని పచ్చసొనను తీసుకోవడం వల్ల అనారోగ్యానికి గురి కావాల్సి వస్తుంది. గుడ్డులోని పచ్చసొనలో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. కనుక బరువు తగ్గాలనుకునే వారు దీనిని తీసుకోకపోవడమే మంచిది.

గుడ్డులోని పచ్చసొన మన ఆరోగ్యానికి మేలు చేసేదే అయినప్పటికీ గుండె జబ్బులు, అధిక బరువు, అధికంగా కొలెస్ట్రాల్ స్థాయిలు కలిగి ఉన్నవారు, వ్యాయామం చేయని వారు దీనిని తీసుకోకపోవడమే ఉత్తమమని వైద్యులు చెబుతున్నారు. ఇక శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు, ఎదిగే పిల్లలు, గర్భిణీలు దీనిని వైద్యుల సలహా మేరకు తీసుకోవడం మంచిది. కనుక మనం చేసే పనిని బట్టి, మన ఆరోగ్యానికి అనుగుణంగా గుడ్డులోని పచ్చసొనను తీసుకోవడం మంచిది.

# అసలు ఉపవాసం చేస్తే ఏం జరుగుతుంది..? దీన్ని ఎవరూ అనుసరించకూడదు..?

%ఖీఖర్ అఅస్త్ర% ఎ బరువు తగ్గడానికి, శరీర జీవక్రియను పెంచడానికి మనలో చాలా మంది ఉపవాసం చేస్తూ ఉంటారు. అలాగే కొందరు ఆధ్యాత్మిక భావనతో వారి మతాచారాలకు తగ్గట్టు ఉపవాసం చేస్తూ ఉంటారు. ఒక రోజంతా



చేసే ఉపవాసం, డీటాక్స్ ఉపవాసాలు, దీర్ఘకాలిక ఉపవాసాలు ఇలా అనేక రకాల ఉపవాసాలు వాడుకలో ఉన్నాయని చెప్పవచ్చు. ఉపవాసాలు చేయడం వల్ల బరువు తగ్గడం, రక్తంలో చక్కెర స్థాయిలు కొంత వరకు తగ్గడం, జీవక్రియల వేగం పెరగడం వంటి లాభాలు ఉంటాయి. కానీ గుండె జబ్బులు ఉన్నవారు మాత్రం ఉపవాసం చేయకూడదని వైద్యులు చెబుతున్నారు. అధిక రక్తపోటు, కొరోనరీ ఆర్టరీ వ్యాధులు, అరిథ్మియా వంటి సమస్యలు ఉన్నవారు ఉపవాసం చేయడం వల్ల వారిలో చక్కెర స్థాయిలు, ఎలక్ట్రోలైట్ సమతుల్యత, నీటి శాతం తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఉపవాసం చేయడం వల్ల వారు జీవించే లయకు ఆటంకం కలుగుతుంది. ఇవన్నీ గుండెపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయని అంటున్నారు.

ఈ సమస్యలు వచ్చే అవకాశం..

ఉపవాసం చేయడం మొదలు పెట్టినప్పుడు చురుకుగా బాగానే ఉన్న దీర్ఘకాలం పాటు ఉపవాసం చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ప్రమాదకర స్థాయిలో తగ్గుతాయి. నీరసం, దడ, వణుకు, మూర్ఛ వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఎలక్ట్రోలైట్ స్థాయిలు తగ్గుతాయి. హృదయ స్పందనల్లో మార్పులు వస్తాయి. డీహైడ్రేషన్ కారణంగా రక్తప్రసరణ తగ్గుతుంది. ఇది గుండెపై ఒత్తిడిని కలిగిస్తుంది. రక్తపోటు కూడా పెరుగుతుంది. ఇక బీటా బ్లాకర్స్, యాంటీ అరిథమిక్స్, బ్లడ్ థిన్నర్స్ వంటి మందులు వాడే వారు ఆహారంతో పాటు నిర్దిష్ట సమయంలో మందులను వేసుకోవాలి. ఉపవాసం చేస్తూ ఈ మందులు వేసుకోవడం వల్ల తలతిరగడం, లోబీపీ, రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గడం, హైబీపీ వంటి సమస్యలు తలెత్తుతాయి.

ఎలక్ట్రోలైట్స్ స్థాయిలు..

ఎక్కువ సమయం ఉపవాసం చేయడం వల్ల పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం స్థాయిలు తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇవి అరిథ్మియాను రేకెత్తిస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఉపవాసం చేయడం వల్ల ఒత్తిడి హార్మోన్ ఎక్కువగా విడుదల అవుతుంది. ఇది హృదయ స్పందన రేటును, రక్తపోటును పెంచుతుంది. కనుక గుండె జబ్బులు ఉన్నవారు ఉపవాసం చేయకపోవడమే మంచిది. గుండె జబ్బులు ఉన్నవారు ఒకవేళ ఉపవాసం చేయాల్సి వస్తే వైద్యుల సూచనలను పాటించాలి. అలాగే ఉపవాసానికి ముందు ఉపవాసం చేసిన తరువాత తగినంత నీటిని తాగాలి. ఇలా చేయడం వల్ల రక్తప్రసరణ మెరుగుపడుతుంది. గుండెపై ఒత్తిడి పడకుండా ఉంటుంది. అలాగే వైద్యుడి సలహా మేరకు ఎంత సమయం వరకు ఉపవాసం చేయాలి అనే వివరాలను తెలుసుకోవాలి.

గుండె జబ్బులు ఉంటే..

ఉపవాసం చేసిన తరువాత ఎలక్ట్రోలైట్ల సమతుల్యానికి పొటాషియం, మెగ్నీషియం, ప్రోటీన్ ఉండే ఆహారాలను ఎంచుకోవాలి. అలాగే గుండె జబ్బులు ఉన్నవారు 12 గంటల కంటే ఎక్కువగా ఉపవాసం చేయకూడదు. ఉపవాసం ఎక్కువగా చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గడంతో పాటు బీపీ కూడా తగ్గుతుంది. ఇక ఉపవాసం చేసే సమయంలో ఛాతీలో నొప్పి, తలతిరగడం, దడ, వణుకు, నీరసం వంటి సమస్యలు తలెత్తితే వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. ఉపవాసం మంచిదే అయినప్పటికీ గుండె జబ్బులు ఉన్నవారికి ఇది మంచిది కాదు. గుండె జబ్బులతో బాధపడే వారు జాగ్రత్తగా, ప్రణాళికతో చేయడం మంచిది.

# ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారిలో కనిపించే లక్షణాలు ఇవే.. ఇలా జరుగుతుంటే జాగ్రత్త..!

%ఖీఫ్ఎ వాఅజవతీ వాఎఎజ్ఞ్శీఎం% ఎ ప్రస్తుత కాలంలో వయసుతో సంబంధం లేకుండా అన్ని వయసుల వారిని వేధిస్తున్న అనారోగ్య సమస్యల్లో ఫ్యాటీ లివర్ కూడా ఒకటి. ఒక్కప్పుడు మద్యం ఎక్కువగా తీసుకునే వారిలో మాత్రమే ఈ సమస్య ఉండేది. కానీ ఇప్పుడు మద్యం తాగని వారిలో కూడా మనం ఈ సమస్యను చూడవచ్చు. మారిన జీవనశైలి, చక్కెరలు, అధిక కొవ్వులు ఉన్న ఆహారాలను తీసుకోవడం వల్ల మద్యం తీసుకోని వారిలో అన్ని వయసుల వారిలో ఈ వ్యాధి వస్తోంది. ఇది శరీర ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు కాలేయ ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తుంది. కొన్నిసార్లు ఇది నాన్-ఆల్కహాలిక్ స్టీటోహైపటైటిస్, లివర్ ఫైబ్రోసిస్, సిర్రోసిస్ తో పాటు కొన్ని సందర్భాల్లో లివర్ క్యాన్సర్ కు కూడా దారి తీస్తుంది. కనుక ఫ్యాటీ లివర్ సమస్య నుండి త్వరగా బయటపడడం చాలా అవసరం. ఫ్యాటీ లివర్ సమస్యను నియంత్రించడంతో పాటు దీని లక్షణాలను ముందుగా గుర్తించడం కూడా చాలా అవసరం. కనుక ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడే వారిలో కనిపించే సంకేతాలు, లక్షణాల గురించి తెలుసుకోవాల్సి ఉంటుంది.



అధిక బరువు..

ఈ సమస్యతో బాధపడే వారు ఊహించని విధంగా బరువు పెరుగుతారు. ముఖ్యంగా పొట్ట చుట్టూ కొలత పెరగడం ఫ్యాటీ లివర్ సమస్యకు ఒక కారణం కావచ్చు. పొట్ట చుట్టూ అధికంగా కొవ్వు పేరుకుపోవడం అంతర్లీనంగా ఉన్న కాలేయ సమస్యలను కూడా సూచిస్తుంది. రక్తంలో పెరిగిన చక్కెరలు ఫ్యాటీ లివర్ సమస్యను కూడా సూచిస్తాయని చెప్పవచ్చు. ఫ్యాటీ లివర్ జీవక్రియలను దెబ్బతీయడంతో పాటు కాలేయ పనితీరు మందగించేలా చేస్తుంది. దీంతో ఇన్సులిన్ నిరోధకత పెరిగి రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. కనుక రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగితే కాలేయ పనితీరుకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవడం కూడా మంచిది. మనకు అలసట రావడం సహజమే. కానీ విశ్రాంతి తీసుకున్నప్పటికీ అలసట రావడం, ఎప్పుడూ నీరసంగా ఉండడం కూడా ఫ్యాటీ లివర్ కి ఒక సంకేతమే. శరీరానికి తగినంత శక్తిని అందించడంలో కాలేయం ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఫ్యాటీ లివర్ కారణంగా కాలేయ పనితీరు తగ్గుతుంది. దీంతో ఎప్పుడు అలసటగా ఉండడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

చర్మం, కళ్ల రంగు..

ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడే వారిలో చర్మం, కళ్లు పసుపు రంగులోకి మారిపోతాయి. కామెర్లు రావడాన్ని తీవ్రమైన ఫ్యాటీ లివర్ సమస్యగా భావించాలి. ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్య సహాయం తీసుకోవాలి. ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడే వారిలో పొత్తికడుపు పైభాగంలో కుడివైపు నొప్పిగా ఉంటుంది. వాపు కారణంగా కాలేయ పరిమాణం పెరుగుతుంది. దీంతో కడుపు నొప్పి వంటి సమస్యలు వస్తాయి. ఫ్యాటీ లివర్ సాధారణంగా శరీరంలో కొవ్వు స్థాయిలు ఎక్కువగా ఉండడాన్ని సూచిస్తుంది. అధిక కొలెస్ట్రాల్ కారణంగా కాలేయ పనితీరు తగ్గడంతో పాటు గుండె సంబంధిత జబ్బులు వచ్చే అవకాశం కూడా ఉంది.

జాగ్రత్తలు అవసరం..

మలం, మారిన మూత్రం రంగు కాలేయ అనారోగ్యాన్ని సూచిస్తాయి. బైలిరుబిన్ వల్ల మూత్రం ముదురు రంగులో వస్తుంది. లేత రంగు మలం పిత్త లోపాన్ని సూచిస్తుంది. కాలేయ పనితీరు మందగించడం వల్ల ఇలా జరుగుతుంది. కనుక ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య సహాయం తీసుకోవడం చాలా అవసరం. అంతేకాకుండా రోజూ వ్యాయామం చేయడం, సమతుల ఆహారాన్ని తీసుకోవడం, బరువు అదుపులో ఉంచుకోవడం వంటివి చేయాలి. ఆరోగ్యకరమైన కొవ్వులు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలను, లీన్ ప్రోటీన్లను ఎక్కువగా తీసుకోవాలి. ప్రాసెస్ చేసిన ఆహారాలను, చక్కెరలను తక్కువగా తీసుకోవాలి. నీటిని ఎక్కువగా తాగాలి. నీటిని తాగడం వల్ల కాలేయం పనితీరు మెరుగుపడి వ్యర్థాలు బయటకు పోతాయి. మద్యం సేవించడం మానేయాలి. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవాలి. ఇలా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ మంచి జీవనశైలిని అలవరుచుకోవడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య నుండి చాలా సులభంగా బయటపడవచ్చు.





# దాని గురించి మాట్లాడటం ఇష్టం లేదు: నిధి అగర్వాల్

ప్రభాస్‌తో కలిసి 'ది రాజాసాబ్' అంటూ సందడి చేసేందుకు నిధి అగర్వాల్ సిద్ధమయ్యారు. వీరిద్దరి కాంబోలో తెరకెక్కిన ఈ సినిమా జనవరి 9న విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా నిధి వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నారు.

"ఈ సినిమాలో ప్రతిఒక్కరి పాత్రకు ప్రాధాన్యం ఉంది. ప్రభాస్ 6.2 అడుగులు, నేను 5.7 అడుగులు.. ఆయన హైట్‌ను బ్యాలెన్స్ చేయడం కోసం పెద్ద హీల్స్ వేసుకుని యాపిల్ బాక్స్‌లపై నిల్చున్నా. సహనా సహనా సాంగ్‌ను స్క్రీన్‌పై కొత్తగా చూస్తారు. కాస్ట్యూమ్స్ చాలా కలర్‌ఫుల్‌గా కనిపిస్తాయి. నిర్మాత ఏ విషయంలోనూ రాజీ పడలేదు. తెర పైనే కాదు.. నిజజీవితంలోనూ ప్రభాస్ స్వీట్ పర్సన్. నా కెరీర్‌లో అంత మంచి వ్యక్తిని చూడలేదు. ఆయన అతిథి మర్యాదల గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఇంటి నుంచి భోజనం తెప్పిస్తారు. నేను విరామ సమయంలో కుటుంబంతో గడుపుతాను. ధ్యానం చేసుకుంటా. సామాజిక సేవ కూడా చేస్తాను. కానీ, దాని గురించి బయటకు చెప్పడం నాకు ఇష్టం లేదు. విదేశాల్లో షూటింగ్‌కు వెళ్లినప్పుడు చిన్న గ్యాస్ సిలిండర్ వెంట తీసుకెళ్తాను. ప్రతిరోజు టిఫిన్, డిన్నర్ నేనే వండుకుంటాను"



"రాజాసాబ్ విడుదలయ్యాక నా అప్‌కమింగ్ ప్రాజెక్ట్‌ల గురించి చెబుతాను. తెలుగులో మూడు సినిమాలు చేస్తున్నా. ఇతర భాషల్లోనూ కొన్నిటికి సైన్ చేశా. 2026 మొత్తం బిజీనే. నాకు ఓటీటీ సినిమాలంటే ఇష్టం. డైరెక్ట్ ఓటీటీ ప్రాజెక్ట్‌లు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నా. మంచి కథ ఉంటే కచ్చితంగా చేస్తా. 2025లో రెండు ప్రత్యేక అనుభవాలు ఉన్నాయి. రాజాసాబ్ షూటింగ్, 'హరి హర వీరమల్లు' ప్రచార సమయంలో పవన్ నన్ను ప్రశంసించడం ఎప్పటికీ మర్చిపోలేను" అని నిధి చెప్పారు.

# ఫ్యాషన్ డ్రెస్‌లు ధరించడం తప్పు కాదు: శివాజీ కామెంట్స్‌పై నాగబాబు స్పందన

మహిళల డ్రెస్‌ల విషయంలో శివాజీ చేసిన కామెంట్స్‌ను నాగబాబు తప్పు పట్టారు. సమాజం పురుషాధిక్య ఆలోచనలతో నడుస్తోందని వాటినుంచి బయటకు రావాలన్నారు. మోడ్రన్ దుస్తులు ధరించడం తప్పు కాదన్నారు. మహిళలపై జరుగుతోన్న అత్యాచారాలు వారి డ్రెస్‌ల వల్ల కాదని.. మగవాళ్ల క్రూరత్వం వల్ల అని నాగబాబు అన్నారు. ఈ అంశంపై తన అభిప్రాయాన్ని తెలుపుతూ ఇన్‌స్టా వేదికగా సుదీర్ఘ వీడియో విడుదల చేశారు.

"నేను రాజకీయ నాయకుడిగానో, ఇండస్ట్రీకి చెందిన నటుడిగానో దీనిపై స్పందించడం లేదు.. ఒక సామాన్య వ్యక్తిగా దీని గురించి మాట్లాడుతున్నాను. అలాగని నేను శివాజీని టార్గెట్ చేయడం లేదు.. ఒకవేళ మీరు అలా అనుకుంటే నేనేం చేయలేను. ఆడపిల్లలు ఎలా ఉండాలి.. వాళ్లు ఎలాంటి దుస్తులు ధరించాలి.. ఏం మాట్లాడాలి.. ఏం మాట్లాడకూడదు అనే విషయాలపై ప్రతిఒక్కరూ ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యానిస్తున్నారు. అలా కామెంట్స్ చేయడం రాజ్యాంగం ప్రకారం తప్పు. ఆడవాళ్లు ఇలాంటి డ్రెస్‌లు మాత్రమే వేసుకోవాలి అని చెప్పడానికి మీకేం హక్కు ఉంది. ప్రతి ఆడపిల్లకు ఆత్మగౌరవం ఉంటుంది. ప్రపంచంలో ఫ్యాషన్ అనేక రకాలుగా మారుతూ ఉంటుంది. ప్రతి ఆడపిల్లను కుటుంబసభ్యురాలిలానే చూడండి. మగవారితో సమానంగా బతికే హక్కు మహిళలకు కూడా ఉంటుంది" అని అన్నారు.

ఇక ఆత్మరక్షణ కోసం ప్రత్యేక విద్య నేర్చుకోవాలని ఆడపిల్లలకు ఆయన సూచించారు. "మీరు ఎలాంటి దుస్తులైనా ధరించండి. బయటకు వెళ్లేటప్పుడు మీ రక్షణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోండి. నేను మగవాళ్లందరినీ తప్పుపట్టడం లేదు.. కొందరి గురించి మాత్రమే చెబుతున్నాను. ఆడవాళ్లను అవమానించిన వారు బాగు పడినట్లు ఎక్కడా లేదు. మహిళలకు నాలాంటి వారు ఎప్పుడూ అండగా ఉంటారు. ఇలాంటి అంశంపై స్పందించడం ప్రతిఒక్కరి బాధ్యత" అని నాగబాబు చెప్పారు.

# చిక్కుల్లో ధురంధర్ నటుడు అక్షయ్ ఖన్నా.. లీగల్ నోటీసు పంపిన 'దృశ్యం 3' నిర్మాత

: ధురంధర్‌తో భారీ ఫేమ్ సొంతం చేసుకున్న బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా చిక్కుల్లో పడ్డారు. 'దృశ్యం 3' నిర్మాత కుమార్ మంగత్ పాఠక్ అతడిపై దావా వేశారు. లీగల్ నోటీసు పంపినట్లు వెల్లడించారు. దృశ్యం 3 3) కోసం చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించారని, సినిమాలో భాగంకావడం లేదని టెక్ట్స్ మెసేజ్ పంపించారని నిర్మాత ఆరోపించారు. తమ మధ్య ఒప్పందం జరిగిందని, అప్పుడే కొంతమొత్తంలో అడ్వాన్స్ చెల్లించినట్లు చెప్పారు. షూటింగ్‌పై ప్రభావం పడటంతో అక్షయ్ స్థానంలో జైదీప్ అహ్లావత్ ను తీసుకున్నట్లు వెల్లడించారు.

"రెండేళ్లుగా దృశ్యం 3 సినిమా కోసం పనిచేస్తున్నాం. అక్షయ్ ఖన్నాకు ఆ విషయం తెలుసు. స్క్రిప్ట్ మొత్తం విన్నప్పుడు అతనికి నచ్చింది. అన్నీ మాట్లాడుకున్న తర్వాతే సంతకాలు చేసుకున్నాం. కానీ ఒకరోజు ఈ సినిమా చేయట్లేదని మెసేజ్ పంపారు. అతడిని సంప్రదించాలని ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు. తదుపరి



చర్యలపై నిర్ణయం తీసుకుంటాం" అని పాఠక్ వెల్లడించారు. ఈ వ్యాఖ్యలపై అక్షయ్ టీమ్ నుంచి ఎలాంటి స్పందనారాలేదు.

అజయ్ దేవ్‌గణ్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న దృశ్యం 3.. 2026, అక్టోబర్ 2న విడుదల కానుంది. నటి శ్రియ శరణ్ రజత్ కపూర్, టబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా..దృశ్యం 2లో భాగమైన అక్షయ్ ఇటీవల విడుదలైన ధురంధర్ చిత్రంతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఆ చిత్రంలో అతడు వేసిన స్టెప్పులు నెట్టింట్లో వైరల్ అయిన సంగతి తెలిసిందే.

# బిగ్‌బాస్.. బాక్సాఫీస్.. బాలీవుడ్ 'భాయ్' సల్మాన్‌కు 60 ఏళ్లు..

సల్మాన్‌ఖాన్ ఎప్పుడూ ఒక మాట చెబుతాడు.. '20లో చేసినట్లు 40లో చేయడం కష్టం'. కానీ, ఆ కష్టాన్ని కూడా ఇష్టంగా చేస్తాడు కాబట్టే, 60ల్లోనూ సల్మాన్‌కు ప్రేక్షకుల్లో ఆ క్రేజ్ తగ్గలేదు. అందుకే సినిమాతో బాక్సాఫీస్ దగ్గర గర్జించే 'టైగర్' అయ్యాడు. ఇంటిల్లిపాదీని అలరించే 'బిగ్‌బాస్'గా మారాడు... వినోదాలు, వివాదాలతో సల్మాన్ జీవితం సమతూకం. 60వ పడిలో అడుగు పెట్టిన సల్మాన్ గురించి కొన్ని ఆసక్తికర విషయాలు...

భాయ్ కాదు.. 'ప్రేమ్' అంటే ఎంతో ప్రేమ

ఇప్పుడందరూ సల్మాన్‌ఖాన్ 'భాయ్' అంటున్నారు. కానీ, 90వ దశకంలో అమ్మాయిల కలల రాకుమారుడు సల్మాన్ అలియాస్ ప్రేమ్. అవును ఆ పేరుకున్న మహత్యం అలాంటిది. అమ్మాయిలకు ఆ పేరంటే క్రష్. తమకు కాబోయేవాడు కూడా ప్రేమ్‌లా ఉండాలని అనుకునేవారు. అందుకే ప్రేమ్ పాత్రతో ఏకంగా 12 సినిమాలు చేస్తే అందులో 10 బ్లాక్ బస్టర్ హిట్స్. 'హమ్ దిల్ దే చక్ సనమ్', 'హమ్ ఆప్కే హై కౌన్', 'మైనే ప్యారీ కియా'లో ప్రేమికుడి పాత్రలు సల్మాన్‌కు యువతలో విశేషమైన క్రేజ్ తీసుకొచ్చాయి. ఇక 'అందాజ్ అప్నా అప్నా' కల్ట్ క్లాసిక్. 'మైనే ప్యార్ కౌన్ కియా', 'హలో బ్రదర్' చిత్రాలు కామెడీతో పాటు, సల్మాన్‌లోని మాస్ ఎనర్జీని ప్రపంచానికి చూపాయి.

నటుడు మాత్రమే కాదు.. చిత్రకారుడు కూడా..

తండ్రి సలీమ్‌ఖాన్‌లాగానే సల్మాన్ మంచి రచయిత. 'బాఘీ' చిత్రానికి కథ అందించాడు. ఇక సల్మాన్ హాబీల్లో ముందుండేది పెయింటింగ్. ఏం కాస్త టైమ్ దొరికినా బొమ్మలు గీస్తారు. 'జైహో' పోస్టర్ సల్మాన్ వేసిందే. సల్మాన్ తన పెయింటింగ్‌లతో ఎగ్జిబిషన్ కూడా పెడతారు. పలువురు స్టార్‌లు ఆయన పెయింటింగ్‌లను కొనుగోలు చేశారు. అలా వచ్చిన మొత్తాన్ని సల్మాన్‌ఖాన్ ఫౌండేషన్, బీయింగ్ హ్యూమన్ సంస్థల ద్వారా సేవా కార్యక్రమాలకు వినియోగిస్తాడు. అంతేకాదు, పారితోషికంలో అత్యధిక భాగమూ వాటికే కేటాయిసా

కండ కలవాడే మనిషోయ్..

'గురజాడ' చెప్పింది సల్మాన్‌ఖాన్ బాగా ఆకళింపు చేసుకున్నారు. సల్మాన్ పేరు చెబితే గుర్తొచ్చేది ఆయన కండలే. భారత్‌లో జిమ్ కల్చర్ పెరగడానికి సల్మాన్ కూడా ఒక కారణం. ఆయనలా సిక్స్ ప్యాక్ సాధించాలని హృతిక్ రోషన్ సహా ప్రతీ యువకుడు ఆరాటపడ్డాడు. ఈ విషయంలో సోనాక్షి సిన్హా, సోనమ్ కపూర్, అర్జున్ కపూర్, సోనూసూద్‌లాంటి వారెందరికో సల్మాన్ గాడ్ ఫాదర్. 'సన్నబడితే హీరోయిన్‌గా ఛాన్స్ ఇస్తా' అని చెప్పి, 'దబాంగ్'లో సోనాక్షికి అవకాశమిచ్చారు.

సింగిల్ స్క్రీన్‌లకు ప్రాణం పోసి..

అది 2009. ముంబయి సహా ఉ



త్తరాది నగరాల్లో మల్టీప్లెక్స్ ట్రెండ్ ఊపందుకుంటోంది. క్రమంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లకు ఆదరణ తగ్గుతోంది. సరిగ్గా అప్పుడే వచ్చింది 'వాంటెడ్'. తెలుగులో విజయవంతమైన 'పోకిరి'ని ప్రభుదేవా దర్శకత్వంలో 'వాంటెడ్'గా సల్మాన్ తీసి బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు. కొన్నాళ్ల పాటు, సింగిల్ స్క్రీన్‌లకు ఆ సినిమా ప్రాణం పోసింది.

అవును నాకా సమస్య ఉంది..

సాధారణంగా హీరోలు తమలోని లోపాలను, ఆరోగ్య సమస్యలను బయటకు తెలియనీయరు. కానీ, సల్మాన్ ఏవీ దాచుకోలేదు. తాను 'ఏవీ మాల్ఫోర్మేషన్', 'బ్రెయిన్ ఎన్యోరిజమ్'తో ఇబ్బందిపడుతున్నట్లు చెప్పారు. ట్రైజెమినల్ న్యూరల్జియా (ముఖ భాగంలో వచ్చే తీవ్రమైన నొప్పి), ఏవీ మాల్ఫోర్మేషన్ (రక్తనాళాల్లో నెలకొన్న అసాధారణ పరిస్థితి), బ్రెయిన్ ఎన్యోరిజమ్ (మెదడులో వచ్చే చిన్నపాటి సమస్య) ఉన్నప్పటికీ వాటితో పోరాడి తనని తాను రీస్టార్ట్ చేసుకున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఫేషియల్ నర్వ్ డిజార్డర్ సల్మాన్‌ను ఎంతో ఇబ్బంది పెట్టింది.

అందుకే పెళ్లి చేసుకోలేదు..

సల్మాన్ ప్రెస్‌మీట్‌లకు వెళ్తే, విలేకరులు అడిగే ప్రశ్నల్లో 'మీ పెళ్లెప్పుడు' అనేది కామన్. ఇప్పుడు ఆయనకు 60. ఒక దశ దాటిన తర్వాత పెళ్లి చేసుకోకపోవడానికి కారణాన్ని సల్మాన్ పంచుకున్నారు. వివాహం, విడాకులు భావోద్వేగపరంగా, ఆర్థికంగా ఎంతో కఠినమైన విషయాలంటారు. వాటిని కొనసాగించడం అంత సులభం కాదని చెబుతారు.

పెళ్లి వద్దు కానీ, పిల్లలు కావాలి..

భవిష్యత్‌లో తప్పకుండా తనకు పిల్లలు కావాలని సల్మాన్ అంటారు. ఒక బిడ్డ ఉంటే బాగుంటుందని, తనకు పిల్లలు పుడితే, తన కుటుంబం వారి ఆలనా పాలనా చూసుకుంటుందని ఇటీవల కూడా అభిప్రాయపడ్డారు.

# ఎన్నో విమర్శలు.. సరిదిద్దుకుంటా: లోకేశ్ కనగరాజ్

తన గత చిత్రంపై చాలా విమర్శలు వచ్చాయని వాటిని సరిదిద్దుకుంటానని దర్శకుడు లోకేశ్ కనగరాజ్ అన్నారు. రజనీకాంత్ హీరోగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'కూలీ'. ఈ ఏడాది ఆగస్టులో ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా గురించి లోకేశ్ ( తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని విడుదల సమయంలో వచ్చిన విమర్శల గురించి ప్రస్తావించారు.

"కూలీ' సినిమాపై ఎన్నో విమర్శలు వచ్చాయి. నేను తర్వాత తీయనున్న చిత్రంలో వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తాను. అన్ని ట్రోల్స్ వచ్చినప్పటికీ ప్రేక్షకులు రజనీకాంత్ కోసం సినిమా చూశారు. దీనికి రూ.500 కోట్లు వచ్చాయని నిర్మాతలు చెప్పారు. ఈ విషయంలో అందరికీ ధన్యవాదాలు చెప్పాలి. నేను అంచనాల ఆధారంగా కథలు రాయలేను. రాసుకున్న కథలోని పాత్రలు ప్రేక్షకుల అంచనాలు అందుకుంటే ఆనందిస్తాను. ఒకవేళ అలా అందుకోలేకపోతే.. తర్వాత సినిమాలో అయినా వాటికోసం ప్రయత్నిస్తాను" అని తెలిపారు.



రజనీకాంత్, నాగార్జున, శ్రుతి హాసన్, సత్యరాజ్, ఉపేంద్ర, ఆమిర్ ఖాన్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా రజనీ తన మార్క్‌తో అలరించారు. 'వార్ 2'తో పోటీపడిన ఈ మూవీ రూ.500 కోట్లు వసూలు చేసింది. స్నేహితుడి ఆకస్మిక మరణం వెనక కారణాలను తెలుసుకునే దేవ పాత్రలో రజనీకాంత్ కనిపించారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy